

కొత్తగా 10,650 ఎంబీబీఎస్ సీట్లు

41 నూతన కాలేజీలకూ ఎన్ఎంసీ ఆమోదం

2

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

దీపావళి శుభాకాంక్షలు

సోమవారం | 20-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 185 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: చతుర్దశి మ.3.45 తదుపరి అమావాస్య నక్షత్రం: హస్త రా.8.17 తదుపరి చిత్త, వర్జ్యం: తె.5.11-6.57, దుర్ముహూర్తం: మ.12.22-1.09, మ.2.41-3.27, అమృతఘడియలు: మ.1.40-3.26, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.13, సూర్యాస్తమయం: 5.46 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఏపీ టు ఏఐ!

అంతర్జాతీయ కార్యక్రమంగా విశాఖ సదస్సు: సీఎం

కంపెనీలతో పాటు రాష్ట్రాల సీఎంలు, మంత్రులు, నిపుణులకూ ఆహ్వానం

పెట్టుబడులు, ఒప్పందాలపైనే కాదు విజ్ఞానం పంచుకోవడంపైనా మేధోమథనం

ప్లీనరీ, బ్రేకవుట్ సెషన్లు నిర్వహించాలి

ఇన్వెస్టర్లు, విధాన రూపకర్తల మధ్య చర్చలు సెమీకండక్టర్లు, ఆరోగ్యం, ఆవిష్కరణలపైనా..

పరిశోధన-అభివృద్ధి, అంతరిక్షం, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్, లాజిస్టిక్స్‌పై కూడా

పారిశ్రామిక ప్రగతికి పాలసీలే కీలకం

రాష్ట్ర నూతన పారిశ్రామిక విధానాల వల్లే భారీ పెట్టుబడులతో దిగ్గజ కంపెనీల రాక

గూగుల్‌తో హ్యాపెనింగ్ సిటీగా విశాఖ

మానవ వనరులే అతిపెద్ద మూలధనం

సదస్సుపై అధికారులతో బాబు సమీక్ష



జీఎస్టీ 2.0పై అవగాహనా కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం విజయవాడ బీసెంట్ రోడ్డులో పర్యటించిన సీఎం చంద్రబాబు పూలు, ప్రమిదలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

అమరావతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విశాఖలో వచ్చే నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సులో పెట్టుబడులతో పాటు సానుకూల విధాన రూపకల్పనపైనా చర్చ జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. కేవలం పెట్టుబడులు, ఒప్పందాలకే పరిమితం కాకుండా విజ్ఞానం పంచుకోవడం, వివిధ అంశాలపై మేధోమథనం జరిగేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. కృత్రిమ మేధ(ఏఐ)కు రాష్ట్రం చిరునామా కావాలన్నారు. 'ఏపీ టూ ఏఐ' అన్న నినాదంతో ముందుకెళ్లాలని సూచించారు. ఆదివారం సీఎం క్యాంపు కార్యాలయంలో విశాఖ భాగస్వామ్య సదస్సు

మిగతా 13వ పేజీలో...

పరిశ్రమలకు తీపి కబురు

1500 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలు తొలి విడతగా త్వరలో విడుదల

పారిశ్రామికవేత్తలకు అండ

పెట్టుబడులకు గమ్యస్థానంగా ఏపీ

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన

చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ హర్షం

12

రాజకీయ మూర్ఖులు ఎప్పటికీ బాగుపడరు!

పెట్టుబడులపై ఇష్టమొచ్చినట్లు వాగుతున్నారు

భవిష్యత్‌లో బ్రాండ్ ఏఐగా ఆంధ్రా

వైకుంఠపాళితో జీవితాలు బాగుపడవు

22 మంది ఎంపీలు ఉండడంతో కేంద్రంలో పనులన్నీ అవుతున్నాయి

ఉద్యోగులూ.. స్మార్ట్‌గా పనిచేయండి

సాయంత్రం 6 తర్వాత పనిచేయొద్దు

పున్నమి ఘాట్ దీపావళి వేడుకల్లో సీఎం

13



న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్ వద్ద భారీ సంఖ్యలో గుమిగూడిన ట్రంప్ వ్యతిరేక నిరసనకారులు

ట్రంప్‌పై పెల్లుబికిన ప్రజాగ్రహం

'నో కింగ్స్' నిరసనలతో దద్దరిల్లిన అమెరికా

దేశంలోని 50 రాష్ట్రాల్లోనూ రోడ్డెక్కిన ప్రజానీకం

ఆందోళనల్లో పాల్గొన్న 70 లక్షల మంది

భారీ ర్యాలీలు, ప్లకార్డులతో ప్రదర్శనలు

నిరసనకారులను హేళన చేస్తూ ఏఐ వీడియోలు పోస్టు చేసిన ట్రంప్

వాషింగ్టన్, అక్టోబరు 19 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ప్రజాగ్రహం పెల్లుబికింది. ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఆ దేశ ప్రజానీకం "నో కింగ్స్" అంటూ ఆందోళన బాట పట్టింది. నో కింగ్స్ పేరిట దేశవ్యాప్తంగా శనివారం నిర్వహించిన ఆందోళనల్లో లక్షలాది ప్రజలు ట్రంప్‌కు వ్యతిరేకంగా రోడ్డెక్కి పెద్దఎత్తున నిరసన తెలిపారు. వలసల నియంత్రణకు ట్రంప్ తీసుకుంటున్న చర్యలు, విశ్వవిద్యాలయాలకు

మిగతా 2వ పేజీలో...

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ఆంధ్రజ్యోతి' దీపావళి శుభాకాంక్షలు



సెలవు

దీపావళి సందర్భంగా సోమవారం మా కార్యాలయాలకు సెలవు. కావున 'ఆంధ్రజ్యోతి' మంగళవారం (21-10-25) సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

\- మేనేజింగ్ డైరెక్టర్

జేఈఈ మెయిన్స్ షెడ్యూల్ వచ్చేసింది

మొదటి సెషన్ జనవరి 21-30 మధ్య నిర్వహణ

రెండో సెషన్ ఏప్రిల్ 1 నుంచి 10 వరకు

దరఖాస్తుల్లో తప్పుల్లేకుండా ఉండేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆధార్‌తో లింక్

2

శాంతికి తూట్లు

- గాజాలో ట్రంప్ కుదిర్చిన సంధికి పురిట్లోనే సంధి!

రఫాలో ఇజ్రాయెల్ సైనికులపై హమాస్ దాడి

గగనతల దాడులతో విరుచుకుపడ్డ ఐడీఎఫ్

గాజాకు మానవతా సాయం అందకుండా ఆపివేస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రకటన

33 మంది మరణించారు: గాజా అధికారులు



వెస్ట్‌బ్యాంక్, అక్టోబరు 19: గాజాలో శాంతి మూణ్నాళ్ల ముచ్చటే అయ్యింది! హమాస్, ఇజ్రాయెల్ నడుమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుదిర్చిన బలవంతపు 'సంధి'కి పురిట్లోనే సంధి కొట్టింది!! హమాస్ స్థావరాలపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) గగనతలదాడులకు పాల్పడడంతో గాజా మళ్లీ నెత్తురోడింది. రఫాలో తమ సైనికులపై హమాస్ దాడులు చేసి కాల్పుల విరమణ ఒప్పందాన్ని తీవ్రంగా ఉల్లంఘించిందని.. అందుకే తాము గగనతల దాడులు చేశామని ఇజ్రాయెల్ చెబుతుండగా, ఒప్పందాన్ని తొలుత ఉల్లంఘించింది ఇజ్రాయెలేనని హమాస్ ఆరోపిస్తోంది. తాజా పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని

మిగతా 2వ పేజీలో...



ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరిగిన ప్రవాసాంధ్రుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

ప్రవాసులే బ్రాండ్ అంబాసిడర్లు!

> దేశంలోని చాలా రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు ఉన్నాయి. ఏపీలో మాత్రం డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రెయిన్ ఉంది. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఇద్దరూ కలసికట్టుగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. - లోకేశ్

ఐక్యంగా రాష్ట్రాన్ని పునర్నిర్మిద్దాం.. ఆస్ట్రేలియాలోని ప్రవాసులతో లోకేశ్ భేటీ

16 నెలల్లోనే 10 లక్షల కోట్ల పెట్టుబడులు.. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

కేంద్రం సహకారంతోనే గూగుల్ వచ్చింది.. దాంతోపాటు ఎంఎస్ఎంఈలూ ముఖ్యమే

చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు ప్రవాసులు అండగా నిలబడ్డారు

ప్రపంచవ్యాప్తంగా నిరసనలు తెలిపారు.. 45 వేల మంది హైదరాబాద్ వచ్చి పాల్గొన్నారు

1995లో మాదిరిగా మ్యాజిక్ చేయడానికి బాబు అహర్నిశలూ కష్టపడుతున్నారు

అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా తీసుకెళ్తున్నారు

క్వాంటమ్ కంప్యూటింగ్ మాకే అర్థం కావడం లేదు.. ఆయనేమో నిశితంగా విశ్లేషిస్తున్నారు

అందుకే ఆయన విజనరీ.. ఇంకొకరు ప్రిజనరీ.. సిడ్నీ ప్రవాసాంధ్రుల భేటీలో వ్యాఖ్యలు

అమరావతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం కోసం ప్రవాసాంధ్రులు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ అన్నారు. అందరం ఐక్యంగా రాష్ట్రాన్ని పునర్నిర్మిద్దామని వ్యాఖ్యానించారు. తెలుగువారు మళ్లీ గర్వంగా తలెత్తుకునే రోజులు రావాలని ఆకాంక్షించారు. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన లోకేశ్‌కు ఆదివారం సిడ్నీలో ఘన స్వాగతం లభించింది. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన

మిగతా 12వ పేజీలో...

ఈ మారీచులతో జాగ్రత్త

ప్రజాస్వామ్య యుద్ధంలో అంతా కలసి ఓడించారు

ఆ అక్కసుతో ప్రజల మధ్య విభేదాల సృష్టికి కుట్రలు

ఈ నయా నరకాసురులకు గుణపాఠం చెప్పాలి

ఆడపడుచులు సత్యభామ స్ఫూర్తి అందిపుచ్చుకోవాలి

ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు



13



కందుకూరులో మృతుడు లక్ష్మయ్య నాయుడి భార్య సుజాతతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న మంత్రులు అనిత, నారాయణ, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

నా భర్తది కుల హత్య కాదు

కులం రంగు పులమడం దారుణం

13

హరిశ్చంద్రప్రసాద్ కొన్నాళ్లుగా బెదిరిస్తున్నారు.. లక్ష్మయ్య నాయుడి భార్య వెల్లడి

హత్యపై సీఎం సీరియస్.. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకోవాలని మంత్రులకు ఆదేశం.. హుటాహుటిన గ్రామానికి అనిత, నారాయణ

బాధిత కుటుంబానికి పరామర్శ.. ప్రభుత్వం, పార్టీ తరఫున సాయానికి హామీ

బాధితులను ఫోన్‌లో పరామర్శించిన చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్

కులాలతో రాజకీయం చేయొద్దంటూ వైసీపీ నేతలకు మంత్రి అనిత హెచ్చరిక

రవాణా రంగానికి రాజమార్గం!

త్వరలో జాతీయ స్థాయి సంస్థ జీటీపీఆర్‌వో

రోడ్డు, రైలు, షిప్పింగ్, విమాన రంగాల ప్రాజెక్టులకు సత్వర అనుమతులు

రూ.500 కోట్లు దాటిన పథకాలకు వర్తింపు

2



చోరీ జరిగిన మ్యూజియం ఇదే..

పారిస్ మ్యూజియంలో 7 నిమిషాల్లోనే భారీ చోరీ!

విలువైన పురాతన నగలు ఎత్తుకెళ్లిన దొంగలు

ఈ మ్యూజియంలోనే మోనాలిసా చిత్రం

రోజూ 30 వేల మందికిపైగా సందర్శకులు

మ్యూజియం మూసివేత.. చోరీపై దర్యాప్తు

2

ఆశన్న, మల్లోజుల విప్లవ ద్రోహులు

వారిని ప్రజలే శిక్షిస్తారు.. ఇద్దరినీ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నాం

2

మల్లోజుల భార్య లొంగిపోయినప్పటి నుంచే ఆయనకు మహారాష్ట్ర సర్కారుతో సంబంధాలు

పార్టీ శత్రువులకు లొంగదు.. పునర్నిర్మాణానికి ప్రయత్నిస్తాం: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ



దీపాలు, కొవ్వొత్తులపై ఖర్చు ఎందుకు?

» క్రిస్మస్ నుంచి నేర్చుకోవాలి: అఖిలేశ్ యాదవ్



న్యూఢిల్లీ, అక్టోబరు 19: సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ దీపావళి ఉత్సవాల సందర్భంగా దీపాలు, కొవ్వొత్తులపై చేసే ఖర్చుతోపాటు క్రిస్మస్ వేడుకల నుంచి నేర్చుకోవాలంటూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. యూపీ ప్రభుత్వం దీపావళి సందర్భంగా చేసే ఖర్చును ప్రస్తావిస్తూ శనివారం అఖిలేష్ మాట్లాడారు. 'నేను రాముడి పేరు మీద ఒక సలహా ఇస్తాను. క్రిస్మస్ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా అన్ని నగరాలు వెలిగిపోతుంటాయి. నెలల తరబడి పండగ లైటింగ్స్ ఉంటాయి. వారి నుంచి మనం నేర్చుకోవాలి. మనం ఎందుకు దీపాలు, కొవ్వొత్తులపై డబ్బు ఖర్చు చేయాలి? ఈ ప్రభుత్వం నుంచి మనం ఏం ఆశించగలం. ఈ ప్రభుత్వాన్ని దింపివేయాలి. మేం మరిన్ని అందమైన లైట్లు ఉండేలా చూసుకుంటాం" అని అన్నారు. అఖిలేష్ యాదవ్ చేసిన వ్యాఖ్యల పట్ల బీజేపీ నేతలు, వీహెచ్‌పీ నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది.

నమ్మక ద్రోహులైన మైనారిటీల ఓట్లు అక్కర్లేదు

» కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు



పట్నా, అక్టోబరు 19: మైనారిటీలంతా నమ్మక ద్రోహులని కేంద్ర చేనేతశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ ఆరోపించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో నమ్మక ద్రోహులైన మైనారిటీల ఓట్లక్కర్లేదని ఆర్వార్ జిల్లాలో శనివారం జరిగిన బహిరంగసభలో ఆయన ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'నేనొకసారి మౌల్వీ (ముస్లిం మత పెద్ద)ను ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా కార్డు కలిగి ఉన్నారా? అని అడిగితే.. అవును తీసుకున్నానని చెప్పారు. ఆ కార్డులు హిందూ-ముస్లింల ప్రాతిపదికన పంపిణీ చేశారా అంటే లేదన్నారు. మరి నాకు ఓటేశావా..? దేవుడి మీద ప్రమాణం చేసి చెబుతావా? అంటే లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి ముస్లింలు లబ్ధి పొందుతారు. కానీ ఓటు మాత్రం వేయరు. అటువంటి వారంతా నమ్మక ద్రోహులు. అటువంటి నమ్మక ద్రోహుల ఓట్లు మాకు అక్కర్లేదని మౌల్వీకి చెప్పాను' అని గిరిరాజ్ సింగ్ చెప్పారు. దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. కేంద్ర మంత్రికి వాక్ స్వాతంత్ర్యం ఉందన్న ఎన్డీఏ మిత్రపక్షం జేడీయూ అధికార ప్రతినిధి నీరజ్ కుమార్.. ఆయన భాష ఆందోళనకరమన్నారు.

బిహార్ ఎన్నికల్లో ఒంటరిగా జేఎంఎం పోటీ!

» ఆరు సీట్లలో తమ అభ్యర్థులు ఉంటారని వెల్లడి

» 25 సీట్లకు అభ్యర్థులను ప్రకటించిన ఎంఐఎం

పట్నా, న్యూఢిల్లీ, అక్టోబరు 19: జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించింది. తమ అభ్యర్థులు ఆరు సీట్లలో పోటీ చేస్తారని పేర్కొంది. జేఎంఎం జనరల్ సెక్రటరీ సుప్రియో భట్టాచార్య ఆదివారం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఈమేరకు వివరాలు వెల్లడించారు. తమ అభ్యర్థుల తరఫున పార్టీ అధ్యక్షుడు, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ఆధ్వర్యంలో 20 మంది స్టార్ క్యాంపెయినర్లు ఎన్నికల ప్రచారంలో దిగుతారని తెలిపారు. తాము పోటీ చేసే సీట్ల సంఖ్య కూడా 10కి చేరవచ్చని ఆయన పేర్కొన్నారు. కాగా ఎంఐఎం పార్టీ ఆదివారం బిహార్‌లో 25 సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. వీరిలో ఇద్దరు ముస్లిమేతరులు. కాగా పట్నాలోని ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్ యాదవ్ ఇంటి వద్ద ఆదివారం హైడ్రామా చోటు చేసుకుంది. మధుబన్ నుంచి టికెట్ ఆశించిన మదన్ సా అనే ఆర్జేడీ నాయకుడు ఆ సీటు దక్కకపోవడంతో లాలు ఇంటి ముందు బట్టలు చింపుకొని రోడ్డుపై పొర్లుగింతలు పెట్టాడు.

చెన్నై-హైదరాబాద్ విమానంలో సాంకేతిక లోపం

చెన్నై/శంషాబాద్ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. 104 మంది ప్రయాణికులు, ఐదుగురు విమాన సిబ్బందితో ఎయిరిండియా విమానం ఆదివారం ఉదయం 10.45 గంటలకు చెన్నై విమానాశ్రయం నుంచి బయలుదేరింది. రన్‌వేను దాటి నింగిలోకి ఎగిరేందుకు సిద్ధమవుతుండగా విమాన ఇంజన్‌లో సాంకేతికలోపం తలెత్తినట్లు పైలెట్లు గుర్తించి ఏటీసీ అధికారులకు సమాచారమిచ్చారు. వారి ఆదేశం మేరకు పైలెట్ విమానాన్ని తిరిగి ఎయిర్‌పోర్ట్‌లోనే ల్యాండింగ్ చేశారు. సాంకేతిక లోపాన్ని సరిచేశాక మధ్యాహ్నం 12 గంటలకు విమానం హైదరాబాద్‌కు బయలుదేరింది. ఇక భువనేశ్వర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రావాల్సిన విమానం నాలుగున్నర గంటలు ఆలస్యం కావడంతో ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఇదిలా ఉండగా.. ఆదివారం ఉదయం 6.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి తిరుపతి వెళ్లాల్సిన స్పైస్‌జెట్ విమానం సాంకేతిక లోపం కారణంగా రద్దయింది. ఇదిలా ఉండగా, న్యూఢిల్లీ నుంచి నాగాలాండ్‌లోని దిమాపూర్‌కు ఆదివారం వెళ్లిన ఇండిగో విమానానికి ముప్పు తప్పింది. ఆ విమానం న్యూఢిల్లీలో బయలుదేరడానికి సిద్ధమవుతున్న సమయంలో ఓ ప్రయాణికుడు తీసుకెళ్తున్న పవర్ బ్యాంక్‌లో మంటలు కనిపించాయి. అప్రమత్తంగా ఉన్న సిబ్బంది సెకన్ల వ్యవధిలో వాటిని అదుపులోకి తీసుకొచ్చారు.

రష్యాలో చిక్కుకున్న భారతీయులను రప్పించాలి

» విదేశాంగ మంత్రి జై శంకర్‌కు ఒవైసీ లేఖ

హైదరాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం రష్యాకు వెళ్లి చిక్కుకుపోయిన భారతీయులను సురక్షితంగా వెనక్కి రప్పించాలని మజ్లిస్ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన విదేశాంగ మంత్రి జైశంకర్‌కు లేఖ రాశారు. విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శికి, మాస్కోలోని భారత రాయబార కార్యాలయానికి కూడా ఆయన లేఖ పంపారు. హైదరాబాద్ నుంచి రష్యాకు వెళ్లిన మొహమ్మద్ అహ్మద్‌ను ఏజెంట్లు మోసగించి, బలవంతంగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి పంపినట్టు ఆయన కుటుంబసభ్యులు తనకు చెప్పారని ఒవైసీ తెలిపారు. హరియాణాకు చెందిన సుమిత్‌కుమార్, అనూప్‌కుమార్, రాజస్థాన్‌కు చెందిన మనోజ్‌కుమార్ కూడా రష్యాలో చిక్కుకుపోయారని, వీరిని భారత్‌కు తీసుకువచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

భారత్‌లో 'ఎంటీవీ'ని మూసివేయడం లేదు

న్యూఢిల్లీ, అక్టోబరు 19: భారత్‌లో ఎంటీవీ ఛానెల్‌ను మూసివేయడం లేదని ఆ సంస్థ ప్రకటించింది. 'మేము ఎక్కడికీ వెళ్లడం లేదు' (హమ్ కహీ నహీ జా రహే) అంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టింది. యూరోప్‌లో పలు ఎంటీవీ ఛానెళ్లను డిసెంబరు 31 నుంచి మూసివేస్తున్నట్టు మాతృ సంస్థ పారామౌంట్ గ్లోబల్ ప్రకటించింది. దాంతో భారత్‌లోని ఎంటీవీ ఛానెల్‌ను కూడా మూసివేస్తారంటూ వదంతులు వ్యాపించడంతో అలాంటిదేమీ లేదని వివరణ ఇచ్చింది.



దీపావళిని పురస్కరించుకొని అయోధ్యలోని సరయూ తీరం వెంబడి ఆదివారం 26.17లక్షల దీపాలను వెలిగించారు. ఏకకాలంలో 2,128మందితో గంగా హారతి నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో సరయూ ఘాట్‌లు కిటకిటలాడాయి. దీప కాంతులతో నదీ తీరం దేదీప్యమానమైంది. ఈ రెండు కార్యక్రమాలూ గిన్నిస్ రికార్డులకెక్కినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది.

ట్రంప్‌పై పెల్లుబికిన

ప్రజాగ్రహం



(మొదటిపేజీ తరువాయి)

నిధుల తగ్గింపు, దేశంలోని చాలా రాష్ట్రాల్లో సైనికుల మోహరింపు, షట్‌డౌన్‌తో ప్రభుత్వ సేవలు నిలిచిపోవడం వంటి అనేక కారణాలు ఈ నిరసనల వెనుక ఉన్నాయి. ట్రంప్ దేశ అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన మూడో ఆందోళన ఇది. మీడియా కథనాల ప్రకారం అమెరికాలోని 50 రాష్ట్రాల్లోని 2,700 ప్రాంతాల్లో నోకింగ్స్ నిరసన ప్రదర్శనలు జరిగాయి. దాదాపు 70 లక్షల మంది ప్రజలు ఈ నిరసనల్లో పాల్గొన్నారని అంచనా. న్యూయార్క్, వాషింగ్టన్, బోస్టన్, కాలిఫోర్నియా, షికాగో వంటి ప్రధాన నగరాలతోపాటు చిన్నచిన్న పట్టణాలు, కమ్యూనిటీల్లో కూడా ప్రజలు నిరసన ప్రదర్శనలు చేశారు. బ్యాండు మేళాలు, విచిత్ర వేషధారణలతో నిరసనల్లో పాల్గొన్న ప్రజలు నిరంకుశత్వానికి, ఇమ్మిగ్రేషన్ విధానాలకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. న్యూయార్క్ టైమ్ స్క్వేర్, బోస్టన్, కాలిఫోర్నియా, షికాగోల్లో జరిగిన నిరసన ప్రదర్శనల్లో వేల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఇలా ఉంటుంది. భయం లేదు, ద్వేషం లేదు. వలసదారులకు స్వాగతం అంటూ నినాదాలు చేశారు. లాస్‌ఏంజెలెస్‌లో జరిగిన నిరసనల్లో ఆందోళనకారులు వలసదారుల హక్కులకు ప్రాధాన్యం ఇచ్చారు. మెక్సికో, అమెరికా జెండాలను ప్రదర్శించారు. కెనడా, బెర్లిన్, రోమ్, పారిస్, స్వీడన్‌లోని అమెరికా రాయబార కార్యాలయాల బయట కూడా నిరసనలు జరిగాయి. దేశవ్యాప్తంగా 2500కు పైగా నిరసన ప్రదర్శనలు జరిగాయని, శాంతియుతంగా జరిగిన ఈ ర్యాలీల్లో ఎవర్నీ అరెస్టు చేయలేదని పోలీసులు ప్రకటించారు.



నో కింగ్ అంటూ శాన్‌ఫ్రాన్సిస్కోలో నిరసనకారుల ప్రదర్శన

నేనే రాజు అనేలా ట్రంప్ ఏఐ వీడియోలు

నోకింగ్స్ అంటూ వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలియజేస్తున్న ప్రజలను వెటకారం చేస్తూ అధ్యక్షుడు ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతాలో పలు ఏఐ వీడియోలు షేర్ చేశారు. అందులో ఓ వీడియోలో తలపై కిరీటంతో రాజు వేషధారణలో ఉన్న ట్రంప్.. కింగ్ ట్రంప్ అనే యుద్ధ విమానంలో వెళుతూ.. కింద తనకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వారిపై బురద చల్లుతాడు. మరో వీడియోలో ట్రంప్ తలపై కిరీటం, రాజు వస్త్రాలు ధరించి కత్తితో అభివాదం చేయగా.. డెమొక్రటిక్ పార్టీ నేతలు అతనికి మోకరిల్లినట్లు ఉంటుంది. ఈ వీడియోను అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా షేర్ చేశారు. కాగా, నోకింగ్స్ ఆందోళనలపై శుక్రవారం ఫాక్స్ న్యూస్‌తో మాట్లాడిన ట్రంప్.. " వాళ్లు నన్ను రాజు అని అంటున్నారు. కానీ నేను రాజుని కాదు" అని అన్నారు. ఇక, నోకింగ్స్ నిరసనలను అమెరికా వ్యతిరేక ఆందోళనలని రిపబ్లికన్ పార్టీ వర్గాలు విమర్శించాయి.

ఏమిటీ నో కింగ్స్

డొనాల్డ్ ట్రంప్ రెండో సారి దేశ అధ్యక్షుడు అయ్యాక ఎలాన్ మస్క్ నేతృత్వంలో డోజ్‌ను ఏర్పాటు చేసి వేలాది మంది ఉద్యోగులపై ఓటు వేశారు. పౌరసత్వం, ట్రాన్స్‌జెండర్ల రక్షణ, అక్రమ వలసల అంశాల్లో కీలక మార్పులు చేశారు. ఈ క్రమంలో వలసదారులపై అధికారులు చేపట్టిన సోదాలు వివాదాస్పదంగా మారాయి. దీనిపై స్థానికంగా ప్రజలు నిరసనలు తెలియజేయడం మొదలుపెట్టారు. ఆ నిరసనలను నియంత్రించేందుకు ప్రభుత్వం జాతీయ బలగాలను రంగంలోకి దించింది. దీంతో ట్రంప్ విధానాలు నిరంకుశంగా ఉన్నాయని, అమెరికాలో రాచరికం లేదని చెప్పేలా 'నో కింగ్స్' అంటూ ట్రంప్ వ్యతిరేకులు ఆందోళనలు మొదలుపెట్టారు. ఇటీవల షట్‌డౌన్‌తో అనేక ప్రభుత్వ సేవలు నిలిచిపోవడంతో నోకింగ్స్ ఆందోళనలు మరింత తీవ్రమయ్యాయి.

లోకం తీరు



పాక్ బలగాలను భారత సరిహద్దు వరకు తరిమికొడతాం

» అఫ్ఘాన్ మంత్రి నబి ఒమరి హెచ్చరిక

» అఫ్ఘాన్, పాక్ మధ్య ఫలించిన శాంతి చర్చలు



దోహా/కాబూల్, అక్టోబరు 19: తమ దేశంపై ఆక్రమణకు యత్నిస్తే పాక్ బలగాలను భారత సరిహద్దు వరకు తరిమికొడతామని అఫ్ఘాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి ముహమద్ నబి ఒమరి హెచ్చరించారు. అఫ్ఘాన్ ఒకసారి నిర్ణయించుకుంటే పాక్ బలగాలకు భారత సరిహద్దు వరకు ఎక్కడా భద్రత ఉండదన్నారు. పాక్ ప్రభుత్వం, సైనిక నాయకత్వంపై కూడా ఒమరి విమర్శలు గుప్పించారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు వీర సానుభూతిపరుడిగా మారి ముఖస్తుతి చేస్తున్నారని, పాక్‌లో సైనిక పాలన ఇతరుల ఇష్టాలపై ఆధారపడి ఉంటుందని ఒమరి ఎద్దేవా చేశారు. డ్యూరాండ్ రేఖ కారణంగా అఫ్ఘాన్ కోల్పోయిన భూభాగాలన్నీ పాక్ తిరిగి ఇచ్చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, అఫ్ఘాన్, పాక్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తతల వేళ దోహాలో జరిగిన శాంతి చర్చలు ఫలించాయి. ఖతార్, టర్కీ మధ్యవర్తిత్వంలో జరిగిన ఈ చర్చలకు పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్, అఫ్ఘాన్ రక్షణ మంత్రి ముల్లా యాకూబ్ హాజరయ్యారు. రెండు దేశాల మధ్య శాంతి, సుస్థిరత కోసం సరిహద్దుల్లో కాల్పుల విరమణ పాటించాలని నిర్ణయించారు. భవిష్యత్తులోనూ చర్చలు జరిపేందుకు అంగీకరించారు. ఈ మాసంలో పాక్ వైమానిక దాడుల్లో అఫ్ఘాన్ క్రికెటర్లు, సామాన్య పౌరులు పెద్ద సంఖ్యలో మృతిచెందారు. దీనికి ప్రతీకారంగా తాలిబన్ ఫైటర్లు దాడులకు పాల్పడటంతో పాక్ సైన్యానికి తీవ్ర నష్టం వాటిల్లింది.

తేజస్ ఎమ్‌కే1ఏ విమానాల
డెలివరీ ఇప్పట్లో లేనట్లే!

న్యూఢిల్లీ, అక్టోబరు 19: స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేజస్ ఎమ్‌కే1ఏ యుద్ధ విమానాల తొలి విడత డెలివరీ మరింత జాప్యమయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) ఈ నెల 17నే రెండు తేజస్ యుద్ధ విమానాలను భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్) డెలివరీ చేయాల్సి ఉంది. అయితే, ఈ విమానాలకు ఆయుధాలను అమర్చి, విస్తృత స్థాయిలో నిర్వహించే పరీక్షలు విజయవంతంగా పూర్తయితేనే, వాటిని వైమానిక దళానికి అప్పగించడానికి వీలవుతుందని హెచ్‌ఏఎల్ చెబుతోంది. దీన్ని బట్టి చూస్తే విమానాల డెలివరీ మరింత ఆలస్యం కానుంది. 2026 మార్చి నాటికి కనీసం ఆరు విమానాలను ఐఏఎఫ్‌కు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హెచ్‌ఏఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డీకే సునీల్ చెబుతున్నారు.

శాంతికి తూట్లు

(మొదటిపేజీ తరువాయి)

బెంజమిన్ నెతన్యాహు.. ఆ దేశ రక్షణ మంత్రి, ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ తదితరులతో అత్యవసర భద్రతా సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై చర్చించారు. హమాస్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే తీవ్రంగా ప్రతిస్పందించాలని సైన్యానికి దేశాలు జారీ చేశారు. కాగా.. తమ సేనలు రఫాలో గగనతల దాడులు జరిపినట్టు ఇజ్రాయెల్ సైన్యం ధ్రువీకరించింది. "రఫా ప్రాంతంలో ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తున్న ఐడీఎఫ్ ట్రూప్స్ మీద.. హమాస్ ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. యాంటీ ట్యాంక్ క్షిపణులను ప్రయోగించారు. యుద్ధవిమానాలు, శతఘ్నులతో ఐడీఎఫ్ వారికి దీటుగా బదులిచ్చింది. ఉగ్రవాదులకు చెందిన పలు సైనిక నిర్మాణాలు, సొరంగాలు ఈ దాడుల్లో దెబ్బతిన్నాయి" అని ఒక ప్రకటనలో పేర్కొంది. ఐడీఎఫ్ దాడుల్లో 33 మంది మరణించినట్టు గాజా స్థానిక అధికారులు వెల్లడించారు. ఈ పరిణామాలన్నీ జరగడానికి కొన్ని గంటల ముందే.. గాజాలోని పాలస్తీనా పౌరులపై హమాస్ దాడులకు పాల్పడబోతున్నట్టు తమకు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందిందంటూ అమెరికా విదేశాంగ శాఖ పేర్కొనడం గమనార్హం. కానీ, అదంతా ఇజ్రాయెల్ దుష్ప్రచారమేనంటూ హమాస్ ఖండించింది. కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం.. శనివారం రాత్రి మరో ఇద్దరు ఇజ్రాయెలీల మృతదేహాలను అప్పగించింది. దీంతో ఇప్పటిదాకా హమాస్ 12 మృతదేహాలను అప్పగించినట్టయింది. హమాస్ దాడుల నేపథ్యంలో.. తదుపరి నోటీసులు జారీ చేసేదాకా గాజా ప్రాంతంలోకి మానవతా సహాయాన్ని అందకుండా నిలిపివేస్తున్నట్టు ఇజ్రాయెల్ భద్రతాధికారి ఒకరు తెలిపారు. కాల్పుల విరమణ కారణంగా కొద్దిరోజులుగా ఆ ప్రాంతానికి అందుతున్న మానవతా సాయం తాజా పరిణామాలతో నిలిచిపోయినట్టయింది.

జేఈఈ మెయిన్స్-2026
షెడ్యూల్ విడుదల

» మొదటి సెషన్ జనవరి 21-30వరకు నిర్వహణ

» రెండో సెషన్ ఏప్రిల్ 1-10వ తేదీ వరకు

» దరఖాస్తుల్లో తప్పులు జరగకుండా ఉండేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆధార్ డేటాబేస్‌తో లింక్

న్యూఢిల్లీ, అక్టోబరు 19: జేఈఈ మెయిన్-2026 పరీక్షల షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆదివారం ప్రకటించింది. ఈ ప్రకటన ప్రకారం జేఈఈ మెయిన్ మొదటి సెషన్‌ను జనవరిలో, రెండో సెషన్‌ను ఏప్రిల్‌లో నిర్వహిస్తారు. మొదటి సెషన్ పరీక్షలు జనవరి 21 నుంచి 30వరకు జరుగుతాయి. రెండో సెషన్ పరీక్షలను ఏప్రిల్ 1 నుంచి 10వరకు నిర్వహిస్తారు. జనవరి సెషన్‌కు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ అక్టోబరులోనే ప్రారంభం అవుతుంది. విద్యార్థులు రెండు సెషన్లలో ఏదైనా ఒకటి రాయవచ్చు. లేదా రెండూ రాయవచ్చు. ఎందులో ఎక్కువ మార్కులు వస్తే దాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. కాగా, జేఈఈ మెయిన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు దరఖాస్తుల్లో తప్పులు దొర్లకుండా ఉండేందుకు.. రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆధార్ డేటాబేస్‌తో అనుసంధానం చేశారు. విద్యార్థి ఆధార్ నెంబర్ ఎంటర్ చేస్తే.. అతని పేరు, వయస్సు, చిరునామా ఇలా ఆధార్ కార్డులోని అన్ని వివరాలు రిజిస్ట్రేషన్ ఫారంలోకి ఆటోమేటిక్‌గా వస్తాయి. విద్యార్థుల వివరాలు ఆధార్ కార్డులో ఒకలా.. స్కూల్ సర్టిఫికెట్లలో మరోలా ఉంటున్న నేపథ్యంలో ఎన్‌టీఏ దరఖాస్తు ప్రక్రియను ఆధార్‌తో అనుసంధానం చేసింది.

కొత్తగా 10,650 ఎంబీబీఎస్ సీట్లు

» 41 నూతన కాలేజీలకూ ఎన్ఎంసీ ఆమోదం

న్యూఢిల్లీ, అక్టోబరు 19: 2024-25 విద్యాసంవత్సరానికి గాను కొత్తగా 10,650 ఎంబీబీఎస్ సీట్లను జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) ఆమోదించింది. రానున్న ఐదేళ్లలో 75వేల కొత్త వైద్య సీట్లను సృష్టిస్తామని గతేడాది స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ ఇచ్చిన హామీకి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే 41 నూతన మెడికల్ కాలేజీలకు కూడా ఆమోదం తెలిపింది. దీంతో దేశంలోని మొత్తం వైద్య విద్యాసంస్థల సంఖ్య 816కు చేరింది. యూజీ సీట్ల పెంపు కోసం 41 ప్రభుత్వ కాలేజీలు, 129 ప్రైవేట్ సంస్థల నుంచి దరఖాస్తులు రాగా, 10,650 సీట్లు ఆమోదం పొందాయని ఎన్ఎంసీ చీఫ్ డాక్టర్ అభిజిత్ సేథ్ వెల్లడించారు. దీంతో మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 1,37,600కు పెరుగుతుందని, వీటిలో ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ (ఐఎన్ఐ)కు చెందిన సీట్లు కూడా ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా పీజీ కోర్సుల్లో కొత్త పునరుద్ధరణ సీట్ల కోసం 3,500 దరఖాస్తులు ఎన్ఎంసీకి వచ్చాయని పేర్కొన్నారు. దీంతో దేశవ్యాప్తంగా మొత్తం పీజీ సీట్లు 67వేలకు చేరతాయని చెప్పారు. యూజీ, పీజీ సీట్లు రెండింటిలోనూ కలిపి మొత్తం పెరుగుదల 15వేల వరకూ ఉంటుందని సేథ్ అభిప్రాయపడ్డారు.

మల్లోజుల, ఆశన్న విప్లవ ద్రోహులు

వారిని ప్రజలే శిక్షిస్తారు.. ఇద్దరినీ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నాం

» మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రకటన



హైదరాబాద్, చర్ల, చింతూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయుధాలతో సహా లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల వేణుగోపాల్, ఆశన్నలకు ప్రజలే శిక్ష విధిస్తారని మావోయిస్టు పార్టీ పేర్కొంది. వారి లొంగుబాటు విప్లవ ద్రోహమని మండిపడింది. వారితోపాటు లొంగిపోయినవారందరినీ మావోయిస్టు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు.. మావోయిస్టు పార్టీ కేంద్ర అధికార ప్రతినిధి అభయ్ పేరిట నాలుగు పేజీల లేఖ విడుదల చేసింది. మల్లోజుల భార్య గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఎదుట లొంగిపోయిందని.. అప్పటి నుంచే ఆ రాష్ట్ర సీఎం ఫడణవీస్‌తో ఆయనకు సంబంధాలు ఏర్పడినట్లు అనుమానిస్తున్నామని ఆ లేఖలో అభయ్ పేర్కొన్నారు. ఆయన కోవర్టు చర్యకు పాల్పడినట్లు ఆరోపించారు. 2011 చివరి నుంచి గడ్డు స్థితిని ఎదుర్కొంటూ వచ్చిన దండకారణ్య విప్లవోద్యమం 2018 నాటికి తాత్కాలిక వెనకంజకు గురైందని, అప్పటి నుంచే మల్లోజులలో రాజకీయ బలహీనతలు బయటపడుతూ వచ్చాయని తెలిపారు. 2020లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో దండకారణ్యా విప్లవాచరణలోని కొన్ని లోపాలపై ఆయన స్వీయ విశ్లేషణ చేస్తూ ఒక పత్రాన్ని ప్రవేశపెట్టారని, దాన్ని కేంద్ర కమిటీ తిరస్కరించిందని వివరించారు. తర్వాత పలుమార్లు జరిగిన కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సమావేశాల్లో ఆయనను సరిదిద్దడానికి పార్టీ ప్రయత్నించినట్టు తెలిపారు. 2011 నుంచే మల్లోజుల తీవ్ర అహంభావాన్ని, పెత్తందారీతనాన్ని ప్రదర్శిస్తున్నారని.. దీంతో పార్టీ పలుమార్లు ఆయన్ను హెచ్చరించిందని వివరించారు. ఈ ఏడాది మేలో జరిగిన కగార్ దాడిలో పార్టీ కార్యదర్శి బసవరాజ్ మరణం తర్వాత మల్లోజులలో బలహీనతలు గుణాత్మక మార్పును సంతరించుకొని శత్రువు ముందు మోకరిల్లేలా చేశాయని.. ఆయనలో ప్రాణభీతి ఏర్పడిందని అభయ్ పేర్కొన్నారు. ఆయుధాలను పార్టీకి అప్పగించాలని కేంద్ర కమిటీ చెప్పినప్పటికీ మల్లోజుల వాటిని శత్రువుకు అప్పగించి, విప్లవ ద్రోహిగా మారారని పేర్కొన్నారు. ఎందరో కామ్రేడ్స్ శత్రు బలగాలతో పోరాడి, ప్రాణాలు అర్పించి, వారి నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను మళ్లీ శత్రువుకు అప్పగించడమంటే విప్లవకారులను హత్య చేయడమేనని.. హత్య చేయాలని సూచించడమేనని.. ఇది విప్లవ ఘాతుకమవుతుందని అభయ్ పేర్కొన్నారు. పార్టీలోని ఎంత మంది సరెండర్ అయినా పార్టీ మాత్రం శత్రువులకు సరెండర్ కాదని దేశ ప్రజలకు హామీ ఇస్తున్నామని అభయ్ లేఖలో పేర్కొన్నాడు. మల్లోజుల, ఆశన్నల్లో పెరిగిన మితవాద భావాలను సకాలంలో గుర్తించడంలో పార్టీ విఫలమైందన్న ఆయన.. ఈ వైఫల్యంపై సమీక్షించుకొని గుణపాఠాలు నేర్చుకుంటామని స్పష్టం చేశారు. విప్లవోద్యమంలో వెనుకంజలు తాత్కాలికమేనని.. పార్టీ పునర్నిర్మాణానికి ప్రయత్నిస్తామని అభయ్ తెలిపారు.

లవ్రే మ్యూజియంలో 7 నిమిషాల్లోనే భారీ చోరీ!

» పారిస్‌లోని ఈ మ్యూజియంలోనే మోనాలిసా చిత్రం



పారిస్, అక్టోబరు 19: ఫ్రాన్స్‌లోని ప్రఖ్యాత లవ్రే మ్యూజియంలో సినీఫక్కీలో భారీ చోరీ జరిగింది. కేవలం 7నిమిషాల్లోనే దొంగలు తమ పని కానిచ్చేశారు! అత్యంత విలువైన పురాతన నగలు ఎత్తుకెళ్లిపోయారు! పారిస్‌లో ఉన్న లవ్రే మ్యూజియానికి పటిష్ఠ భద్రత ఉంటుంది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మోనాలిసా అసలైన చిత్రం ఈ మ్యూజియంలోనే ఉంది. ఆదివారం తెల్లవారుజామున దోపిడీ జరిగినట్లు ఫ్రాన్స్ అంతర్గత శాఖ మంత్రి లారెంట్ నూనెజ్ వెల్లడించారు. హైడ్రాలిక్ నిచ్చెన ఉపయోగించి, ఫెన్సింగ్‌ను డిస్క్ కట్టర్లతో కత్తిరించి.. దొంగలు మ్యూజియంలోకి ప్రవేశించినట్లు చెప్పారు. అపోలో గ్యాలరీలోని విలువైన నగల్ని ఎత్తుకెళ్లినట్లు వివరించారు. ముగ్గురు లేదా నలుగురు వ్యక్తులు ఈ చోరీ చేసి ఉంటారని పేర్కొన్నారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతుండడంతో ఆదివారం మ్యూజియాన్ని మూసివేసినట్లు లవ్రే నిర్వాహకులు తెలిపారు. కాగా, మ్యూజియంలో ఓ వైపు నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. దొంగలు అక్కడి నుంచే మ్యూజియం లోపలికి చొరబడ్డారని స్థానిక మీడియా వర్గాలు తెలిపాయి. నెపోలియన్ కాలం నాటి వస్తువులు, ఆభరణాలు ఉన్న అపోలో గ్యాలరీ అద్దాలను పగలగొట్టి అందులో నుంచి తొమ్మిది వస్తువులను దొంగిలించినట్లు వెల్లడించాయి. ఈ మ్యూజియంలో మెసపొటోమియా, ఈజిప్టుకు చెందిన అనేక వస్తువులు, వివిధ రాజ్యాల చిత్రాలు, శిల్పాలు వంటి వస్తువులు 33 వేల వరకు ఉన్నాయి. మ్యూజియాన్ని రోజూ దాదాపు 30 వేల మంది సందర్శిస్తుంటారు. లవ్రే మ్యూజియంలో గతంలో కూడా చోరీలు జరిగాయి. మోనాలిసా చిత్రాన్ని 1911లో మ్యూజియంలో పనిచేసిన మాజీ కార్మికుడు విన్సెంజో దొంగిలించాడు. రెండేళ్ల తర్వాత ఇటలీలోని మోనాలిసా చిత్తరువును విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా విన్సెంజోను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. 1913లో మోనాలిసా చిత్రం తిరిగి మ్యూజియానికి చేరింది.

రవాణా రంగానికి రాజమార్గం!

» త్వరలో జాతీయ స్థాయి సంస్థ ఏర్పాటు

» రూ.500 కోట్లు దాటిన పథకాలకు వర్తింపు

న్యూఢిల్లీ, అక్టోబరు 19: రవాణా వ్యవస్థలకు సంబంధించి ప్రణాళికా రచన, నిర్వహణ కోసం జాతీయ స్థాయిలో అత్యున్నత స్థాయి సంస్థను ఏర్పాటు చేయనున్నారు. దీనికి కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఉపరితల రవాణాతో పాటు రైల్వే, షిప్పింగ్, పౌర విమానయానం వంటి రవాణా వ్యవస్థలన్నీ దీని పరిధిలోకి వస్తాయి. దేశంలోని రవాణా రంగాలకు మరింత ఊతమివ్వడం దీని ఉద్దేశం. గతిశక్తి రవాణా ప్రణాళిక, పరిశోధన సంస్థ (జీటీపీఆర్‌వో) పేరిట ఈ సంస్థను క్యాబినెట్ సెక్రటేరియెట్‌లో ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటి కనీస రెండంచెల అనుమతుల వ్యవస్థ దీనితో తొలగిపోనుంది. బదులుగా ఆయా ప్రాజెక్టులకు సత్వర లభించనున్నాయి. ప్రధాని అధ్యక్షతన ఈ నెల 9న జరిగిన ఐదుగురు క్యాబినెట్ మంత్రులు, సంబంధిత శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారుల సమావేశంలో ఈ సంస్థ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కొత్త సంస్థ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనను రూపొందించాల్సిందిగా పరిశ్రమలు, అంతర్జాతీయ వాణిజ్య అభివృద్ధి (డీపీఐఐటీ) విభాగాన్ని కోరారు. కార్యదర్శి (రవాణా ప్రణాళిక) హోదాలో సీనియర్ అధికారి ఈ కొత్త సంస్థకు సారథ్యం వహిస్తారు. కంపెనీల చట్టంలోని సెక్షన్-8 కింద కొత్త సంస్థ ఏర్పాటవుతోంది. ఇది 500 కోట్లకు పైబడిన రోడ్డు, రైలు, విమానయాన తదితర రంగాల ప్రాజెక్టుల సమగ్ర ప్రణాళికలు, అంచనాలను రూపొందిస్తుంది. అలాగే ఆయా పథకాల అమలు, నిర్వహణను పర్యవేక్షిస్తుంది. ఇందుకోసం సంబంధిత మంత్రిత్వ శాఖలు.. ఐదు, పదేళ్లలో అమలు చేయగలిగిన పథకాలను రంగాల వారీగా రూపొందిస్తాయి.

25న లా సీట్లు కేటాయింపు

అమరావతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): లా కోర్సుల్లో అడ్మిషన్లకు ఉన్నత విద్యామండలి తాజా షెడ్యూలు విడుదల చేసింది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 21, 22 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని, 25న సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొంది. ఈ నెల 27 నుంచి 29వ తేదీలోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని, 27 నుంచే తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించింది.

ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో బాణసంచా పేలుడు

ముగ్గురి పరిస్థితి విషమం

నలుగురికి తీవ్ర గాయాలు.. పార్వతీపురంలో ఘటన



పేలుడు ధాటికి ధ్వంసమైన పార్సిల్ కౌంటర్ కిటికీ అద్దాలు



పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం/బెలగాం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం బాణసంచా పేలుడు సంభవించింది. దీంతో నలుగురు తీవ్రంగా గాయాలపాలయ్యారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. విజయనగరం నుంచి పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఆదివారం ఓ బస్సు చేరుకుంది. సమీపంలోనే ఆర్టీసీ పార్సిల్ కార్యాలయం ఉండడంతో ఎప్పటిలానే ఓ కళాసి ఆ బస్సులో సామాన్లు దించేందుకు వెళ్లాడు. మందుగుండు సామగ్రి ఉందని తెలియక ఓ లగేజ్ బాక్స్‌ను పార్సిల్ కౌంటర్ వద్దకు తీసుకొచ్చి కిందకు దించగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో ప్రయాణికులు, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. భారీ శబ్దానికి బెంబేలెత్తిపోయారు. పేలుడు ధాటికి పార్సిల్ కౌంటర్ షెడ్ పైభాగం, అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో కళాసి రెడ్డి రమేష్, బస్సు డ్రైవర్ తెర్లి రవి, తోపుడు బండి కార్మికుడు సుందరరావు, మరో వ్యక్తి కె.రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని పార్వతీపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం రవి, ఆర్.రమేష్‌ను మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు, కె.రమేష్‌ను విజయనగరం మహా రాజా ఆసుపత్రికి తరలించారు. ఎస్పీ మాధవరెడ్డి సిబ్బందితో అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. కాగా, విజయనగరంలోని పార్సిల్ బుక్ చేసిన వారి ఫోన్ నెంబర్, పార్వతీపురంలోని పార్సిల్ తీసుకునే వారి ఫోన్ నెంబర్ ఒకటే ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్సిల్ పంపిన వ్యక్తి జియ్యమ్మవలస నిమ్మలపాడు గ్రామానికి చెందిన కిషోర్ కుమార్ అని తెలుస్తోంది. 25 కేజీల జనరల్ ఐటమ్ పేరుతో పార్సిల్ బుక్ అయినట్టు రశీదు ఉందని ఆర్టీసీ కొరియర్ సర్వీసు అధికారులు చెబుతున్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే విజయచంద్ర పరామర్శించారు.

చెన్నైలో నాటు టపాకాయలు పేలి నలుగురి మృతి

చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై సమీపంలోని ఆవడిలో నాటు టపాసులు పేలిన ఘటనలో నలుగురు మృతిచెందారు. పట్టాభిరామ్‌లోని ఓ ఫామ్‌హౌస్‌లో దీపావళి పండుగ సందర్భంగా నాటు టపాసులు విక్రయిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆ ఇంట్లో భారీ శబ్దంతో టపాసులు పేలిపోయాయి. ఈ ఘటనలో ఫామ్‌హౌస్ నేల మట్టం అయింది. ఈ సమాచారం అందుకున్న పట్టాభిరామ్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని శిధిలాలను తొలగించి నలుగురి మృతదేహాలను వెలికితీశారు. మృతులలో ఇరువురిని యాసిన్, సునీల్‌గా గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు సేకరిస్తున్నారు. పట్టాభిరామ్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



మంచాలమ్మకు హారతి ఇస్తున్న జస్టిస్ మల్లికార్జున రావు

మంత్రాలయం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జున రావు ఆదివారం సతీసమేతంగా దర్శించుకున్నారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు.

బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే. శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరులో జరిగిన బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ ద్వితీయ మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పీవీ రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా బట్టా భాస్కర్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా కోట హరిబాబు, ఉండవల్లి శ్రీనివాసరావు. ఆర్థిక కార్యదర్శిగా వరికల్లు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా దేవరకొండ బాలయ్య, రాజవరపు సాంబయ్య, అన్నం శ్రీనివాసరావు, కట్టెబోయిన నరసింహారావు, తొరటి శ్రీనివాసరావును ఎన్నుకున్నారు.

ఏపీ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్

అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

విజయవాడ సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్(క్యాడర్) సంఘం అధ్యక్షులుగా ఎం.కె.వి జయలక్ష్మి, కార్యదర్శిగా ఆర్.జగదీష్ ఎన్నికయ్యారు. రిటైర్డ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు పి.శేషయ్య, ఎస్.ఉమావతి ఆధ్వర్యాన ముత్యాలంపాడులోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన సంఘ ఎన్నికల్లో సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్యాడర్ దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు వెల్లడించారు.

తిరుమల రెండో ఘాట్‌లో జారిపడిన కొండరాళ్లు

తిరుమల, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమల రెండో ఘాట్‌రోడ్డులో ఆదివారం కొండచరియలు జారి రాళ్లు రోడ్డుపై పడ్డాయి. మూడురోజులుగా కురుస్తున్న వానల నేపథ్యంలో వేకువజామున తొమ్మిదవ కిలోమీటరు వద్ద రాళ్లు రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో వాహనాలేవీ ప్రయాణించకపోవడంతో ప్రమాదం తప్పింది. టీటీడీ అధికారులు వెంటనే రాళ్లను తొలగించారు.

ముస్లింలకు అట్రాసిటీ చట్టం తీసుకురావాలి

» ముస్లిం సమైక్య వేదిక

మంగళగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ముస్లింల భద్రత కోసం ప్రత్యేక అట్రాసిటీ చట్టాన్ని రూపొందించాలని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సాలాఉద్దీన్ కోరారు. మంగళగిరి ఈద్గా ఫంక్షన్‌హాలులో ఆదివారం జరిగిన ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింలపై జరుగుతున్న దాడులు, వివక్షను అడ్డుకోవాలంటే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం మాదిరి ప్రత్యేక చట్టాన్ని తేవాల్సిందేనన్నారు. విద్య, ఆర్థిక రంగాల్లో ముస్లింలకు మరింత ప్రాధాన్యతను ఇచ్చేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులుగా నారాయణరావు యాదవ్

విజయవాడ సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులుగా విజయవాడకు చెందిన సి.హెచ్.నారాయణరావుయాదవ్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షులు రవీంద్రసింగ్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీలో యాదవుల ఐక్యతను చాటేందుకు, సంస్కృతి సాంప్రదాయాలను కాపాడేందుకు, యాదవులు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు అఖిల భారత యాదవ మహాసభ కృషి చేస్తుందని వివరించారు.

ఎక్సైజ్ విస్తృత తనిఖీలు

నూజివీడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గంలోని ఆగిరిపల్లి మం డలం, ఎన్టీఆర్ జిల్లా గన్నవరం నియోజకవర్గ సరిహద్దుల్లోని అటవీప్రాంతంలో ఏలూరు జిల్లా ఎక్సైజ్ అధికారులు ఆదివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఇటీవల ఎన్టీఆర్ జిల్లా సూరంపల్లిలో ఒక ప్రైవేట్ గోడౌన్‌లో నకిలీ మద్యం దొరకడం, శనివారం గన్నవరంలోని వైన్‌షాపులో నకిలీ మద్యం బాటిళ్లుగా భావిస్తున్న వాటిపై వినియోగదారులు ప్రశ్నించటం వంటి ఘటనల నేపథ్యంలో.. 'నూజివీడు ప్రాంతంలో నకిలీ మద్యం?' శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎక్సైజ్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. నూజివీడు-గన్నవరం నియోజకవర్గాల సరిహద్దుల్లోని అనుమానాస్పద ప్రదేశాల్లో తనిఖీలు చేసినట్టు, నకిలీ మద్యం బాటిళ్ల లభ్యం కాలేదని నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ. మస్తానయ్య తెలిపారు.

సోమవారం 20 అక్టోబరు 2025

వివిధ

vividha@andhrajyothy.com సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



రంగుల పిల్లి

రంగులు అమాయకమైనవి,
నలుపు, తెలుపుల్లా కలలు రాలిపోయినవి కావు,
పసిపిల్లలు ఉల్లాసంగా మేల్కొన్నట్లు
ఉదయాన గగనంలో మేలుకొంటాయి

ఇంద్రధనువుల మీదుగా,
సీతాకోకల రెక్కల మీదుగా, పూలని చేరి,
నీ వైపు నవ్వుతూ దర్శనమిస్తాయి

రంగులు ఈ లోకం మీద నీ ఆశలు నిలిపేవి,
ఆశల మీద లోకాన్ని నిలిపేవి

ఎంత దుఃఖంలోనూ
ఎక్కడో ఆశ ఉంటుంది చూసావా
అస్తమయబింబం ఆకాశంలోకి విసిరే
చివరి నారింజకాంతిలా

అట్లా, నలుపు, తెలుపుల
దుఃఖానందాల కెరటాల మధ్య
రంగులు ఆశ కల్పిస్తాయి అమాయకంగా
ఇక్కడింకా ఏదో ఉందని

తెలియందేదో లోకంగా వికసించిన ఇక్కడికి
పసిపిల్లల్లా గునగునా నడుస్తూ
ఆరిందాల్లా వస్తాయి రంగులు,
అంతటినీ చక్కదిద్దే ఘనుల్లా

ఆడింది చాలు పడుకోండని
అమ్మా, నాన్నల వంటి
నలుపు, తెలుపులు పిలిచినపుడు,
బొమ్మల్లాంటి మనని విసిరేసి
ఏకైక మహాశాంతిలోకి జారిపోతాయి

రంగుల్ని నమ్ముకున్న మనం
ఏకైక శూన్యంలో
లోలకంలా వ్రేలాడుతూ ఉంటాం


***

ఇప్పుడు
కలల్లోకి ప్రాకుతూ వచ్చిన రంగులు
నీతో ఏం మాట్లాడుతున్నాయి

■ బివివి ప్రసాద్
✆ 90320 75415

సాహిత్య సంస్కృతిని బలపరిచేందుకు...
ఛాయ లిటరేచర్ ఫెస్టివల్

వేర్వేరు పాయల గుండా పయనిస్తున్న తెలుగు సాహితీ సమాజాన్ని ఒక గొడుగు కిందకు చేర్చే ప్రయత్నంగా, తెలుగులో మొట్టమొదటి లిటరేచర్ ఫెస్టివల్‌ను 'ఛాయ' సంస్థ నిర్వహించ తలపెట్టింది. రచయితలు, పాఠకులు, అనువాదకులు, విమర్శకులు, ప్రచురణకర్తల మధ్య అర్థవంతమైన సంభాషణల కోసం జరుగుతున్న ఈ సాహిత్యోత్సవం అక్టోబర్ 25న హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో జరుగుతుంది. ఈ సందర్భంగా ఈ లిటరేచర్ ఫెస్టివల్‌కు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న **కె. శ్రీనివాస్** తో జరిపిన సంభాషణ ఇది.



ఛాయ సాహిత్యోత్సవం ముఖ్య ఉద్దేశం ఏమిటి? ఎలాంటి ఫలితాలను ఆశిస్తున్నారు?

తెలుగు సాహిత్యరంగం అనేక పాయలలో, తలాలలో విస్తరించి ఉంది కానీ, తరచుగా వాటి మధ్య సంభాషణ జరగడం లేదు. జనరేషన్ల మధ్య కూడా చాలా ఎడం ఏర్పడింది. దక్షిణాది భాషా సాహిత్య సమాజాలతో పరిచయం కానీ, ఆదాన ప్రదానాలు కానీ అతితక్కువ ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని ఇతర భాషా సాహిత్యాలతో కూడా పరాయితనం కనిపిస్తోంది. ఈ దూరాలను తగ్గించే ప్రయత్నమే ఈ సాహిత్యోత్సవం ముఖ్యోద్దేశం.

రచయితల మధ్యనే కాదు, ప్రచురణకర్తల మధ్య సమన్వయం ఏర్పడాలి. పుస్తకాల ప్రచురణ, అమ్మకాలు, పంపిణీ వంటి ఉమ్మడి అంశాలకు ఒక సమష్టి కార్యాచరణ అవసరం. ప్రభుత్వం నుంచి సానుకూల విధాన నిర్ణయాలను, ప్రోత్సాహకాలను రాబట్టవలసి ఉంది. సాహిత్యాభిమానులైన వ్యక్తిగత, సంస్థాగత దాతలను భాగస్వాములను చేయవలసి ఉంది. ఈ మధ్య బెంగళూరులో జరిగిన బుక్ బ్రహ్మ సాహిత్యోత్సవంలో దక్షిణ భారత ప్రచురణకర్తల ఫోరమ్ ఏర్పాటు మీద ప్రతిపాదనలు వచ్చాయి.

తమిళ, కన్నడ, మలయాళ సమాజాల్లో సాహిత్యం, పఠనం సాంస్కృతిక విశేషాలుగా, ప్రజా అభిరుచులుగా బలంగా నాటుకుని ఉన్నాయి. తెలుగు సమాజాల్లో ఆ విలువ లోపించింది. బలమైన కళా సాంస్కృతిక వాతావరణం లేకపోవడం, సమాజం బౌద్ధిక స్థాయిని, చైతన్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఆ లోటును కొంతైనా భర్తీ చేయగలిగే ప్రభావం వేయాలని ఈ ఫెస్టివల్ ఆశిస్తున్నది.



తమిళ, కన్నడ, మలయాళ సమాజాల్లో సాహిత్యం, పఠనం సాంస్కృతిక విశేషాలుగా, ప్రజా అభిరుచులుగా బలంగా నాటుకుని ఉన్నాయి. తెలుగు సమాజాల్లో ఆ విలువ లోపించింది. బలమైన కళా సాంస్కృతిక వాతావరణం లేకపోవడం, సమాజం బౌద్ధిక స్థాయిని, చైతన్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఆ లోటును కొంతైనా భర్తీ చేయగలిగే ప్రభావం వేయాలని ఛాయ లిటరరీ ఫెస్టివల్ ఆశిస్తున్నది.

ఇతర లిటరరీ ఫెస్టివల్స్‌కూ దీనికీ తేడా ఏమిటి?

కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ జరుగుతోంది. కానీ, అందులో ప్రాంతీయ, స్థానిక సాహిత్యానికి అతితక్కువ ప్రాతినిధ్యమే దక్కుతోంది. ఆంగ్ల, శిష్ట పాఠకసమాజాన్ని దృష్టిలో పెట్టుకుని దాని రూపకల్పన జరుగుతోందనే అభిప్రాయం ఉంది. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఆమధ్య ఒక సాహిత్యోత్సవం జరిగింది. ఒక మంచి, ప్రశంసనీయమైన ప్రయత్నం. అయితే, ప్రధానంగా అది సెమినార్ నమూనాలో జరిగింది. సాహిత్యశ్రేణుల మధ్య సంభాషణకు పరిమితమైన ఆస్కారమే ఉండింది.

ఉత్సవ వాతావరణంలో సాహిత్య సమావేశాల నిర్వహణ ఒకనాడు తెలుగు ప్రాంతాలలో జరిగేది. 1953లో అలంపూర్‌లో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్ ఏడో వార్షికోత్సవాలు, అన్ని తెలుగు ప్రాంతాల రచయితల ప్రాతినిధ్యంతో ఘనంగా జరిగాయి. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆ సభలకు అతిథిగా రావడం ఒక విశేషమైతే, హైదరాబాద్ నుంచి ఒక ప్రత్యేక రైలు ఆ సమావేశాల కోసం నడిపారు. సాహిత్య అకాడమీ, యువభారతి వంటి సంస్థల వార్షిక కార్యక్రమాలు ఎంతో సందడిగా జరిగేవి. ఆ ఉత్సవాలకు కొన్ని పరిమితులు, పట్టింపులు ఉండి ఉండవచ్చును కానీ, సాహిత్యాభిమానులందరూ వాటికి హాజరయ్యేవారు. ఆ కాలంలో పాలక రాజకీయాలలో ఉండేవారికి సైతం సాహిత్యాసక్తులు ఉండేవి. ప్రాబల్య వర్గాలలో ఇప్పుడు ఆ స్పర్శ కూడా కనిపించడం లేదు. ఈ పరిస్థితి ప్రభుత్వ సాంస్కృతిక, సాహిత్య విధానాల మీద ప్రతికూల ప్రభావాలు వేస్తోంది. సృజనాత్మకత, భావుకత, పుస్తకపఠనం వంటివి ప్రధానాంశాలే కావన్న ధోరణి ప్రబలిపోయింది. ఇతర దక్షిణ రాష్ట్రాలలో ఉన్న వాతావరణం మన దగ్గర లేదంటే, అందుకు ఈ చారిత్రక, సామాజికార్థిక కారణాలన్నీ ఉన్నాయి.

తెలుగు, దక్కనీ సాహిత్యాలు ప్రధానంగా, తక్కిన దక్షిణాది భాష సాహిత్యరంగాలను కూడా కలుపుకుంటూ ఛాయా లిటరేచర్ ఫెస్టివల్ (సిఎల్ఎఫ్) జరుగుతున్నది. సాహిత్యాన్ని సమీక్షించుకోవడం, పరిచయం చేసుకోవడం మాత్రమే కాక, సాహిత్య, అనుబంధ రంగాల బృందాల మధ్య కలివిడికి, సంప్రదింపులకు ఈ ఉత్సవం ఆస్కారం కల్పిస్తుంది. ప్రముఖ రచయితలతో నేరుగా ముఖాముఖీకి వేదిక కల్పిస్తోంది. వివిధ భాషాసాహిత్యాల ప్రచురణకర్తల మధ్య సంభాషణ పెరిగి, తెలుగు సాహిత్యం పొరుగుభాషలలోకి వెళ్లే ఆస్కారం కలుగుతుంది. బుక్ బ్రహ్మ సాహిత్యోత్సవం నుంచి ప్రేరణ పొంది, చిన్నస్థాయి ఆరంభ ప్రయత్నంగా, ఇది ప్రారంభమవుతున్నది. స్పందనను బట్టి మున్ముందు మరింత పెద్దస్థాయిలో ఉత్సవాలను ఆశించవచ్చు.

చర్చాంశాలు, పాల్గొనేవారి ప్రాతినిధ్యం విషయంలో మీ ఎంపికలు ఏ ప్రాతిపదిక మీద సాగాయి?

సాహిత్యం విశాల క్షేత్రం. ఇటువంటి కార్యక్రమాలలో నమూనాలను మాత్రమే సృశించగలం. సాహిత్య వస్తువులో కానీ, సృజనరీతులలో కానీ కనిపిస్తున్న మార్పులను, ప్రభావవంతమైన ధోరణులను చర్చించడం ద్వారా మొత్తం సాహిత్యరంగం లాభపడుతుంది. కాల లక్షణాన్ని పుణికిపుచ్చుకున్న అక్షరాలే, సాహిత్యాన్నికానీ, సమాజాన్ని కానీ మునుముందుకు నడిపిస్తాయి.

ప్రగతిశీల, ఉదార భావరంగాలకు, వాటి వివిధ ఛాయలకు చెందిన సాహిత్యాన్నే ఈ ఫెస్టివల్ పరిగణనలోకి తీసుకుంటుంది. పలు సాహిత్య ప్రక్రియలకు, వాటిలోని ధోరణులకు ప్రాతినిధ్యం వహించేవి చర్చాంశాలుగా ఉంటాయి. సాధ్యమైనంతవరకు అన్ని ప్రాంతాల వారికి, నేపథ్యాల వారికి స్థానం ఉండేట్టు చూశాము. అందరికీ, అన్నిటికీ చోటు కల్పించామని చెప్పలేము. అది సాధ్యం కూడా కాదు. స్థల కాల పరిమితులు ఉంటాయి. ఒకరోజు కార్యక్రమంలో సాధ్యమైనంత వైవిధ్యం ఉండేట్టు చూశాము. కార్యక్రమ వివరాలను పరిశీలిస్తే, సమ్మిశ్రితత్వంపై మా పట్టింపు గ్రహించవచ్చు.

తెలుగు సాహిత్యానికి మరో చేర్పు

తెలుగులోనూ ఒక సాహితీ ఉత్సవం నిర్వహించాలని గత రెండేళ్ళుగా ఛాయ ఆలోచిస్తోంది. తెలుగు సాహితీ సమాజంలోనూ అలాంటి చర్చ నడుస్తోంది. అయితే, సాహిత్య రంగంలోని అన్ని పాయల్ని ఒకచోట చేర్చడమనేది అంత సులువైన విషయమేమీ కాదు. ఒక స్వతంత్ర సంస్థ అలాంటి బాధ్యతను భుజానికెత్తుకుంటే నిర్వహణ వ్యయం, వనరులు సమకూర్చుకోవడం కొంత ప్రయాసతో కూడినదే. కానీ, అందరినీ భాగస్వాములు చేయడం ద్వారా తెలుగు నేలపై కూడా ఇలాంటి ఉత్సవాన్ని నిర్వహించగలమని నమ్ముతున్నాం. అందుకే, ఇది ఛాయ చొరవతో జరుగుతున్న తెలుగు సాహిత్యోత్సవంగానే మేము భావిస్తున్నాం. ఇందులో అందరి భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తున్నాం. పాల్గొనదలిచేవాళ్లు chaayaliteraturefestival.com వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు.

అరుణాంక్ లత,
డైరెక్టర్, ఛాయ రిసోర్స్ సెంటర్



ఇది మొదటి ఫెస్టివల్ మాత్రమే. సువిశాలమైన తెలుగు సాహిత్య రంగంలో ఇందులో వ్యక్తమయ్యేది శకల ప్రాయమే కావచ్చు. కానీ, అది తెలుగు సాహిత్యంలోని ప్రాతినిధ్య శకలమే!

ఇలాంటి ఈవెంట్ నిర్వహణలో మీకు ఎలాంటి సహాయ సహకారాలు అవసరమయ్యాయి?

ఎంతో వ్యయప్రయాసలతో కూడిన పని ఇది. అన్నిటి కంటె ముఖ్యం, పెద్ద ఆవరణ కలిగిన సమావేశ స్థలం. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వారు తమ ప్రాంగణాన్ని ఇవ్వడానికి ఉదారంగా అంగీకరించారు. ప్రతి ఎడిషన్‌కి ఒక టైటిల్ స్పాన్సర్ కూడా ఉండాలి. విద్యాసంస్థ రూట్స్ కొలిజియం అధిపతి బీపీ పడాల, ఇక సాహిత్యాభిమానులైన దాతలు కొంత ఆర్థిక సహాయం చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి పరిమితంగా మాత్రమే అతిథులు వస్తున్నారు. మొదటి ప్రయత్నమే అయినా, ఎందరో ప్రసిద్ధ రచయితలు మా ఆహ్వానాన్ని మన్నించారు. 'ఛాయ' అభిమానులు కార్యక్రమ రూపకల్పనలో సాయం చేశారు.

ఈ సహకారాలన్నీ ఒక ఎత్తు. సాహిత్యాభిమానులు, రచయితలు పెద్ద సంఖ్యలో హాజరయి, ఈ వేడుకలో పాల్గొనడం ద్వారా చేసే సహకారం ఒక ఎత్తు. రానున్న కాలంలో మరిన్ని ఉత్సవాలు నిర్వహించడానికి 'ఛాయ' సంస్థకే కాదు, ఇతర ప్రచురణ సంస్థలకు, సాహిత్య, రచయితల సంఘాలకు ఇది ప్రేరణ ఇస్తుంది. తెలుగు సమాజంలోని సమస్త సృజనాత్మకతలకు, దృక్పథాలకు, మొత్తంగా సాహిత్యసంస్కారానికి ఇది పరోక్ష దోహదం చేస్తుంది. సాహిత్యేతర కళారంగాలతో అనుబంధాన్ని పటిష్ఠం చేస్తుంది.

ఇంటర్వ్యూ ■ క్రాంతి టేకుల

తెలుసుకోవాలని

సంద్రపు అలలను హాయిగ ఊయలలూపేదెవరో తెలుసుకోవాలి
చుక్కలతో ఈ విశ్వం రాసే కావ్యమేమిటో తెలుసుకోవాలి

పంజరంలోని విహంగమోలే ఆకాశాన్నే చూస్తూ ఉంటా
ఎగిరే పిట్టకు స్వేచ్ఛాగీతం నేర్పినదెవరో తెలుసుకోవాలి

చీకటి ఏలే రాజ్యాలన్నీ నిజాల నీడలు దాచేస్తున్నవి
రేయిని హరించి వెలుగును పంచే దారి ఏమిటో తెలుసుకోవాలి

ఇంటి పక్కనే ఉన్నా గానీ చెలితో మాటలు కలపనెందుకో
పున్నమి జాబిలి కలువల స్నేహం కుదిరెనెలాగో తెలుసుకోవాలి

నా తలపులలో అలజడులన్నీ శివమెత్తేలా
నర్తిస్తున్నవి
శాంతించేందుకు చక్కని కవితలు రాయుటెలాగో తెలుసుకోవాలి

■ శివకృష్ణ కొక్కుల
✆ 99896 27222



ఎంత లలితమో అంత అనల్పం

కొబ్బరి తోటల్ని, తమలపాకు తీగల్ని, కాలిబాటకి ఇరువైపులా రెల్లుపొదల్లో తేనెపిట్టల రుతాల్ని దాటి, నీరెండకి పారదర్శకమైన నదిని ఓ తెరచాప పడవలో దాటుకుని ప్రియ కవి మిత్రుడు గోపిరెడ్డి రామకృష్ణారావు (1969–2024) కవితల్ని సమీపించేవాడిని నేను. ఒకప్పుడు అది నాకెంతో హృద్యమైన ప్రయాణం. ఆ సాయంత్రాలెంత రమ్యమో అంత అగమ్య గోచరం. ఆయన కవితలెంత లలితమో అంత అనల్పం.

***

రామకృష్ణ స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా తణుకు. తండ్రి మిఠాయి వ్యాపారం చేసేవారు. దుకాణంలో చేదోడుగా ఉన్నప్పుడు పొట్లాలుకట్టే కాగితాల్లో కవిత్వం మీద రామకృష్ణ దృష్టి పడింది. అదిమొదలు కవిత్వాన్ని ఆవాహన చేయడం ఆరంభించారు. తొలినాళ్ళలో హైకూ కవులతో ఎక్కువగా ప్రభావితమయ్యారు. కొప్పర్తి వెంకటరమణమూర్తి, బి.వి.వి.ప్రసాద్ గార్ల సాంగత్యంలో ఆయన ఆవరణంలోని కాంతి మరింత పరివ్యాప్తం అయింది.

గోపిరెడ్డి రామకృష్ణారావు భావనాప్రపంచం ఎల్లలులేనిది. పచ్చికమైదానం మీంచి కాలిబాటని ప్రశ్నించే తత్వం తనది. అత్యంత సమీపంగా ప్రకృతిని దర్శించటంవల్ల, దైనందిన ఘటనలకి సుదూరంగా జీవితంపట్ల మెలకువతో ఉండటంవల్ల, మీదుమిక్కిలి కవి చేతనాసౌకుమార్యం వల్ల, కవిత్వరచనని తపస్సమానంగా ఆచరించటం వల్ల ఇటువంటి మేలిమి సృజన సాధ్యమయింది.

1990 నుంచి 2020 మధ్య నిదానంగా రచన సాగించారు. గోధూళివేళ అడాటున అల్లల్లాడే తూనీగ రెక్కలంత సున్నితత్వంతో హైకూలని సృజించారు. ఇస్మాయిల్ ప్రశంసకు పాత్రులయ్యారు. 2005లో 'వెన్నెలగా వుంది' పేరిట హైకూ సంపుటిని వెలువరించారు. అవిరామ మానవ జాగరణని, చిరంతన విషాదోల్లాసాన్ని వచన కవితలోకి పట్టితెచ్చారు. కవితల్ని ఒక సంపుటిగా చూసుకోవాలని పలుమార్లు ప్రయత్నించారు. అయితే గత ఏడాది అర్థాంతరంగా మరణించారు. ఈ నేపథ్యంలో రామకృష్ణ వదిలివెళ్ళిన అముద్రిత స్వీయకవితలకి మునుపటి 'వెన్నెలగా వుంది' హైకూలని జతచేయగా 'అదృశ్యానికి ముందు' సంపుటి రూపుదిద్దుకుంది.

***

తెలుగు సాహిత్యంలో విప్లవ, దళిత, స్త్రీవాదధోరణులు వెల్లువలైన కాలంలోనే రామకృష్ణ కవిత్వరచన ప్రారంభమయింది. అయితే ఆయా ఉద్యమకవితలకి తనొక పాఠకుడు మాత్రమే. అప్పటికీ సమాంతరంగా కొనసాగుతున్న 'అస్తిత్వ వాదం' దృక్పథాన్ని ఆయన అనుసరించారు. అధివాస్తవికత వేపు కూడ మొగ్గుచూపారు. లభ్యమైన 31 కవితల్లో అధిక భాగం స్వీయానుభూతితో రాసినవి కాగా కొన్ని సహానుభూతితో పలికినవి. అతితక్కువ కవితలు వస్తుగత వ్యక్తీకరణగా అల్లినవి.

రామకృష్ణ భావనాప్రపంచం ఎల్లలులేనిది. పచ్చికమైదానం మీంచి కాలిబాటని ప్రశ్నించే తత్వం తనది. కవిత నిర్వహణలో ఏకాగ్రత; శైలీపరంగా పరిభాష, ప్రతీకల్లో ప్రత్యేకత; అభివ్యక్తిలో సాంద్రత, క్లుప్తతలకు చదువరులు ముగ్ధులవుతారు. బహుశా పూర్వ, సమకాలిక సాహిత్యకారుల్ని అధ్యయనం చేయడంతోనూ, హైకూధ్యానంలోనూ ఈ లక్షణాలు అలవరచుకున్నారు. జపనీయ హైకూ కవులతో పాటు టాగోర్, చలం, ఆలూరి బైరాగి, వడ్డెర చండీదాస్, ఇస్మాయిల్, కె.శివారెడ్డి, వాడ్రేవు చినవీరభద్రుడు, గాలి నాసరరెడ్డిగార్ల రచనల్ని అభిమానంతో ఆయన చదవగా నేనెరుగుదును.

***

ఈ సంపుటిలోని 'నేను–కాలమూ–నీడలూ' కవితలో క్లుప్తత, గాఢతలను ఎంతో సముచితంగా పాటించారు: "మూల వొదిగిపోయిన నాకు/ కాంతిలోకంలో దుమ్ములు రేపుతున్న/ మకరందపు వానలో తడిపి జ్వరం చేస్తావు/ నీలం పూచే రాత్రి పరిమళాన్ని/ స్వర్ణం విచ్చే పగటి నులివెచ్చనిని/ తాపి నీవే నయం చేస్తావు మళ్ళీ/ నీ గాలిమీద ఆరేసుకుంటాను/ తడిసి తడిసి ఏడుస్తూ పిండుకొని." భావగాంభీర్యం నిండిన కవితల్లో 'మిణుగురు కేకలు' ఒకటి: "ప్రాణం గావుకేక గావుకేక ప్రాణంలా/ గుండెలోనే మిగిలిపోతుంది/ ఒక స్వప్నం తైలవర్ణ చిత్రంగా కరిగిపోతుంది/ దానిలో మిగిలిన చివురును తింటూ కీచురాయి నేను/ ఒకే ఒక నేను."

'నేనే? నేనే!', 'ఆడుకోవాలనే వుంది' కవితల్లోని ఈ పాదాల్లో కవి దృక్పథం, ఔన్నత్యం స్పష్టంగా వ్యక్తమయింది: "ఎండిన నూతిపక్క చేదలా నేను/ నిజ శూన్యాలకు నిజ దుఃఖాలకు నిజ అన్వేషణలకూ/ వొంటరితనమే సాక్షీభూతంలా నిలుస్తూ/ నేను ఎవరినీ నిందించను/ ఎప్పటికీ ఈ భూగోళాన్ని/ తల క్రిందులుగానే చూడగలనేమో/ నా జన్మ అది/ నేను ప్రశ్నలను ఎవరిని వేయను/ జవాబు చెప్పే పూచీని ఎవరినీ పడమనను/ గబ్బిలం తలక్రిందులుగా వేలాడి చూస్తూనే వుంటుంది."

"నేను శత్రువుని ఎక్కడెక్కడో వెతకబోవడం లేదు/ ముఖ్యంగా మీలో/ ఇపుడు నాలోని శత్రువుని వెతికే ఆటను ఆడుతున్నాను/ దయచేసి నన్ను ఆడుకోనివ్వండి."




సాధారణంగా నాజూకుదనంతో రాసే రామకృష్ణ సందర్భాన్ని బట్టి తన సంవేదనని తీక్షణంగానూ, వాగ్వేగంతోనూ వెల్లడించారు. సంక్షిప్త కవితల్లాగే నిడివిగల కవితల్లో కూడ 'కవిత్వం' వైపు గురితప్పలేదు. 'ఎలిజీ' కవితలో గమనం చాలా బాగుంటుంది: "ఎర్రకంకర రంగు నిక్కరుతో/ బొత్తాలులేని పెదపెద పూలచొక్కాతో/ తొమ్మిదేళ్ళ పిల్లాడు/ వెన్నెల రాత్రి పల్లెపొలిమేరల్లో/ వొంటరిగా దేని కోసమో ఏడుస్తూ పరితపిస్తూ వుంటాడు నాలో."

బాల్య, యవ్వనకాలాల స్మృతులు కవి గుండెమీది పొరలుగా చుట్టుకునే ఉన్నాయి. అది కేవలం జ్ఞాపక పరంపర కాదు. అందుకనే ఈ కవిత్వంలో ఓ పూలచొక్కా కుర్రాడు కల తిరుగుతుంటాడు. అతడే చెలికాళ్ళతో దాగుడుమూతలు ఆడతాడు. వర్తమానంలో యువకుడై ఒక మిణుగురు దేహంతో, అరవలేక కీచురాయి ఆత్మతో రాత్రిరాత్రంతా ప్రపంచపు ముఖమ్మీద తిరుగుతూనే ఉంటాడు.

***

రామకృష్ణ 'హైకూలు' ప్రక్రియపరమైన నియమ నిబంధనలకు కట్టుబడినవా లేదా అనే అంశాన్ని నేను మూల్యాంకనం చేయను. 1990వ దశకంలో మనకు కొనసాగిన 'హైకూ ఋతువు'లో వీటిని రాశారు. పసి సీతాకోకచిలుక రెక్కలమీద మెలమెల్లగా రంగులు అలంకృతమైనట్టు, అలముకున్న యావత్ పొగమంచు సూక్ష్మాకృతిలో తుహినకణం వలె రూపాంతరం చెందినట్టు, ఆకాశం నుంచి నడిజామున ఓ ఉల్క రెప్పపాటులో నేల రాలిపోయినట్టు, అంతరంగంలోని దురంత దుఃఖమంతా అశ్రుబిందువుగా కళ్ళ లోంచి బయల్పడినట్టు 131 హైకూలను రాసిపెట్టారు.



ప్రతి కవిసమయంలోనూ సౌందర్యదృష్టికి ప్రాధాన్యం ఇచ్చినట్టుగానే ప్రాపంచిక వాస్తవికత ఎడల ఎరుకతోనే ఉన్నారు. పూలు, పిచ్చుకలు, తూనీగలు, సీతాకోకచిలుకలు, చంద్రుడు సహా అనాథ బాలుడు కూడ హైకూల్లో ప్రత్యక్షమవుతుంటాడు.

'అస్తిత్వమూ స్వప్నమూ' కవితలో రాశారు: "దేహమంతా పిట్టలు ఎగిరిపోయిన ఖాళీ/ శరీరమంతా మొగ్గలు తుంచేసిన బాధ/ పూలూ పత్రాలూ రాలిపోయిన నైరాశ్యం." అయినప్పటికీ ఒంటరితనపు వ్యథలోంచి మహత్తరమైన జీవనకాంక్షతో చేతులు చాచారు. 'నడుస్తూనే...' కవితలో అంటారు: "నరాల్లో ప్రవహించేది, గుండెల్లో లయించేది/ ఉచ్ఛ్వాసంలో తీసుకునేది, నిశ్వాసంలో జారిపోవాల్సింది/ మనసులో విస్ఫోటించేది ఆగిపోతాయి/ నడుస్తూనే వుంటాను పిట్టల రెట్టల వర్షం కింద/ నడుస్తూనే వుంటాను అడుసు మట్టి దుఃఖం మీద." ప్రతికూల పరిస్థితుల్లోనూ వెనకంజవేయక జీవనయానం సాగిస్తానని గొంతెత్తారు.

***

అత్యంత సమీపంగా ప్రకృతిని దర్శించటంవల్ల, దైనందిన ఘటనలకి సుదూరంగా జీవితంపట్ల మెలకువతో ఉండటం వల్ల, మీదుమిక్కిలి కవి చేతనాసౌకుమార్యం వల్ల, కవిత్వరచనని తపస్సమానంగా ఆచరించటం వల్ల ఇటువంటి మేలిమి సృజన సాధ్యమయింది. ఎంతో జాప్యం తర్వాత ఈ కవిత్వం ఈనాటికి వెలువడింది. అంతమాత్రాన తన ప్రాసంగికతని కోల్పోలేదు. సరికదా నేటికీ నవనవంగానే ఉంది.

***

కొబ్బరితోటలు కొబ్బరితోటల్లానే ఉన్నాయి. తేనెపిట్టల కూజితాలకి రెల్లుపొదలు కూడ రెపరెపలాడుతున్నాయి. ఆటుపోట్లతో జీవనది నిరంతరాయంగా ప్రవహిస్తోంది. రేవు దాటించేందుకు పడవ సిద్ధంగానే ఉంది. అయితే అక్కడ కవి అదృశ్యమయ్యారు. ఆయన కవితే మన చెంతకు చేరవచ్చింది. దీనితో రామకృష్ణ తదుపరి జీవితం ఆరంభమయింది.

■ నామాడి శ్రీధర్
✆ 93968 07070

(కాలరేఖ ప్రచురణగా గోపిరెడ్డి రామకృష్ణారావు కవిత్వ సంపుటి 'అదృశ్యానికి ముందు' ఆవిష్కరణ సభ అక్టోబరు 26 ఉ.10:30కి తణుకు సురాజ్య భవన్/ సిపిఐ ఆఫీసులో జరగనుంది. కొప్పర్తి, బి.వి.వి. ప్రసాద్, భగవంతం, నామాడి శ్రీధర్, గోపిరెడ్డి శ్రీసూర్యచరణ్ పాల్గొంటారు.)

రెండు పుస్తకాల ఆవిష్కరణ

హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణలుగా పరవస్తు లోకేశ్వర్ 'షహర్ నామా', జయ మోహన్ తమిళ కథలకు అవినేని భాస్కర్ అనువాదం 'మాడన్ మోక్షం' పుస్తకాల ఆవిష్కరణ అక్టోబర్ 25న ఉదయం 11 గం.లకు, 12 గం.లకు ఛాయా లిటరేచర్ ఫెస్టివల్‌లో భాగంగా అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్‌లో జరుగుతాయి.

గీతా రామస్వామి

సాహితీ పురస్కారాలు

శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదానం, కవి సంధ్య సంస్థ దశాబ్ది ఉత్సవం అక్టోబరు 26 ఉ.10గంటలకు యానాం, డా.బి.ఆర్. అంబేద్కర్ కళ్యాణ మండపంలో జరుగుతుంది. జీవన సాఫల్య పురస్కారాన్ని కొలకలూరి ఇనాక్, యువ పురస్కారాన్ని అవధానుల మణిబాబు అందుకుంటారు. శిఖామణి అధ్యక్షతన జరిగే సభలో మల్లాడి కృష్ణారావు, మండలి బుద్ధ ప్రసాద్, అప్పాజోస్యుల సత్యనారాయణ, కోయి కోటేశ్వరరావు తదితరులు పాల్గొంటారు. కవి సంధ్య – 56 ఆరుద్ర, బైరాగి శత జయంతి సంచికల ఆవిష్కరణ ఉంటుంది.

దాట్ల దేవదానం రాజు

పుస్తక పఠన కార్యక్రమం

పిల్లలు, పెద్దల్లో పుస్తక పఠన సంస్కృతిని పెంచడానికి అక్టోబర్ 26 ఉ.10గంటల నుండి మ.12 గంటల వరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లోను, విజయవాడలోను, మరికొన్ని ప్రాంతాల్లోని ప్రముఖ పార్కులలోను పుస్తక పఠనం జరుగుతుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, రచయితలు, పుస్తక ప్రియులు ఈ మరో గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొనవచ్చు. వివరాలకు: 98491 56588, 99495 35695, 88019 10908.

విజయ భండారు

ముద్దన హనుమంతరావుపై పుస్తకం

బొల్లేపల్లి సత్యనారాయణ, వెన్నిశెట్టి సింగారావు సంపాదకులుగా వెలువరించిన 'ప్రజల వైద్యుడు డాక్టర్ మదన హనుమంతరావు' గ్రంథావిష్కరణ సభ అక్టోబర్ 26 ఉ.10గంటలకు బృందావన్ గార్డెన్స్, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, గుంటూరులో జరుగుతుంది. సభలో యలమంచిలి శివాజీ, చిటిపోతు మస్తానయ్య, కరణం బలరామకృష్ణమూర్తి తదితరులు పాల్గొంటారు.

భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్

గడియారం వేంకట శేషశాస్త్రి సాహిత్య పురస్కారాలు

గడియారం వేంకట శేషశాస్త్రి 44వ సాహిత్య పురస్కార ప్రదాన సభ రచన సాహిత్య వేదిక – గడియారం కుటుంబీకుల ఆధ్వర్యంలో అక్టోబరు 26 సా.5.30గం.లకు ప్రొద్దుటూరు వై.యం.ఆర్. కాలనీలోని అరబిందో ఇంటిగ్రల్ హైస్కూల్‌లో జరుగుతుంది. అవార్డుకు పరిమి శ్రీరామనాథ్ 'జీవాతువు' కావ్యం ఎంపికైంది. ఆయనకు రూ.10వేల నగదు బహుమతితో సత్కారం ఉంటుంది. కార్యక్రమంలో కొమ్మిశెట్టి మోహన్, ఎ.సి. దస్తగిరి, సి.హెచ్. రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 9966624276.

భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి


బీసెంట్ రోడ్డులోని ఓ కిరాణా దుకాణంలో కస్టమర్‌తో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



చంద్ర ప్రకాశం

పండుగ వేళ బెజవాడలో సీఎం చంద్రబాబు పర్యటన

సీఎం చంద్రబాబు రాకతో బెజవాడలో ఒక రోజు ముందే దీపావళి పండుగ వచ్చింది. బీసెంట్ రోడ్డులో పర్యటించిన ఆయన వీధి వ్యాపారులు, దుకాణదారులతో ముచ్చటించారు. వారి వ్యాపారం గురించి అడిగి తెలుసుకున్నారు. జీఎస్టీ తగ్గింపులపై ఆరా తీసి వారికి భరోసా ఇచ్చారు. దీపావళి వేళ చంద్రుడి వలే ప్రకాశిస్తున్న చంద్రబాబుతో సెల్ఫీ దిగేందుకు యువత పోటీ పడ్డారు. అంతటా పండుగ వాతావరణం నెలకొంది.


పున్నమిఘాట్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులతో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని చిన్ని, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, వసంత కృష్ణప్రసాద్, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, ఫ్యార్చ్యూన్ మురళీ పార్క్ అధినేత ముత్తవరపు మురళీ కృష్ణ తదితరులు

బీసెంట్ రోడ్డులో వీధి వ్యాపారులు, దుకాణదారులతో ముచ్చట్లు

- పున్నమిఘాట్‌లో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్, దీపావళి వేడుకలకు సతీసమేతంగా హాజరు
- ఎంటర్‌టైన్‌మెంట్ ఈవెంట్స్‌కు విజయవాడ వేదిక కావాలి
- శని, ఆదివారాల్లో వినోదాత్మక ఈవెంట్స్ జరుపుకోండి
- నగర వాసులకు ముఖ్యమంత్రి పిలుపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ /వన్‌టౌన్): "విజయవాడలో ఇక ప్రతి శని, ఆదివారాలు వినోదాత్మక ఈవెంట్స్ జరుపుకోండి. మీకు నచ్చిన పని చేసి ఎనర్జీని చార్జ్ చేసుకోండి. మిగిలిన రోజుల్లో రెట్టించిన ఉత్సాహంతో పని చేయండి" అంటూ నగర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. పున్నమిఘాట్‌లో ఆదివారం మిగతా 8లో..

టెక్.. క్రాకర్స్

ఆధునిక టెక్నాలజీని పోలిన టపాసులు

- ఆండ్రాయిడ్ సిసింద్రీలు, డ్రోన్ టపాసులు, హెలికాప్టర్ తారాజువ్వలు, లాఫింగ్ బుద్ధా మతాబులు
- చిన్నారులు, యువత మనసు దోచే రాకెట్ చిచ్చుబుడ్డీలు, ఫైర్ గన్‌లు
- మార్కెట్‌కు పరిచయమైన సరికొత్త టపాకులు 8




రామవరప్పాడు రింగ్ నుంచి గుణదల వైపు వెళ్లే రోడ్డులో నీరు

వాన బీభత్సం

నగరంలో భారీ వర్షం

నగరంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కుండపోతగా వర్షం పడింది. ప్రధాన రహదారులు ఎక్కడికక్కడ నీటితో నిండిపోయాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా 746 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

- శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కుండపోత
- ప్రధాన రహదారులు జలమయం
- జిల్లా వ్యాప్తంగా 746 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- పత్తి పంటకు తీవ్ర నష్టం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ/ఇబ్రహీంపట్నం): నైరుతి రుతుపవనాల తిరోగమనం, ఈశాన్య రుతుపవనాల ఆగమన సందర్భంగా సముద్ర ఉపరితలంపై ఏర్పడిన ఆవర్తన ప్రభావంతో నగరాన్ని శనివారం కారుమబ్బులు చుట్టుముట్టాయి. రాత్రి 11 గంటల నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు విరామం లేకుండా వర్షం పడింది. విజయవాడ రూరల్ ప్రాంతంలో అత్యధికంగా 109.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. ఈ వర్షానికి జక్కంపూడి, నున్న, కండ్రిగ ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. విజయవాడ ఈస్ట్ మండలంలోనూ 98.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పటమట, రామవరప్పాడు, మిగతా 8లో..


వర్షపు నీటిలో వెళ్తున్న చిన్నారులు




రామవరప్పాడు రింగ్ నుంచి గుణదల వైపు వెళ్లే రోడ్డుపై భారీగా చేరిన వర్షపు నీరు

జిల్లా వ్యాప్తంగా వర్షపాతం ఇలా..

జి.కొండూరులో 57.8 మిల్లీ మీటర్లు, ఎ.కొండూరులో 30.4, విస్సన్నపేటలో 25.6, వీరులపాడులో 22.2, రెడ్డిగూడెంలో 18.6, చందర్లపాడులో 18.4, కంచికచర్లలో 16.6, తిరువూరులో 14.8, ఇబ్రహీంపట్నంలో 12.6, నందిగామలో 12.4, వత్సవాయిలో 10.2, గంపలగూడెంలో 2.8, మైలవరంలో 2.4, జగ్గయ్యపేటలో 1.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పెనుగంచిప్రోలులో వర్షం నమోదు కాలేదు. జిల్లా వ్యాప్తంగా 746.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా సగటు వర్షపాతం 37.31గా నమోదయిందని అధికారులు ప్రకటించారు.

గురుధాం క్షేత్రానికి సింధు దంపతులు


పల్లకి సేవలో పాల్గొన్న పీవీ సింధు దంపతులు

జగ్గయ్యపేట రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బలుసుపాడు గురుధాం క్షేత్రాన్ని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు దంపతులు ఆదివారం సందర్శించారు. గురుధాం వ్యవస్థాపకుడు గెంటేల వెంకట రమణ దంపతులు వీరికి స్వాగతం పలికారు. శివానందమూర్తికి పూజలు చేసిన సింధు దంపతులు అనంతరం పల్లకి సేవలో పాల్గొన్నారు. గురుధాం సందర్శన గెంటేల సందేశం ఆనందాన్ని కలిగించాయన్నారు. యువత విజయంపై ఆశతో జీవించాలని తెలిపారు. అనంతరం గెంటేల దంపతులు సింధు దంపతులను ఘనంగా సత్కరించారు. వారి వెంట అంతర్జాతీయ విలువిద్య క్రీడాకారుడు గెంటేల ఆనంద్, హర్షిణీ దంపతులు పాల్గొన్నారు.

మల్లగుల్లాలు!

పశ్చిమ బైపాస్ ప్యాకేజీ-3 బ్యాలెన్స్ పనులపై సందిగ్ధం

- విద్యుత్ టవర్ల ఎత్తు పెంపుపై నిర్ణయం తీసుకోని మోర్తు
- ల్యాంకో లైన్‌ను తీసేస్తే ఏంటి పరిస్థితి అని ఆలోచన
- రూ.10 కోట్లు ఖర్చు పెట్టినా ఫలితం ఉండదని భావన
- మరింత జాప్యం కానున్న బైపాస్ పనులు



> పశ్చిమ బైపాస్ ప్యాకేజీ-3 బ్యాలెన్స్ పనులపై సందిగ్ధం నెలకొంది. విద్యుత్ టవర్ల ఎత్తు పెంపు ప్రతిపాదనలపై నిర్ణయం తీసుకోవడంలో కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ మల్లగుల్లాలు పడుతోంది. ఎత్తు పెంచిన తర్వాత ల్యాంకో లైన్‌ను తీసేస్తే రూ.10 కోట్లు వృథాగా పోతాయని ఆలోచన చేస్తోంది. ఈ నేపథ్యంలో బైపాస్ పనులు మరింత ఆలస్యం కానున్నట్టు తెలుస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పశ్చిమ బైపాస్ ప్యాకేజీ-3 బ్యాలెన్స్ పనులు పూర్తి కావాలంటే... జక్కంపూడి, నైనవరం, సూరంపల్లి దగ్గర ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్ల ఎత్తు పెంచాలి. టవర్ల ఎత్తు పెంపునకు అనుమతులు కోరుతూ కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ (మోర్తు)కు ఎన్‌హెచ్ అధికారులు ప్రతిపాదనను పంపి చాలా కాలమైంది. మోర్తు నుంచి అనుమతులు రావటంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మోర్తు నుంచి సకాలంలో ఎందుకు అనుమతులు రావటం లేదన్న దానికి బలమైన కారణాలు ఉన్నట్టుగా తెలుస్తోంది. ల్యాంకో లైన్ టవర్ల ఎత్తు పెంపునకు రూ.10 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ల్యాంకో లైన్‌ను మయన్మార్ దేశానికి చెందిన కంపెనీకి విక్రయించి ఉండటం వల్ల మిగతా 8లో..

తిరువూరు తిరుగుబాటు

- ఎమ్మెల్యే కొలికపూడి సంచలన వ్యాఖ్యలు
- ఎంపీ చిన్ని లక్ష్యంగా విమర్శలు
- డబ్బులకు పదవులు అమ్ముకుంటున్నారని ఆరోపణ 8



బార్ అసోసియేషన్‌లో లక్ష్మీ దేవి పూజలో పాల్గొన్న మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం, బార్ ప్రెసిడెంట్ ఏకే బాషా తదితరులు

బెజవాడ బార్‌లో దీపావళి వేడుక

విజయవాడ లీగల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బెజవాడ బార్ అసోసియేషన్‌లో ఆదివారం దీపావళి పండుగ వేడుకలను న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం, బార్ అధ్యక్షుడు ఎ.కె.బాషా ముందుగా లక్ష్మీదేవి పూజ నిర్వహించారు. అనంతరం బార్ అసోసియేషన్ ముందు టపాసులు వెలిగించి పండుగ జరిపారు. వేడుకల్లో న్యాయమూర్తులు, న్యాయవాదులు, బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్, చలసాని అజయ్‌కుమార్, ఎస్.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవితాల్లో సరికొత్త కాంతులు నిండాలి

● కలెక్టర్ లక్ష్మీశ దీపావళి శుభాకాంక్షలు

కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగతో ప్రజల జీవితాల్లో సరికొత్త కాంతులు నిండాలని, ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో సురక్షితంగా పండుగను జరుపుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆకాంక్షించారు. ప్రజలకు ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకొనే పండుగ దీపావళి అన్నారు. ప్రతికూల శక్తులను తొలగించి, కొత్త వెలుగులు తీసుకొచ్చే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం వెల్లివెరియాలని, జిల్లా, రాష్ట్రం, దేశం అభివృద్ధిపథంలో పయనించాలని కోరుకొంటున్నట్లు తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే టపాసులు కాకుండా దీపకాంతులతో, పర్యావరణహితంగా దీపావళి పండుగ జరుపుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

నెదర్లాండ్ వైద్య విజ్ఞాన సదస్సుకు ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ చంద్రశేఖర్



విజయవాడ సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నెదర్లాండ్‌లో ఈ నెల 20వ తేదీ నుంచి జరిగే ప్రపంచ స్థాయి వైద్య విజ్ఞాన సదస్సులో పాల్గొనేందుకు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ విజయవాడ నుంచి బయలుదేరి వెళ్లారు. ది ఇంటర్నేషనల్ లైజాన్ కమిటీ రెసిస్టుటేషన్(ఐఎల్‌సీవోఆర్) ప్రత్యేక ఆహ్వానం మేరకు ఆయన ఈ సదస్సుకు హాజరవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు- వా టి పరిష్కార మార్గాలు, వైద్య రంగంలో ఏఐ, ఎంఎల్, క్లౌడ్ కంప్యూటింగ్ టెక్నాలజీ అంశాలపై రెండు రోజుల పాటు ఈ సదస్సు జరుగుతుంది. వైద్య రంగం లో పురోగతిపై కూలంకూషంగా చర్చలు జరుగుతాయి.



వరప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గోళ్ల నారాయణరావు, కళాకారులు

వరప్రసాద్ మృతి కళారంగానికి తీరనిలోటు

● సంస్మరణ సభలో గోళ్ల నారాయణరావు నివాళి

విజయవాడ కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : సన్నాల సత్యనారాయణ వరప్రసాద్ మరణం చిత్రకళా రంగానికి తీరని లోటని పోలవరపు సాంస్కృతిక సమితి కార్యదర్శి గోళ్ల నారాయణరావు అన్నారు. డ్రీం వర్క్ ఆర్ట్ గ్యాలరీ, పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ భవనంలో సన్నాల సత్యనారాయణ వరప్రసాద్ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆర్టిస్టులు పి.రమేష్, టి.మృత్యుంజయరావు, వీసీ శేఖర్, గంధ, రామకృష్ణ, చిదంబరం, మురళి, వెంకటేష్, శివ, లక్ష్మణ్, ఉదయ్ పాల్గొని వరప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



చిట్టా కార్తీక్ వీణ, సుబ్రహ్మణ్య రాజు వయోలిన్ వాదన

ముత్తుస్వామి దీక్షితార్‌కు

సంగీత స్వరనాదార్చన

విజయవాడ కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : సంగీత త్రిమూర్తులలో ఒకరైన ముత్తుస్వామి దీక్షితుల వారి ఆరాధనోత్సవం శ్రీ సుబ్రమణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో ఆదివారం హనుమంతరాయ గ్రంథాలయం మినీ హాలులో జరిగింది. కళాకారులు దీక్షితార్ కృతుల గానంతో, వాద్యంతో సుస్వరాల నాదాన్ని వండిస్తూ దీక్షితార్‌ను అర్చించారు. ఆదివారం ఉదయం చిట్టా కార్తీక్ వీణ, సుబ్రహ్మణ్య రాజు వయోలిన్‌తో కార్యక్రమం ప్రారంభమైంది.

శ్రీసుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి విద్యాపీఠం విద్యార్థుల వీణా వాద్యం, గం డూరి శ్రీనివాసమూర్తి బృందం వయోలిన్ వాద్యం, హరిద్ర మ్యూజిక్ అకాడమీ విద్యార్థుల గానం, మోదుమూడి సుధాకర్ శిష్యుల గానం, మల్లాది రవికుమార్ శిష్యుల గానం, ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత నృత్య కళాశాల విద్యార్థుల గానం అలరించాయి. సాయంత్రం మల్లాది కార్తీక త్రివేణి గానం, వామనరావు వేణువు, దేవిక, హాస, శ్రీమేథల గాత్రం, అనన్య, అభిజ్ఞల గాత్రయుగళం, లాస్యప్రియ గానం, లక్ష్మీ మనోజ్ఞ, గాయత్రిల గాత్ర యుగళం, ఆహ్లాద్, ఆముక్తల గాత్ర యుగళం, ప్రణాద్ గానం దీక్షితార్‌కు నీరాజనాలర్పిస్తూ జరిగాయి. వీరికి వయొలిన్, మృదంగం, ఘటాలతో గండూరి శ్రీనివాసమూర్తి, మనసిజ, సుబ్రహ్మణ్యరాజు, కృష్ణ, ఫల్గుణ్, సురేష్, సూర్య, అరవింద్, కెఎన్ శర్మ, హరిబాబు, రామకృష్ణ, శరవణ, ప్రసాద్ చక్కగా సహకరించారు.

సుప్రసిద్ధ గాత్ర సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ దీక్షితార్ బహుముఖ ప్రజ్ఞ కలిగిన వాగ్గేయకారుడని, నవగ్రహకృతులు, పంచ భూత స్థల కృతులు, సప్తతాళములతో సంస్కృత భాషలో 72 మేళకర్తలలో గురుగుహ ముద్రతో స్వరపరిచిన భగవదోపాసకుడన్నారు. సంగీత వారసత్వాన్ని సజీవంగా ఉంచడానికి సమితి వాగ్గేయకారుల జయం తి, ఆరాధన కార్యక్రమాలను నిర్వహిస్తూ భవిష్యత్తరానికి వాగ్గేయకారుల భక్తి వైభవాన్ని, సంగీతం పారమార్థిక చింతనను, సంగీత పవిత్రతను తెలుపుతూ కార్యక్రమాలను నిర్వహిస్తున్న సమితి అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ గోపీచంద్, సీవీ రావు తదితరులను అభినందించారు. పర్యవేక్షణ సీవీ రావు చేయగా నిర్వహణ రామలక్ష్మి చేశారు.

సీపీఎస్ ఉద్యోగులను మోసం చేశారు : బాజీ పఠాన్

గాంధీనగర్ , అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మంత్రుల బృందంతో జరిగిన సమావేశంలో సీపీఎస్ ఉద్యోగుల సమస్యను ప్రస్తావించకుండా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తమను మోసం చేశారని ఏపీసీపీఎస్ఈఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి హామీ తీసుకున్నారన్నారు. సీపీఎస్ ఉద్యోగుల జీవన్మరణ సమస్య సీపీఎస్ రద్దు కోసం ఒక్క నేత కూడా ప్రస్తావించలేదని వాపోయారు.

కూలెంట్ ఆయిల్ కంపెనీలో అగ్నిప్రమాదం

ఇద్దరి మృతి, ముగ్గురికి గాయాలు

● ఆకతాయి చర్యే కారణం



మృతులు షణ్ముఖ శ్రీనివాస్, రమణబాబు (ఫైల్)

విద్యాధరపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యాధరపురం రామరాజ్యనగర్‌లో ఆదివారం కూలెంట్ ఆయిల్ (టిన్నర్) తయారీ కంపెనీలో శనివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో బాలుడు (16) అక్కడికక్కడే చనిపోగా, మరొక యువకుడు (19)కు తీవ్ర గాయాలకు గురై విజయవాడ చికిత్స పొందుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతిచెందాడు. మరో ముగ్గురికి స్వల్పంగా గాయాలయ్యాయి. గోడౌన్ పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. కూలెంట్ ఆయిల్.. నిప్పు వెలిగిస్తే మండుతుందా లేదా అని అత్యుత్సాహం ప్రదర్శించిన బాలుడు టబ్‌లో ఉన్న కూలెంట్ ఆయిల్‌లో అగ్గిపుల్ల గీసివేయటంతో ఈ సంఘటన జరిగినట్లు అక్కడ పని చేస్తున్న యువకులు తెలిపారు. వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఎస్.ఆకాష్ గత పన్నెండేళ్లకు పైగా రామరాజ్యనగర్‌లో శ్రీబాలాజీ ఏజెన్సీ టిన్నర్ లిక్విడ్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. ఈ కంపెనీలో చిట్టినగర్, సిండికేట్ బ్యాంక్ కాలనీకి చెందిన పీసా పవన్‌సాయి మణికుమార్ (19), మోహన కృష్ణ పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం ఆకాష్ వ్యక్తిగత పనులపై ఊరెళుతూ కంపెనీలో పనిచేస్తున్న వారిని పది బాటిల్స్‌లో కూలెంట్ ఆయిల్ పట్టమని చెప్పివెళ్లాడు. వారు పని చేస్తుండగా రాత్రి 12.15 గంటలకు గతంలో పని చేసి మానివేసిన శ్రీకాకుళపు షణ్ముఖ శ్రీనివాస్ (16), అతని స్నేహితులు రమణబాబు, అరుణ్ కంపెనీ వద్దకు వెళ్లారు. మణికుమార్, మోహన్‌కృష్ణ ఆయిల్ నింపిన బాటిల్స్‌ను అట్టపెట్టెలో ప్యాక్ చేసి రూమ్‌లో భద్రపరచారు. అగ్గిపుల్ల గీసి కూలెంట్ ఆయిల్‌లో వేస్తే మంట వస్తుందా? రాదా? అంటూ మోహన కృష్ణ ఆకతాయిగా మాట్లాడి అగ్గిపుల్ల గీసి టబ్‌లో ఉన్న కూలెంట్ ఆయిల్‌లో వేశాడు. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగసి గదుల్లో ఉన్న కూలెంట్ బాటిల్స్ మొత్తం కాలిపోయాయి. చివరి గదిలో ఉండటం వల్ల షణ్ముఖ శ్రీనివాస్ మంటల్లో నుంచి బయటకు రాలేక పొగ దట్టంగా వ్యాపించటంతో అక్కడికక్కడే చని పోయాడు. మరో గదిలో ఉన్న రమణబాబు (19) బయటకు వచ్చే క్రమంలో తీవ్రంగా గాయపడ్డాడు. పవన్ సాయి మణికుమార్, అరుణ్, మోహనకృష్ణ కంపెనీలో నుంచి బయటకు పరుగెత్తారు. ఈ సంఘటనలో వారికి స్వల్పంగా గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించటంతో కంపెనీ పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటనలో మంటలు, పొగ పెద్ద ఎత్తున రావటంతో స్థానికులు భయ భ్రాంతులకు గురయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సై అనూష తమ సిబ్బందితో ఘటనా ప్రాంతానికి వెళ్లి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పవన్‌సాయి, మణికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



రామరాజ్యనగర్‌లో కూలెంట్ ఆయిల్ (టిన్నర్) తయారీ భవనం, దగ్ధమైన గోడౌన్



మొగల్రాజపురంలో నిల్వ ఉన్న చికెన్‌ను స్వాధీనం చేసుకుంటున్న రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ చైర్మన్ చంద్రదండు ప్రకాష్ నాయుడు, అధికారులు

కుళ్లిన, నిల్వ చికెన్ విక్రయాలు

● రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ తనిఖీల్లో బట్టబయలు

చికెన్‌ను లొట్టలేసుకుంటూ తింటున్నారా.. అయితే కాస్త ఆలోచించండి. హోటల్‌లో అయినా, ఇంట్లో అయినా మీరు తినే చికెన్ ఎంత వరకు నాణ్యమైనదో తెలుసుకున్న తరువాతనే ఆరగించండి. ఎందుకంటే మోసగాళ్లు మీ చెంతనే పొంచి ఉన్నారు. కుళ్లిన, నిల్వ ఉన్న చికెన్‌ను మీకు అమ్మి చీటింగ్ చేస్తున్నారు. చికెన్‌కు ప్రజల్లో ఉన్న క్రేజ్‌ను మోసం చేసి సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాదు మిమ్మల్ని అనారోగ్యం పాల్జేస్తున్నారు.

విజయవాడ సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రజలకు కుళ్లిన, నిల్వ ఉన్న మాంసాన్ని విక్రయిస్తున్న విషయం మరోసారి వెలుగులోకి వచ్చింది. ఎన్నో ఏళ్లుగా గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న ఈ మోసాన్ని రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ చైర్మన్ చంద్రదండు ప్రకాష్ నాయుడు పసిగట్టారు. తన సిబ్బంది, మునిసిపల్, పశు సంవర్థక శాఖ అధికారులతో తనిఖీలు చేసి చికెన్ షాపుల్లో జరుగుతున్న చీటింగ్‌ను బయటపెట్టారు.

మొగల్రాజపురం, పటమటలంక ప్రాంతాల్లోని రెండు దుకాణాల్లో తనిఖీలు చేపట్టిన ఈ బృందం ఒళ్లు గగుర్పొడిచే అంశాలను మన ముందుకు తీసుకొచ్చింది. ముందుగా మొగల్రాజపురంలోని ఓ ప్రముఖ చికెన్ షాప్‌ను ప్రకాష్ నాయుడుతో మాంసాభివృద్ధి సంస్థ డైరెక్టర్ ప్రవీణ, ఫుడ్ సేఫ్టీ అధికారి రవీంద్రరెడ్డి, మునిసిపల్ వెటర్నరీ డాక్టర్ సోమశేఖరరెడ్డి, మాంసాభివృద్ధి కార్పొరేషన్ అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ సుధామాధురి, డాక్టర్ ఎ.వీరప్రసాద్, సిబ్బంది తనిఖీ చేశారు. ఆ ప్రాంతంలోని ప్రజలు ఎక్కువ మంది ఈ షాపులోనే చికెన్ కొనుగోలు చేస్తుంటారు. పెద్ద సంఖ్యలో ప్రజలకు చికెన్ అమ్మే ఈ షాపు లోపలకు వెళ్లిన ఈ బృందం ఒక్క సారిగా కంగుతింది. మాంసం ప్రాసెస్ చేసే ప్రాంతాలు దుర్భరంగా ఉన్నాయి. వారం రోజుల క్రితం మాంసం ఫ్రిజ్‌లో ఉంది. 24 గంటల క్రితం చనిపోయిన కోళ్లు ర్యాక్‌లలోనే ఉన్నాయి. నాలుగు రోజులుగా కోళ్ల వ్యర్థాలను అక్కడ నుంచి బయలకు తీసుకెళ్లలేదు. పైకి అత్యంత ఆకర్షణీయంగా కనిపించే ఈ షాపు లోపల ఉన్న వాతావరణం చూసి ఈ బృందం ఒక్కసారిగా బిత్తరపోయింది. వెంటనే దుకాణంపై కేసు నమోదు చేసింది. నిల్వ ఉన్న మాంసంపై బ్లీచింగ్ చల్లి అక్కడ నుంచి తరలించింది. ఆ తరువాత పటమటలంక కృష్ణవేణి రోడ్డులోని ఓ దుకాణంలోనూ నిల్వ ఉన్న మాంసాన్ని ఈ బృందం గుర్తించింది. అక్కడైతే ఏకంగా టాయిలెట్ పక్కనే మాంసాన్ని నిల్వ చేశారు. కొనుగోలుదారులు రాగానే అదే మాంసాన్ని అంటగడుతున్నట్లు ఈ బృందం గుర్తించింది. కోళ్ల వ్యర్థాలు, అపరిశుభ్రంగా ఉన్న ఈ దుకాణంపైనా వారు కేసు నమోదు చేశారు. ఈ షాపు నుంచి అత్యధికంగా హోటళ్లకు చికెన్ సరఫరా అవుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాష్‌నాయుడు మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఈ సంస్థను నెలకొల్పారన్నారు. నాసిరకం మాంసాన్ని విక్రయించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఫ్రీజర్ బాక్సులో నిల్వ చేసిన చికెన్



పటమటలోని షాపులో టాయిలెట్ వద్ద చికెన్

ప్రభుత్వ వైద్య కళాశాలల్ని ప్రైవేట్‌పరం చేయొద్దు

● ప్రభుత్వ మెడికల్ కళాశాలల పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్ షిప్ (పీపీపీ) వ్యతిరేక పోరాట సమితి డిమాండ్



పీపీపీ వ్యతిరేక పోరాట సమితి సదస్సులో ప్రసంగిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేష్, వేదికపై రామకృష్ణ, వై.శ్రీనివాసరావు, వడ్డే శోభనాద్రీశ్వరరావు, జడ శ్రావణకుమార్ తదితరులు

గవర్నర్‌పేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పీపీపీ విధానంలో 10 ప్రభుత్వ వైద్య కళాశాలల్ని ప్రైవేట్ పరం చేయడాన్ని నిలిపివేసి, ప్రభుత్వమే నిర్వహించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేష్ డిమాండ్ చేశారు. ఎంజీ రోడ్డులోని ఎంబీవీకె భవన్‌లో ఆదివారం ప్రభుత్వ మెడికల్ కళాశాలల పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్ షిప్ (పీపీపీ) వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ప్రధాన వక్తగా పాల్గొన్న డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రజల జీవించే హక్కును హరించేందుకు పీపీపీ విధానం ప్రవేశపెట్టి వైద్య విద్యను, వైద్యాన్ని ప్రైవేట్ పరం చేయడాన్ని రాజ్యాంగ వ్యతిరేక చర్యగా పరిగణించాలన్నారు. ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడం ప్రథమ కర్తవ్యంగా ప్రభుత్వాలు భావించాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రంగాలను ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు అప్పగిస్తే ముఖ్యమంత్రి, ప్రభుత్వ పెద్దలు చేసే పనేమిటని ప్రశ్నించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రైవేట్ సంస్థలకు రాయితీలు ఇస్తూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ విజన్-2047 పేరిట ధ్వంస రచన చేస్తున్నారని కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ తులసిరెడ్డి మా ట్లాడుతూ ప్రభుత్వ ఖజానాను ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి సర్కార్ చేయని ప్రయ త్నం అంటూ లేదన్నారు.

ఏపీ మెడికోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గూగుల్ డేటా సెంటర్‌కు కల్పిస్తున్న రాయితీలో నాలుగో వంతు వైద్య రంగానికి ఖర్చు చేస్తే అంతకంటే ఎక్కువ ఉద్యోగాలతో పాటు పరోక్షంగా మరెందరికో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, ప్రజారోగ్యానికి, ప్రజా సంక్షేమానికి ఖర్చు పెట్టేందుకు నిధులు లేవని తెలపడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యమే అన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభు త్వం చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం కొనసాగించడం దురదృష్టకరమన్నారు. పీపీపీ విధానం కూటమి ప్రభుత్వ పతనానికి భస్మాసుర హస్తంగా మారబోతోందని హెచ్చరించారు. సదస్సు కు అధ్యక్షత వహించిన వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో విద్య, వైద్యం ప్రభుత్వాలే అందిస్తున్నాయని, మన రాష్ట్రంలో కూడా ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. సదస్సులో పలు తీర్మానాలు ఆమోదించారు. ఏపీ ప్రభుత్వ కళాశాల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా డాక్టర్ పీవీ రమేష్, కన్వీనర్‌గా డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, కో-కన్వీనర్లుగా కెఎస్ లక్ష్మణరావు, వి. లక్ష్మణరెడ్డి, కొరివి వినయ్‌కుమార్, డాక్టర్ ఎన్‌వీ రమణయ్యలను సదస్సు ఎన్నుకుంది. సదస్సులో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు జడ శ్రావణకుమార్, కుర్రా వసుంధర, డాక్టర్ జె. పూర్ణచంద్రరావు, ఈదర గోపీచంద్, షేక్ మస్తాన్ వలీ, డాక్టర్ ఎం.వి.రమణయ్య తదితరులు ప్రసంగించారు.

ఉద్యోగ సంఘాల చరిత్రలో మైలురాయి

● నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం హర్షం

గాంధీనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం చేసేందుకు ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరపడం ఆహ్వానించదగ్గ పరిణామమని ఆంధ్రప్రదేశ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కాన చంద్రశేఖర్, సహాధ్యక్షుడు ఓలేటి స్వామిసాయిరామ్, కార్యదర్శి కె. సుబ్బనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. పూర్తి డీఏ చెల్లింపు, ఉద్యోగుల హెల్త్‌స్కీం త్వరలోనే సంపూర్ణంగా అందుబాటులోకి తెస్తానని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం గత దశాబ్ద కాలంలో ఎన్నడూ జరగలేదన్నారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చంద్రబాబు నిర్వహించిన సమావేశం ఉద్యోగ సంఘాల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. దార్శినికత కలిగిన చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రాభివృద్ధికి ఉద్యోగులు సహకరిస్తారన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

● ఏపీజేఏసీ చైర్మన్ బొప్పరాజు

గాంధీనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అతి తక్కువ జీతాలతో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వీటి అమలుకు ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ అండ్ కాంట్రాక్టు డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం స్థానిక రెవెన్యూ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంపాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వశాఖల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు డ్రైవర్లకు జీతబత్యాలు పెంచాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈడుపుగంటి మోహనరావును సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పి.నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేఏసీ స్టేట్ సెక్రటరీ జనరల్ అండ్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ఏపీ డ్రైవర్ల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.




ఐఎంఏ సిటీ ఉపాధ్యక్షుడిగా డాక్టర్ తారకప్రసాద్ ఏకగ్రీవం

విజయవాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) విజయవాడ సిటీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐఎంఏ హాలులో ఆదివారం జరిగిన ఎన్నికల్లో తారకప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు డార్టర్ పీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ రసిక్ సంఘ్వి, డాక్టర్ మధుసూదన్ శర్మ తెలిపారు. తారకప్రసాద్ 20 సంవత్సరాల నుంచి ఐఎంఏ సభ్యుడిగా, ఈసీ మెంబర్, స్టేట్ కౌన్సిల్ మెంబర్, జాయింట్ సెక్రటరీగా చేశారు.

బూడిద కాంట్రాక్టు రద్దు చేయాలని వినతి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉచిత బూడిద లోడింగ్ కోసం, బూడిద కాంట్రాక్టు రద్దు చేయాలని గత 60 రోజులుగా ఉద్యమం చేస్తున్నా జెన్కో తమ సమస్యను పరిష్కరించడం లేదని , తమ సమస్యకు పరిష్కారం చూపాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులను డాక్టర్ ఎన్టీటీపీఎస్ టిప్పర్, లారీ ఓనర్స్ సొసైటీ అధ్యక్షుడు కోయ వెంకట్రావ్, సభ్యుడు షైదా సైదులు, టీడీపీ సీనియర్ నాయకుడు నల్లూరు సూర్యనారాయణలు మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించి కోరారు. సంబంధిత మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించి న్యాయం జరిగేలా చూస్తామని నేతలు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

టీడీపీ సీనియర్‌నేత నందమూరి వెంకట్రావ్ మృతి



విస్సన్నపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపక నాయకుల లో ఒకరైన నం దమూరి వెంకట్రావ్(79) ఆదివారం ఆయన నివాసంలో కన్నుమూశారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బా ధపడుతూ మంచానికే పరిమితం అయ్యారు. విస్సన్నపేట సొసైటీకి అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆయన కుమారుడు నందమూరి శ్రీరా మచంద్ర ప్రస్తుతం మారేమం డ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. వెంకట్రావ్‌కు భార్య, కుమార్తె, కుమారుడు కలరు. పార్టీలకు అతీతంగా ఆయన వెంకట్రావ్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137,146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

కాళీమాత ఆలయంలో కార్తీక మాస పూజలు రేపటి నుంచి

కృష్ణలంక, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంక త్రిశక్తిపీఠంలోని కాళీమాత ఆలయంలో విశ్వావసు నామ సంవత్సర కార్తీక శుద్ధ పాడ్యమి (22 నుంచి), కార్తీక బహుళ అమావాస్య (నవంబరు 20) వరకు ఆలయ ఆవరణలో మహా లింగార్చనతోపాటు విశేష అర్చన, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7 నుంచి ఉదయం 9.30 గంటల వరకు పూజలు జరుగుతాయన్నారు. 5న పౌర్ణమి, 20న అమావాస్య రోజు దీపోత్సవం జరుగుతుందన్నారు.



ప్రమిదలను కొనుగోలు చేస్తున్న మహిళలు

రైతుబజార్ సెంటర్‌లో దీపావళి సందడి

భారతీనగర్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పురస్కరించుకుని కొనుగోలుదారులతో పటమట రైతుబజార్ రోడ్డు రద్దీగా మారింది. రోడ్డులో నగరానికి సమీపంలో ఉన్న పల్లెల నుంచి వ్యాపారులు మామిడి ఆకులు, అరటి పళ్లు, తదితర పూజా సామగ్రి, మట్టి ప్రమిదలు, పూవ్వులు, పండ్లు తదితర అందుబాటులో ఉండడంతో ఆదివారం సాయంత్రం కొనుకోలు దారులుతో రైతుబజార్ రోడ్డు రద్దీగా మారింది.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న టపాసులు

జలమయం

భారతీనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తూర్పులోని 11వ డివిజన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలోని డ్రైన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో శనివారం రాత్రి కురిసిన వర్షానికి కాలనీలోని 2, 3వ రోడ్డులతో పాటు పలు రోడ్లు నీటమునిగాయి. కాలనీలో డ్రెయినేజీ లీక్ కావడంతో రోడ్లలన్నీ అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చింది. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



జలమయమైన పీఅండ్‌టీ కాలనీలోని రెండవ రోడ్డు

ప్రధాన రహదారులు జలమయం



ఏపీఐఐసీకాలనీ నివాసంలోకి చేరిన వాననీరు



బురదగా మారిన ఏపీఐఐసీ కాలనీలోని వీఎంసీ స్కూల్ గ్రౌండ్

శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి 4, 3వ డివిజన్‌లోని భారతీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు, ఏపీఐఐసీ కాలనీ, కరెన్సీనగర్ కాలనీ, నాగార్జుననగర్ కాలనీలోని పలు అంతర్గత రోడ్లు, శ్రీనివాస బ్యాంక్ కాలనీ అంతర్గత రోడ్లు, విజయలక్ష్మి కాలనీ మెయిన్ రోడ్డుతో పాటు పలు రోడ్లు జలమయం అయ్యాయి. స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

కలెక్టరేట్, : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక దీపావళి పండుగ సందర్భంగా రద్దు చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 27న పీజీఆర్ఎస్ కార్యక్రమం యధా విధిగా జరుగుతుందని తెలిపారు.

టైర్ రీట్రేడర్స్ అసోసియేషన్
కార్యవర్గ ప్రమాణస్వీకారం

» అధ్యక్షుడిగా అహమ్మద్



ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న నూతన కార్యవర్గం

ఆటోనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ది విజయవాడ టైర్ రీట్రేడర్స్ అండ్ వల్కనైజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం రాత్రి ఆటోనగర్‌లోని ఏటీఏ కార్యాలయంలో జరిగింది. నూతన అధ్యక్షుడిగా షేక్ ఫఖర్ అహమ్మద్(బాబు), గౌరవాధ్యక్షుడిగా ఎస్.ఎస్.ఎస్.హుస్సేనిబాబా, కార్యదర్శిగా మహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్, కోశాధికారిగా అబ్దుల్ అజీస్, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ మాలిక్ హబ్బాని, షేక్ బాజీ, జి.గంగరాజు, బులెట్‌బాబు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎండీ రిజ్వాన్‌తోపాటు పలువురు కార్మికులు, నేతలు పాల్గొన్నారు. కార్యవర్గం మూడేళ్లపాటు పదవిలో ఉంటుంది.



వృద్ధాశ్రమానికి కంప్యూటర్, దుప్పట్లు అందజేస్తున్న ప్రిన్స్‌పాల్ అనురాధ, తదితరులు

నలంద విద్యార్థులు ప్రమిదలు విక్రయించి..
వృద్ధులకు వితరణ

లబ్బీపేట,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): నలంద డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ 4ఏ బెటాలియన్ విద్యార్థినులు దీపావళి సందర్భంగా కళాశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మట్టి ప్రమిదలకు రంగులు వేసి కళాశాలలో ప్రదర్శన నిర్వహించారు. వారం రోజుల పాటు 1000పైగా వివిధ రకాల ప్రమిదలను అందంగా అలంకరించారు. ప్రమిదలు విక్రయించగా వచ్చిన 41 వేల రూపాయలను కానూరు లోని వృద్ధాశ్రమానికి కంప్యూటర్, దుప్పట్లు, పండ్లు, స్వీట్స్ అందజేశారు. కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ ఎకోఫ్రెండ్లీ దీపావళి 2016నుంచి కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు.

జిమ్నాస్టిక్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు సర్టిఫికేట్లను అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ త్రిమూర్తిరాజు

లబ్బీపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిమ్నాస్టిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న జిమ్నాస్టిక్ జిల్లాస్థాయి పోటీల్లో రెండో రోజు సీనియర్ విభాగంలో పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ కార్పొరేటర్ టి.త్రిమూర్తి రాజు విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలను వారి జీవితంలో ఒక భాగం చేసుకోవాలని, తద్వారా మానసిక ,శారీరక ఉల్లాసాన్ని, మంచి ఆరోగ్యాన్ని పొందుతారన్నారు. కార్యక్రమంలో జిమ్నాస్టిక్స్ కోచ్ వై.రామ్మోహన్, కార్యదర్శి బి.బాబురావు, కోశాధికారి ఎల్.మురళీకృష్ణ, జాయింట్ సెక్రెటరీ ఎల్. శాంతి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

బాణసంచా దుకాణాల్లో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

కానూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మున్సిప ల్ పరిధిలోని కానూరు, సనత్‌నగర్, అశోక్‌నగర్, పిన్నమనేని టీచర్లు కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ దుకాణాల్లో ఆదివారం సాయంత్రం మున్సిపల్ కమిష నర్ షేక్ నజీర్ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు. దుకాణాల్లో అగ్నినిరోధక పరికరాలు, నీరు, ఇసుక తదితర పరికరాలు ఉన్నాయో, లేవో పరిశీలించారు. బాణ సంచా సామాన్లు విక్రయించే సమయంతో తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన వివరించారు. దుకాణాల లైసెన్స్‌లను పరిశీలించారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డి. కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పీపీపీని వ్యతిరేకిస్తూ...
ఏఐఎస్ఎఫ్ బస్సు యాత్రకు ఎన్ఎస్‌యూఐ మద్దతు

కృష్ణలంక, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంతో ప్రైవేటీకరణ చేస్తుందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు ఈనెల 22 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు జరిగే వైద్య కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఏఐఎస్ఎఫ్ చేపట్టబోయే బస్సు యాత్రకు కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) ఆంధ్రప్రదేశ్ తరఫున మద్దతు తెలియజేస్తున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. సభలకు, ర్యాలీలకు, సమావేశాలకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర, జిల్లా, నగర కమిటీ నాయకులు తప్పనిసరిగా పాల్గొంటారన్నారు.

కానూరు కట్టపై నివాసితులకు న్యాయం చేస్తా

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కానూరు/ పెనమలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కానూరు కట్టపై నివాసం ఉండే ప్రతి ఒక్కరికీ నివాసయోగ్యమైన స్థలం కేటాయిస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన కానూరు కట్టపై నివాసం ఉండే వారిని కలిసి వారి బాగోగులను తెలుసుకొని మాట్లాడు తూ, కట్టమీద గృహాలను అధికార పార్టీ కూల్చి వేసిందని ప్రతిపక్ష పార్టీచేసే ప్రచారంలో నత్యంలేదని, కూటమి ప్రభుత్వంలో ప్రతిఒక్కరికీ న్యాయం జరుగు తుందని, ప్రజాక్షేమమే కూటమి ప్రభుత్వ అంతిమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. వైసీపీ నేత దేవభక్తుని చక్రవర్తికి ధైర్యముంటే గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని, టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధిపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖ భూమి లీజు ముగిసిపోయినా ఆ భూమిని సాగు చేస్తూ అనుభవిస్తున్న చక్రవర్తి ప్రజల బాగు గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. అభివృద్ధి పనుల్లో పాలుపంచుకొంటున్న ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, పోలీసులతో చక్రవర్తి దురుసుగా ప్రవర్తించడం సరయిన పద్ధతి కాదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట కూటమి నేతలు అన ుమోలు ప్రభాకరరావు, యార్లగడ్డ సుచిత్ర, షేక్ బుజ్జి, రవికిరణ్ ఉన్నారు.

డీఏ ప్రకటించటం మంచి పరిణామం

చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగ సంఘ నేతలు

గన్నవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగులకు డీఏ ప్రకటించటం మంచి పరిణామం అని, దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న అనేక సమస్యల పట్ల సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించటంపై ఏపీ ఎన్‌జీవోస్ అసోసి యేషన్ గన్నవరం తాలూకా అధ్యక్షుడు వి.సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న ఒక డీఏను నవంబరు నెల నుంచి మంజూరు చేయటం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న ఏపీ ఎన్జీవోస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ అలపర్తి విద్యాసాగర్‌కు అభినందనలు తెలిపారు. డి.రాంబాబు, శ్రీను, ఉమా మహేశ్వరరావు, సీహెచ్ ప్రసాద్, శ్రీనివాసరావు, సునీల్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



టెక్.. క్రాకర్స్

- ఆధునిక టెక్నాలజీని పోలిన టపాసులు
- ఆండ్రాయిడ్ సిసింద్రీలు, డ్రోన్ టపాసులు
- హెలికాప్టర్ తారాజువ్వలు, లాఫింగ్ బుద్ధా మతాబులు
- చిన్నారులు, యువత మనసు దోచే రాకెట్ చిచ్చుబుడ్డీలు, ఫైర్ గన్‌లు
- మార్కెట్‌కు పరిచయమైన సరికొత్త టపాకులు







ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: స్మార్ట్ ఫోన్‌కు మాత్రమే పరిమితమైన ఆండ్రాయిడ్ ఈ దీపావళికి వెలుగులు నింపనుంది. గాలిలో ఎగిరి వీడియో షూట్ చేసే డ్రోన్‌లు ఆకాశం నుంచి కాంతిని విరజిమ్మేందుకు సిద్ధమైంది. హెలికాప్టర్ సౌండ్ చేస్తూ ఆకాశానికి రంగులద్దే తారాజువ్వలు ఈ దీపావళికి సందడి చేయనున్నాయి. నేటి కాలంలో టెక్నాలజీని, వినోదాన్ని అందించే ప్రతి యూనిట్, వస్తువు దీపావళి టపాకులు రూపాన్ని సంతరించుకుంది. మారుతున్న జీవన శైలి, దినదినాభివృద్ధి చెందుతున్న సాంకేతికతను క్రాకర్స్ తయారీదారులు అందిపుచ్చుకున్నారు. యువత, చిన్నారుల అభిరుచికి అనుగుణంగా బాణాసంచాను సిద్ధం చేశారు. పాతతరానికి పరిచయమైన మందుగుండు సామగ్రితో పాటు, నేటితరం ఆలోచనా విధానికి అనువైన టపాసులను ఈ దీపావళికి మార్కెట్‌లోకి చేరింది.

దీపావళి పండుగకు కళను తీసుకొచ్చే క్రాకర్స్ దుకాణాలు నగరంలో పలుచోట్ల ఏర్పాటయ్యాయి. లబ్బీపేటలోని వజ్రా గ్రౌండ్స్, సెంట్రల్ నియోజకవర్గంలోని ఘంటసాల సంగీత కళాశాల, సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియం, పశ్చిమ నియోజకవర్గంలోని ఆర్టీసీ వర్క్‌షాప్ ప్రాంగణాల్లో రిటైల్ దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఆయా ప్రాంతాల్లో ఆదివారం ఉదయమే ఏర్పాటైన దుకాణాల వద్ద ప్రజల తాకిడి మొదలైంది. వీటితో పాటు భవానీపురం, గొల్లపూడి ప్రాంతాల్లోని హోల్ సేల్ షాపుల్లోనూ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

ఆదునిక సాంకేతికతకు దీపావళి రంగులు

నేటితరం మనసుకు హత్తుకునేలా ఈ ఏడాది మార్కెట్‌లోకి కొత్తగా బాణా సంచా చేరింది. మారుతున్న కాలానికి అనుగుణంగా మందుగుండు సామగ్రిని తయారు చేయడంలో నిష్ణాతులైన తయారీదారులు ఈ ఏడాది సాంకేతిక నమూనాలను రంగంలోకి దింపి ప్రజలను ఆకర్షిస్తున్నారు. నేటి సమాజానికి అవసరమైన వస్తువుల జాబితాలో చేరిన డ్రోన్ ఆకారం మందుగుండు సామగ్రి బాణాసంచా దుకాణాల్లో కనిపిస్తుంది. డ్రోన్ ఆకారంలో పైకి ఎగురుతూ వెలుగు విరజిమ్మేలా తయారు చేశారు. ఇదే సాంకేతికతనే హెలికాప్టర్ ముందుగుండు సామగ్రికి వాడారు. గృహాల్లోనూ, వ్యాపార సముదాయాల్లో కనిపించే లాఫింగ్ బుద్ధా సైతం టపాకుల అట్టపెట్టెలపైకి ఎక్కాడు. ఈ బాణా సంచా వెలిగించగానే లాఫింగ్ బుద్ధా వలే నవ్వుకుంటూ ఎగిరెగిరి పడుతుందని దుకాణం యజమానులు చెబుతున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన డాలర్ ఆకారంలోనూ బాణాసంచా ఉంది. పాప్‌కార్న్ ఆకారంలో వెలుగులు జిమ్మే పాప్‌కార్న్ క్రాకర్స్, సూర్య వెలుగుల వలే ఉండే సన్‌డ్రాప్ చిచ్చుబుడ్డీలు, స్నాప్ అప్ తారాజువ్వలు, బెంజ్ 5000 వాలా, రెడ్‌ఫోర్ట్ 1000 వాలా, చిన్నారులను ఆశ్చర్యానికి గురి చేసే మ్యాజిక్ గన్స్, ఏమోజీని పోలి ఉండే తారాజువ్వలు, సింహా గన్స్, కార్ ఫైర్ వర్క్స్, క్రేజీ వీల్స్ భూ చక్రాలు, ధూమ్‌ధామ్ చిచ్చుబుడ్డీలు ఈ దీపావళికి సందడి చేయనున్నాయి. ప్రస్తుతం ఉన్న రిటైల్ దుకాణాల్లో వీటిపైనే చిన్నారులు, యువత కళ్లు పడుతున్నాయి.







కృష్ణాతీరంలో వెలుగు జిలుగులు

దీపావళి పండుగలో భాగంగా ఆదివారం సీఎం చంద్రబాబు నగరంలోని పున్నమిఘాట్‌లో దీపావళి వేడుకలను ప్రారంభించారు. ఘాట్‌లో ఏర్పాటుచేసిన మందుగుండును ఆయన రిమోట్ కంట్రోల్ సాయంతో వెలిగించి ప్రారంభించారు. మందుగుండు పేలుళ్లతో పున్నమిఘాట్ రంగులతికించుకుంది. ఘాట్‌లో రంగుల కలబోత, క్రాకర్ల శబ్దంతో విజయవాడ నగరం నిర్మానుష్యాన్ని వీడినట్టు ఒక్కసారిగా నదీతీరాన వెలుగులు విరజిమ్మాయి.

- భవానీపురంలో ఘనంగా దీపావళి వేడుకలు
- కృష్ణమ్మ తీరాన బాణాసంచా
- భారీగా తరలివచ్చిన జనం

విద్యాధరపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవానీపురం పున్నమీఘాట్‌లో దీపావళి వేడుకలను సొసైటీ ఫర్ వైబ్రాంట్ విజయవాడ సంస్థ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు దీపావళి పండుగ విశిష్టతను వివరించారు. మంత్రి కొల్లు రవీంద్ర, సొసైటీ ఫర్ వైబ్రాంట్ సభ్యుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ రావు, వసంత కృష్ణ ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావ్, రాష్ట్ర జీఎస్టీ కమిషనర్ అహ్మద్ బాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జీ లక్ష్మీశ, కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురామ్, కార్పొరేషన్ ఛైర్మన్లు, సొసైటీ ఫర్ వైబ్రాంట్ సభ్యుడు ముత్తవరపు మురళీకృష్ణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు నాగుల్ మీరా, గన్నే ప్రసాద్ (అన్న), టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, పలువురు పార్టీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

దీపావళి వేడుకలను పురస్కరించుకుని కళాకారులు నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నరకాసుర వధ, సాంస్కృతిక సంగీత విభావరి నిర్వహించిన కళాకారులను సీఎం చంద్రబాబు అభినందించారు. కళాకారులు ఆయనతో కలిసి ఫొటో దిగారు.



వేడుకలను ప్రారంభించిన సీఎం

పున్నమీఘాట్‌లో జరిగిన సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం సీఎం చంద్రబాబు దంపతులు అనాథ పిల్లలతో కలిసి బాణాసంచా కాల్చి దీపావళి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వారితో కొద్దిసేపు మాట్లాడారు. వివిధ రంగుల బాణాంసంచా వెలుగులతో పున్నమీఘాట్ ప్రకాశించింది. పెద్ద ఎత్తున జనం తరలి వచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన సెల్‌ఫోన్‌లో పున్నమీఘాట్‌లో బాణాసంచా వెలుగులను చిత్రీకరించారు. కొందరు బాణాసంచా కాంతులను సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. మరికొందరు సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. జనం పెద్ద ఎత్తున తరలి రావటంతో పున్నమీఘాట్‌లో పండుగ వాతావరణం కనిపించింది. ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ పర్యవేక్షణలో పోలీసు అధికారులు ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తగా భద్రతా చర్యలు చేపట్టారు.

స్టాల్స్‌కు అందిన అభినందన అవార్డులు

విజయవాడ కల్చరల్: దీపావళి ప్రారంభ కార్యక్రమంలో విజయవాడ ఉత్సవ్‌లో నిర్వహించిన స్టాల్స్‌కు మూడు విభాగాల్లో సీఎం చంద్రబాబు చేతులు మీదుగా ఆదివారం అవార్డులు ఇచ్చారు. బెస్ట్ స్పాన్సర్ అవార్డు స్టాల్ నెం-35 (రామ్‌కో సిమెంట్స్, శ్రీనివాస వర్మ), మోస్ట్‌సేల్స్ చేసిన స్టాల్‌గా స్టాల్ నెం.46 (రమాక్లాత్ స్టోర్, రాము), పాపులర్ స్టాల్‌గా స్టాల్ నెం-50 (వాక్య స్టాల్, చాణిక్య) విభాగాల్లో అవార్డులు పొందారు.





మహాలక్ష్మీయాగం నిర్వహిస్తున్న ఈవో శీనానాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు

దుర్గగుడిలో ఘనంగా మహాలక్ష్మీయాగం

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ ధనత్రయోదశిని పురస్కరించుకుని ఆదివారం దుర్గగుడిలో ప్రత్యేక ఆధ్యాత్మిక శోభతో మహాలక్ష్మీయాగం నిర్వహించారు. స్థానాచార్యుడు విష్ణుబొట్ల శివప్రసాద శర్మ, వైదిక కమిటీ సభ్యులు, అర్చకులు, వేదపండితులు వేదోక్త, శాస్త్రోక్త విధానంగా మంత్రానుష్టానపరంగా మహాలక్ష్మీదేవికి అర్చనలు చేశారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, ఈవో వీకే శీనానాయక్ దంపతులు పాల్గొన్నారు. మహాలక్ష్మీదేవికి, పూలు, పండ్లు, సుగంధ పరిమళ ద్రవ్యాలను సమర్పించారు. అమ్మవారికి మహాప్రీతికరమైన ఎర్రకలువపూలు, చామంతులతో అర్చనలు చేశారు. లోకోపకారం, సకలజన శ్రేయస్సు కోరుతూ ఇష్టకామ్యసిద్ధి కలగాలని చెబుతూ ఈతిబాధలు లేకుండా కాపాడాలని కోరుతూ మహాలక్ష్మీ యాగంలో వేదోక్తంగా శాస్త్రసమ్మతంగా సమిధలు, పూలు సమర్పించారు. యాగ సమాప్తికి సూచనగా పూర్ణాహుతి నిర్వహించారు. సిబ్బంది, అధికారులు, భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రధాన ఆలయం వెలుపల కుడ్యాలలోని అష్టలక్ష్మీలకు అలంకారం, అర్చన చేశారు. ధనత్రయోదశినాడు మహాలక్ష్మీదేవిని కొలవటం సంప్రదాయంగా వస్తోంది.

భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. కొందరు భక్తులు మొక్కుబడుల మేరకు అమ్మవారికి తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. అక్కడి క్యూలైన్లలో చేరి అమ్మవారి కరుణ కోరుతూ ఆర్తితో దుర్గమ్మను దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు పొంగళ్లు సమర్పించారు. వివిధ ఆర్జిత సేవల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం శీఘ్రంగా జరిగేందుకు ఈవో శీనానాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, అధికారులు, సిబ్బంది ముందస్తు ప్రణాళిక ప్రకారం క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని తాగునీరు, ఉచిత ప్రసాదం, అన్నప్రసాదం సత్వరం అందేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.







తిరువూరు తిరుగుబాటు

- ఎమ్మెల్యే కొలికలపూడి సంచలన వ్యాఖ్యలు
- ఎంపీ చిన్ని లక్ష్యంగా విమర్శలు
- డబ్బులకు పదవులు అమ్ముకుంటున్నారని ఆరోపణ

ఆంధ్రజ్యోతి - విజయవాడ: తిరువూరు ఎమ్మెల్యే మరోసారి వివాదానికి తెర తీశారు. ఈసారి ఎంపీ కేశినేని చిన్నితోపాటు, ఆయన కార్యాలయాన్ని టార్గెట్ చేశారు. నియోజకవర్గంలో గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలోని పార్టీ పదవులన్నీ ఎంపీ కార్యాలయంలోనే డబ్బులు తీసుకుని ఎంపిక చేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఇసుక, మైనింగ్, రేషన్ మాఫియాను నడిపేది ఎంపీ కార్యాలయంలోని సిబ్బందేనని, వీటన్నింటిపై ఈనెల 24న టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి ఫిర్యాదు చేయబోతున్నట్టు ప్రకటించారు. మరోసారి తన వ్యాఖ్యలతో కొలికపూడి టీడీపీలో కొత్త దుమారాన్ని రేపడం సర్వత్రా చర్చనీయాశంగా మారింది. ఇప్పటికే అనేకసార్లు పార్టీలో అంతర్గత విభేదాలపై నోరు పారేసుకోవడంతో పాటు, తరచూ పార్టీ నేతలపైనే విమర్శలు చేయడంతో నియోజకవర్గంలో విభేదాలు రచ్చకెక్కాయి. దీనిపై అధిష్టానం జోక్యం చేసుకుని కొలికపూడితోపాటు, ఆయన వ్యతిరేక వర్గాన్ని పిలిపించి మాట్లాడి వివాదం సద్దుమణిగేలా చర్యలు తీసుకుంది. పలుమార్లు టీడీపీ క్రమశిక్షణ కమిటీ ముందు కొలకపూడి హాజరై నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై వివరణ ఇచ్చుకున్నారు. కొంత కాలంగా సైలెంట్‌గా తన పని తాను చేసుకుంటూ ముందుకు వెళుతున్న కొలికపూడి తాజాగా ఎంపీని లక్ష్యంగా చేసుకుని సంచలన వ్యాఖ్యలు చేశారు. శివనాథ్‌తో పాటు, ఆయన కార్యాలయ సిబ్బంది తన నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలకు తెర తీశారని, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో రెండు వర్గాలుగా ఏర్పడేందుకు కారణమయ్యాయని ఆరోపించారు. పార్టీలో పనిచేసే వారికి పదవులివ్వకుండా ఎంపీ కార్యాలయంలో డబ్బులు తీసుకుని పార్టీ పదవులు జాబితా సిద్ధం చేసుకుని, వారికే పదవులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. శనివారం రాత్రి తిరువూరు మండలం జీ కొత్తూరు గ్రామంలో ఎమ్మెల్యే కొలికపూడి పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ ఎంపీ కేశినేని శివనాథ్‌పై చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా దుమారాన్ని రేపాయి. పార్టీలో పనిచేసిన వారికి పదవులు ఇవ్వకుండా ఎంపీ కార్యాలయంలో పార్టీ పదవుల జాబితా తయారు చేశారని, తిరువూరు పట్టణం, గ్రామాల్లో రేషన్, గ్రావెల్, ఇసుక మాఫియా నడిపేది ఎంపీ కార్యాలయంలో పని చేసేవారేనని ఆరోపించారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పార్టీలో రెండు గ్రూపులు ఏర్పాటు చేశారని, విభజించి. విభేదాలు సృష్టించడంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఆయన కార్యాలయ సిబ్బంది పాత్ర ఉందని కొలికపూడి దుమ్మెత్తిపోశారు. గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలను ఎవరు రెచ్చకొట్టినా రెచ్చిపోవద్దని, ఈనెల 24న రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి అన్ని విషయాలు చెబుదామన్నారు.



గీతా సహస్రకు ఎమ్మెల్యే పరామర్శ

పెనుగంచిప్రోలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక డౌన్ సెంటర్‌కు చెందిన చిట్టిమల్ల గోపి సమతల 10 నెలల చిన్నారి గీతా సహస్ర రెండు రోజులుగా వైరల్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతోంది. రెండు కాళ్లపై బొబ్బలు మాదిరిగా రావడంతో ఆదివారం ఉదయం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుచున్న చిన్నారి గీతా సహస్రను ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ టీడీపీ మండలాధ్యక్షుడు చింతల వెంకట సీతారామయ్యతో కలిసి పరామర్శించారు. చిన్నారికి అందుతున్న వైద్య సేవలను అక్కడి వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అయితే గీతా సహస్రకు వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల ఇలా వచ్చిందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతుందని శ్రీరామ్ రాజగోపాల్‌కు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. టీడీపీ ప్రముఖులు జిల్లేపల్లి సుధీర్ బాబు, లగడపాటి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరం పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

గ్రామంలోని చిన్నారి చిట్టిమల్ల గీతా సహస్రకు వైరల్ ఇన్ఫెక్షన్ రావడంతో జిల్లా కలెక్టర్ స్పదించి వైద్యాధికారులను తక్షణమే గ్రా మంలో వైద్య శిబిరం నిర్వహించి పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో డీఎంహెచ్‌వో డాక్టర్ సు హాసిని ఆదివారం ఉదయం పెనుగంచిప్రోలు చేరుకున్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక శానిటేషన్ నిర్వహించారు. రామాలయం వద్ద పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగరాణి ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరా న్ని నిర్వహించారు. గ్రామంలో రక్త నామునాలను సేకరించారు. 16వ వార్డులో వార్డు సభ్యు డు టీడీపీ యువ నేత లగడపాటి ప్రవీణ్ ఈ కార్యక్రమాలను దగ్గరుండి పర్యవేక్షించారు.

మల్లగుల్లాలు!

(5వ పేజీ తరువాయి)

ఆ సంస్థ లైన్‌ను తొలగించుకునిపోతే.. రూ.10 కోట్లు బూడిదలో పోసిన పన్నీరు చందాన అవుతుందని మోర్తు భావిస్తున్నట్టు తెలుస్తోంది. అందుకే మోర్తు ఆచితూచి స్పందిస్తోందని సమాచారం.

అసంపూర్తిగా 'ల్యాంకో ప్రాజెక్టుల' తరలింపు

కొండపల్లి ల్యాంకో ప్రాజెక్టులోని యూనిట్లు, భూమి, లైన్లను కొనుగోలు చేసిన కంపెనీలు ఆర్థిక ఇబ్బందులతో ఉన్న నేపథ్యంలో, వీటి తరలింపు కూడా అసంపూర్తిగా ఉంది. మరికొంత జాప్యం జరిగే పరిస్థితి కూడా కనిపిస్తోంది. దీనికి తోడు అనేక కోర్టు కేసులు కూడా ఉన్నాయి. ఇవన్నీ తేలటానికి మరింత జాప్యం అయ్యే అవకాశం కనిపిస్తోంది. మోర్తు ఆలోచన మంచిదే అయినప్పటికీ.. పైకారణాల వల్ల తన నిర్ణయం ప్రకటించే విషయంలో జాప్యం జరిగే పరిస్థితి నెలకొంది. ఇదే జరిగితే దాదాపుగా 98 శాతంపైగా పనులు పూర్తి చేసుకున్న పశ్చిమ బైపాస్ ప్యాకేజీ -3 పనులు పూర్తి కావటానికి మరికొంత కాలం పట్టే అవకాశం ఉంది.

మూతపడక ముందు చేసుకున్న ఒప్పందంతో తంటాలు!

విజయవాడ వెస్ట్ బైపాస్ వెంబడి ఉన్న కొండపల్లి ల్యాంకో పవర్ లైన్స్ అలైన్‌మెంట్‌ను మార్చేందుకు ఆ పవర్ ప్రాజెక్టు మూతపడక ముందు యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్నారు. కాలక్రమంలో ల్యాంకో పవర్ ప్రాజెక్టు మూతపడింది. అప్పులవాళ్లు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించటంతో.. లిక్విడేటర్ నియామకం జరిగింది. లిక్విడేటర్ నేతృత్వంలో మూడు యూనిట్లుగా విభజించి స్ర్కాప్‌కు విక్రయించారు. మూడు వేర్వేరు కంపెనీలు వీటిని దక్కించుకున్నాయి. రిలయెన్స్ కంపెనీ ఒక యూనిట్‌ను దక్కించుకోగా, దానిని అది స్ర్కాప్‌గా తరలించుకుపోయింది. రాధా టీఎంటీ అనే సంస్థ మరో యూనిట్‌తో పాటు, ప్లాంట్ ల్యాండ్‌ను దక్కించుకుంది. స్ర్కాప్‌ను ఇంకా తరలించలేదు. మూడోది మయన్మార్‌కు చెందిన కంపెనీ. ఈ కంపెనీ మూడో యూనిట్, ల్యాంకో లైన్లను కొనుగోలు చేసింది. విజయవాడ బైపాస్ పనులు జరిగి ల్యాంకో లైన్ అలైన్‌మెంట్ మార్చేనాటికి ఆ కంపెనీ మూతపడి పైవన్నీ జరిగాయి. అయినప్పటికీ అలైన్‌మెంట్ మార్పు దిశగా అడుగులు వేయటంతో రైతులు హైకోర్టుకు వెళ్లారు. హైకోర్టు స్టే ఇచ్చింది. దీంతో ఈ వ్యవహారంలో జరిగిన తప్పులు వెలుగులోకి వచ్చాయి. ఒకసారి జరిగిన తప్పును మరోసారి పునరావృత్తం కానీయకూడదని మోర్తు కూడా భావిస్తోంది. ఈ కారణంగానే జాప్యం జరుగుతోందని సమాచారం.

చంద్ర ప్రకాశం

(5వ పేజీ తరువాయి)

నిర్వహించిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్, దీపావళి వేడుకలకు సీఎం చంద్రబాబు సతీసమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విజయవాడలో ఉండేవాళ్లు ప్రపంచంలో బ్రహ్మాండంగా రాణిస్తున్నారు. మీతో పుట్టిన వాళ్లు పేదరికంలో ఉన్నారు. అలాంటి వారిని పీ4 బాధ్యతగా తీసుకోవాలి' అని విజ్ఞప్తి చేశారు. ఘంటసాల పవన్‌కుమార్ బృందం సమర్పించిన నరకాసుర వధ నృత్య రూపకాన్ని ఆసక్తిగా తిలకించారు. ఆ తర్వాత జరిగిన సభలో చంద్రబాబు జీఎస్టీ ప్రయోజనాల గురించి వివరించారు. ఫైర్ క్రాకర్స్ షోను ఆయన రిమోట్ నొక్కి ప్రారంభించారు. అనాథ పిల్లలతో కలిసి బాణసంచా వెలుగులను వీక్షించారు. తన సెల్‌ఫోన్‌తో బాణసంచా వెలుగు జిలుగులను వీడియో తీశారు.

బీసెంట్ రోడ్డులో సందడి చేసిన సీఎం

సీఎం చంద్రబాబు తన కాన్వాయ్‌పై బీసెంట్ రోడ్డులోకి వచ్చారు. కాన్వాయ్ దిగిన ఆయన నడుచుకుంటూ ముందుకు సాగారు. రోడ్డుకు రెండు వైపులా దుకాణాలలో షాపింగ్ చేస్తున్నవారు హర్షధ్వానాలు చేశారు. చంద్రబాబు అందరికీ అభివాదం చేస్తూ వీధి వ్యాపారుల దగ్గరకు వెళ్లారు. పలువురిని పలకరించి వారి వ్యాపారాల గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న పలు దుకాణాలకు కూడా చంద్రబాబు వెళ్లి ఎస్టీ ప్రయోజనాల గురించి ఆరా తీశారు. షాపింగ్‌కు వచ్చిన వారు చంద్రబాబుతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. షాపింగ్‌కు వచ్చిన యువతులతో చంద్రబాబు మాట్లాడారు. పిల్లల్ని ఎత్తుకున్నారు. మట్టి దీపాల ప్రమిదలను పరిశీలించారు.

రాష్ట్రంలో ప్రతి రోజూ పండుగే: కేశినేని శివనాథ్

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్ సభలో పాల్గొన్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం సమతుల్యంగా తీసుకువెళ్లే ముఖ్యమంత్రి ఉండటం వల్ల రాష్ట్రంలో ప్రతి రోజూ పండగగా ఉందన్నారు. ముఖ్యమంత్రి సహకారం, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో విశాఖకు గూగుల్ రావటంతో వారం రోజుల ముందుగానే రాష్ట్రానికి దీపావళి వచ్చిందన్నారు. అత్యంత రద్దీగా ఉండే బీసెంటు రోడ్డులో జీఎస్టీ వ్యాపారులను పలకరించటం ఆనందంగా ఉందన్నారు. ఏపీలో వచ్చే మూడేళ్లలో 20 లక్షల ఉద్యోగాలను స్థానిక యువతకు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, గద్దె రామమోహన్, వసంత కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాన బీభత్సం

(5వ పేజీ తరువాయి)

గురునానక్ కాలనీ, ఆటోనగర్, పటమటలంక ప్రాంతాలు జలమయం అయ్యాయి. బెంజిసర్కిల్ నుంచి పటమట హై స్కూల్ రోడ్డు వరకు బందరు రోడ్డుపై వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. రామవరప్పాడు రింగ్ నుంచి ఏలూరు రోడ్డుపై విద్యుత్ సౌత వరకు రోడ్డు కాల్వను తలపించింది. ప్రధాన రహదారులన్నీ పూర్తిగా జలమయం కావడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నార్త్ మండలంలో 97.8 మిల్లీమీటర్లు, సెంట్రల్‌లో 97.2 మిల్లీమీటర్లు, వెస్ట్ మండలంలో 97.2 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. ఏలూరు రోడ్డు, ఎంజీ రోడ్డు సైతం నీటితో నిండిపోయాయి. సింగ్‌నగర్‌లోని పలు అంతర్గత రోడ్లు మధ్యాహ్నం వరకు నీటిలోనే మునిగాయి. విద్యాధరపురం, ఆటోనగర్ బస్ స్టాప్ కార్యాలయాల్లోకి వర్షపు నీరు చేరింది. కుండపోతగా వర్షం పడటంతో డ్రెయినేజీలు స్తంభించిపోయాయి. రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని కార్పొరేషన్ అధికారులు ట్యాంకర్‌ల సాయంతో తరలించారు.

మైలవరం, తిరువూరు నియోజకవర్గాల పరిధిలో భారీ వర్షం కురిసింది. జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కొండపల్లిలో బాణాసంచా విక్రయాల షాపుల వద్ద భారీ ఎత్తున వర్షం నీరు నిలవడంతో నీటిని మోటార్ల సాయంతో వ్యాపారులు బయటకు పంపారు. ఆదివారం రాత్రి వర్షం పడితే వ్యాపారాలు సాగే అవకాశం లేదని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

పత్తి పంటకు తీవ్ర నష్టం

పత్తి తీతలు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో కురిసిన భారీ వర్షంతో పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే పలుమార్లు కురిసిన వర్షాల వల్ల చెట్లకు పగిలిన పత్తి పచ్చి పింజలు నేల రాలిపోయి నష్టపోయామంటున్నారు. ఈ వర్షంతో పత్తి నాని పోయి చెట్ల మీద ఉన్న కాయల్లోనే మొలకలు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తస్మాత్ జాగ్రత్త



బాణసంచా ప్రమాదకరం

బాణాసంచా ఎంతటి వినోదాన్ని అందిస్తుందో, అప్రమత్తంగా ఉండకపోతే అంతే హానికరం అవుతుంది. మరీ ముఖ్యంగా వాటి నుంచి వెలువడే పొగల్లో విషపూరిత రసాయనాలుంటాయి కాబట్టి వీటిని కాల్చేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే...

టపాసుల తయారీలో సల్ఫర్ (గంధకం), కార్బన్ వాడతారు. వీటి వల్లే టపాసులు పెద్ద పెద్ద వెలుగులను వెదజల్లుతాయి. అలాగే బాణాసంచా తయారీలో ఆర్సెనిక్, మాంగనీస్, సోడియం ఆక్సలేట్, అల్యూమినియం, ఐరన్ డస్ట్ పౌడర్, పొటాషియం, బేరియం నైట్రేట్ మొదలైన ఎన్నో రసాయనాలను వాడడం వల్ల టపాసులు కాల్చినప్పుడు దట్టమైన పొగలు అలముకుంటాయి. ఈ పొగల్లో సల్ఫర్ డయాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్...మొదలైన విష వాయువులు ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి హానికరం కాబట్టి ఇవిగో ఇలాంటి రక్షణ చర్యలు పాటించాలి.

- ముక్కుకీ, నోటికీ కాటన్ స్కార్ఫ్ చుట్టుకోవాలి.
- రంగుల పొగలు వెదజల్లే టపాసులు మరింత ప్రమాదకరమైనవి. వాటిని కాల్చకపోవటమే మంచిది.
- చైనా తయారీ టపాసులు కార్బన్ మోనాక్సైడ్ లాంటి విషవాయువులను విడుదల చేస్తాయి. వాటికి బదులుగా దేశీయ టపాసులనే ఎంచుకోవాలి
- తక్కువ పొగ వెదజల్లే టపాసులకు పరిమితమవటం మేలు
- టపాసులు కాలేటప్పుడు వాటి మీదకు వంగి చూడకూడదు
- మూసి ఉన్న ప్రదేశాల్లో కాకుండా వాకిట్లో లేదా మేడ పైన, ఆట స్థలాల్లో టపాసులు కాల్చటం ఉత్తమం
- ఇంట్లోకి పొగ వెళ్లకుండా తలుపులు మూసి ఉంచాలి
- టపాసులు కాల్చిన మరునాడు ఉదయాన్నే వాకింగ్ చేయటం మానుకోవాలి. ఆ సమయంలో వాతావరణంలో కాలుష్యాల పరిమాణం ఎక్కువగా ఉంటుంది
- ఎక్కువ పొగను వెదజల్లే చిచ్చుబుడ్లు, మతాబులు, భూచక్రాలు లాంటి టపాసులను కాల్చకపోవడమే ఉత్తమం
- మరీ ముఖ్యంగా ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలున్నవాళ్లు టపాసులకు దూరంగా ఉండాలి
- అపార్ట్‌మెంట్లలో ఉండేవాళ్లు బాల్కనీల్లో కాకుండా కిందకి దిగి వచ్చి, అపార్ట్‌మెంట్ ఆవరణలో టపాసులు పేల్చాలి.

పండక్కి కొత్తగా...



దీపావళి పండుగ రోజున పూజ సామాగ్రి కొత్తగా తళతళలాడాలని మహిళలంతా ఆరాటపడుతూ ఉంటారు. ముఖ్యంగా దీపపు కుందులు, మట్టి ప్రమిదల విషయంలో అస్సలు రాజీ పడరు. ఎక్కువగా శ్రమపడకుండా చిటికెలో వాటిని మెరిపించే చిట్కాలు ఇవిగో...



వెండి కుందుల కోసం...

- వెండి కుందుల మీద తెల్లని టూత్‌పేస్ట్ రాసి లేదా టూత్‌పౌడర్ చల్లి పది నిమిషాలు అలాగే ఉంచాలి. ఆపైన చేతి రుమాలుతో గట్టిగా తుడిచేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. మెత్తటి స్క్రబ్బర్ మీద టమాటా కెచప్ వేసి దానితో మెల్లగా తోమినా వెండి కుందులు మెరిసిపోతాయి.
- వెడల్పాటి గిన్నెలో ఒక గ్లాసు వేడినీళ్లు పోసి, అందులో నాలుగు చెంచాల వెనిగర్, రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి బాగా కలపాలి. అందులో వెండి కుందులు ఉంచి అరగంటసేపు నాననివ్వాలి. తరువాత లిక్విడ్ డిటర్జెంట్‌తో రుద్ది కడిగితే జిడ్డు, మురికి తొలగిపోయి వెండి దీపాలు కొత్తవాటిలా మారతాయి.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల డిటర్జెంట్ పౌడర్ వేసి నీళ్లు చిలకరిస్తూ పేస్టులా చేయాలి. ఈ పేస్టుని వెండి కుందులకు పట్టించాలి. పావుగంట తరువాత పాత టూత్‌బ్రష్‌తో తోమి మంచినీళ్లతో కడిగితే సరిపోతుంది.

ఇత్తడి కుందుల కోసం...

- చిన్న గిన్నెలో నాలుగైదు చింతపండు రెమ్మలను తీసుకుని వాటిమీద కొద్దిగా నీళ్లు చిలకరించి అయిదు నిమిషాలు ఉంచితే అవి మెత్తపడతాయి. వాటితో తోమితే ఇత్తడి కుందులు బంగారంలా మెరుస్తాయి. కుందులు జిడ్డుగా అనిపిస్తే వాటిమీద కొద్దిగా డిటర్జెంట్ పౌడర్ చల్లి చేత్తో రుద్ది కడిగితే సమస్య తీరుతుంది.
- వాడేసిన నిమ్మచెక్కతో కొద్దిగా ఉప్పు అద్ది తోమినా ఇత్తడి కుందులు కొత్తవాటిలా మెరుస్తాయి.




మట్టి ప్రమిదల కోసం...

- వెడల్పాటి గిన్నెలో సగానికిపైగా నీళ్లు పోయాలి. అందులో నాలుగు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల రాళ్ల ఉప్పు, ఒక చెంచా డిష్ వాషింగ్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. తరువాత ఈ నీళ్లలో మట్టి ప్రమిదలను ఉంచి అరగంటసేపు నాననివ్వాలి. ఆపైన స్క్రబ్బర్‌తో రుద్ది కడిగితే జిడ్డు, మరకలు వదిలిపోయి ప్రమిదలు కొత్తగా కనిపిస్తాయి.
- చిన్న గిన్నెలో నాలుగు చెంచాల డిటర్జెంట్ పౌడర్, ఒక చెంచా వెనిగర్ వేసి బాగా కలిపి పేస్టులా చేయాలి. ఈ మిశ్రమాన్ని ప్రమిదలకు పట్టించి అరగంట తరువాత బ్రష్‌తో రుద్ది కడిగితే మంచి ఫలితం కనిపిస్తుంది.

ప్రమిదలు తయారుచేద్దాం రండి



దీపావళి పండుగ వస్తుందనగానే మహిళలంతా ప్రమిదలమీదే ఎక్కువగా దృష్టి పెడుతుంటారు. పూజ కోసం మట్టి ప్రమిదలను, ఇంటి అలంకరణకు రకరకాల దివ్వెలను కొనుగోలు చేస్తుంటారు. ప్రమిదలను కొని తెచ్చుకునేకన్నా, పిల్లలతో కలిసి స్వయంగా తయారు చేసుకుంటే ఆ ఆనందం రెట్టింపవుతుంది. మరి ఇంకెందుకు ఆలస్యం! ఇంట్లోనే ప్రమిదలను తయారుచేద్దాం రండి..!





ఏం కావాలంటే...

- గోధుమ పిండి- అర కప్పు, నీళ్లు- తగినన్ని, నూనె- పావు కప్పు, ఒత్తులు- మూడు, జిగురు- ఒక బాటిల్, పెయింటింగ్ బ్రష్, చిన్న అద్దాలు, పూసలు, మెరిసే రాళ్లు, రంగులు- ఎరుపు, పసుపు, ఆకుపచ్చ

ఇలా తయారుచేయాలి...

- వెడల్పాటి గిన్నెలో గోధుమ పిండిని తీసుకుని నీళ్లు చిలకరిస్తూ చపాతీ పిండిలా గట్టిగా కలపాలి. ఆపైన మూతపెట్టి పావుగంటసేపు నాననివ్వాలి. తరువాత కొద్దికొద్దిగా పిండిని తీసుకుంటూ చిన్న ఉండల్లా చేయాలి. ఒక్కో ఉండ మధ్యలో బొటనవేలితో నొక్కి, చేత్తో ప్రమిద ఆకారం వచ్చేలా చేయాలి. ప్రమిదకు ఒక వైపున ఒత్తి వేయడానికి వీలుగా నొక్కు పెట్టాలి.
- ఇలా తయారుచేసుకున్న ప్రమిదలను బేకింగ్ ట్రేలో అమర్చాలి. ఓవెన్‌ను 200 డిగ్రీల వద్ద ప్రీ హీట్ చేయాలి. తరువాత అందులో ప్రమిదల ట్రే పెట్టి పావుగంటసేపు బేక్ చేసి బయటికి తీయాలి.
- ప్రమిదలు పూర్తిగా చల్లారిన తరువాత వాటికి బ్రష్ సహాయంతో రంగులు వేసి ఆరబెట్టాలి.
- ఎరుపు రంగు వేసిన ప్రమిదలపై తెల్లగా మెరిసే రాళ్లు, పసుపు రంగు పూసలు అంటించాలి. పసుపు రంగు వేసిన ప్రమిదలపై ఆకుపచ్చని రంగుతో పూల కొమ్మల డిజైన్ వేసి ఎర్రటి రాళ్లు అంటించాలి. ఆకుపచ్చ రంగు వేసిన ప్రమిదలపై పసుపు రంగుతో మామిడి పిందెల డిజైన్ వేసి తెల్లటి రాళ్లు అంటిస్తే బాగుంటుంది.
- రంగు రంగుల ప్రమిదల్లో నూనె పోసి ఒత్తులు వేసి వెలిగించి ఇల్లంతా అలంకరిస్తే శోభాయమానంగా కనిపిస్తుంది.

అడవికి ఆత్మబంధువు

నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన ఆమె చదువు కోసం ఎన్నో కష్టాలు పడ్డారు. అభ్యంతరాలను, అవహేళనలను తట్టుకున్నారు. చెల్లెళ్లను ప్రయోజకుల్ని చేశారు. అటవీశాఖ అధికారిగా నల్లమల ప్రాంతంలో అక్రమార్కులకు సింహస్వప్నమైన భాగ్యమ్మ... "వన్యప్రాణులు, వృక్షాల సంరక్షణ కేవలం వృత్తికాదు... నా ఆరో ప్రాణం" అని చెబుతున్నారు.

అడవితో భాగ్యమ్మ అనుబంధం బాల్యంలోనే మొదలయింది. ఆమెది మహబూబ్‌నగర్ జిల్లాలోని కొండ్రావుపల్లి గ్రామానికి చెందిన దళిత కుటుంబం. భాగ్యమ్మ తండ్రి నరసింహ అటవీ ప్రాంతంలో మొక్కలు నాటించే పని చేసేవారు. తమ పెద్ద కుమార్తె భాగ్యమ్మను, మరో ముగ్గురు కుమార్తెలను బాగా చదివించాలని తల్లిదండ్రులు భావించారు. కానీ ఆడపిల్లలు ఉన్నత విద్యావంతులైతే సంబంధాలు రావడం కష్టం అని తోటి కులస్తులు అభ్యంతరపెడితే, వీరికి పెద్ద చదువులెందుకని గ్రామస్తులు అవహేళన చేశారు. అయినా భాగ్యమ్మ పట్టుదలతో చదివేవారు.



అయితే తండ్రి మరణించడంతో... భాగ్యమ్మపైన, ఆమె తల్లి వెంకటమ్మపైన కుటుంబ బాధ్యతలు పడ్డాయి. వెంకటమ్మ కూలీ నాలీ చేసి పిల్లల్ని పోషించేవారు. "ఆ సమయంలో... కొండారెడ్డిపల్లి పాఠశాలలో టీచర్‌గా పని చేసిన గోపాల్ రెడ్డి నాకు మనోస్థైర్యాన్ని కల్పించారు. నేను ప్రయోజకురాలిని కావాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆశించారు" అని చెప్పారు భాగ్యమ్మ. ఆమె స్వగ్రామంలో పదో తరగతి, మహబూబ్‌నగర్‌లో ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీఈడీ చదివారు. రాజేంద్రనగర్‌లో అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేశారు. తనకు ఇష్టమైన నల్లమల ప్రాంతంలోనే ఉద్యోగం చేయాలనేది ఆమె కోరిక. ఆ క్రమంలో... 2008లో అచ్చెంపేట ఫారెస్ట్ డివిజన్‌లో బీట్ ఆఫీసర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు.

భయపడేది లేదు...

"నేను పుట్టిన కొండ్రావుపల్లి గ్రామం... కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ప్రారంభం కాకముందు గుక్కెడు నీళ్లకు అలమటించిన ప్రాంతం. నిరుపేదలైన మా తల్లిదండ్రులు ఎన్నో కష్టాలుపడ్డారు. మేం నలుగురం ఆడపిల్లలం. నాన్న మరణించడం, ఎవరినుంచీ సహాయం లభించకపోవడం మాలో కసిని పెంచింది. 'ఆడపిల్లలు ఏం చెయ్యగలుగుతారు?' అని ప్రశ్నించినవారికి మా గెలుపుతో సమాధానం ఇవ్వాలనుకున్నాను" అని చెప్పారు భాగ్యమ్మ. తల్లి సహకారంతో తన చెల్లెళ్లను ఆమె ప్రయోజకుల్ని చేశారు. ఒక సోదరి పార్వతి మూసాపేట మండలంలో పంచాయతీ కార్యదర్శిగా, మరో సోదరి నాగర్‌కర్నూల్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఇంకో సోదరి పద్మ పాలిటెక్నిక్ చేస్తోంది. జీవితంలో ఎదురైన సమస్యలను ఆత్మస్థైర్యంతో అధిగమించిన భాగ్యమ్మ... నల్లమల అటవీ ప్రాంతాన్ని, అందులో ఉన్న చెట్లను, వన్యప్రాణులను సంరక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. కొన్నేళ్ల క్రితం సెక్షన్ అధికారిగా పదోన్నతి పొందిన ఆమె... 74 హెక్టార్ల అటవీ ప్రాంతాన్ని ఆక్రమణల చెర విడిపించి, చెట్లు నాటించారు. మాచారం ప్రాంతంలో... వన్యప్రాణులకోసం 90 హెక్టార్లలో ఫల వృక్షాల పెంపకానికి కృషి చేశారు. రంగాపురం నుంచి రుసుల్‌చెరువు వరకు... 30కిలో మీటర్ల రహదారి నిర్మాణానికి ఎదురైన అవాంతరాలను అధిగమించడంలో కీలకపాత్ర పోషించారు. వన్యప్రాణులను చంపినవారి మీద 20కి పైగా కేసులు నమోదు చేశారు. ఆమె నల్లమలలో ఉంటే తమ ఆటలు సాగవనే ఆలోచనతో... కొందరు అనేక అవాంతరాలు కలిగించారు. డిప్యుటేషన్ల పేరిట ఇబ్బందులు పెట్టారు. "అలాంటి వాటికి నేను భయపడను. చెట్లకు, జంతువులకు హాని కలిగించేవారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తాను. ఎందుకంటే అవి నా ఆత్మబంధువులు" అంటున్నారు భాగ్యమ్మ



- మహమ్మద్ అబ్దుల్లాఖాన్

వర్షంలో తడుస్తున్నారా

ఒక్కోసారి అనుకోకుండా వర్షంలో తడుస్తూ ఉంటాం. కానీ కొంతమంది మాత్రం ఇష్టంగా వర్షంలో తడుస్తూ ఆనందిస్తుంటారు. ఇలా వర్షంలో తడవడం ఆరోగ్యానికి అంత మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- వర్షపు నీరు శుభ్రంగా ఉండదు. అందులో దుమ్ము, హానికారక బ్యాక్టీరియాలు, రసాయనాలు కలిసే అవకాశం ఉంటుంది. ఇలాంటి వర్షపు నీటిలో తడవడం వల్ల చర్మం మీద అలెర్జీ, దురద, దద్దుర్లు లాంటివి రావచ్చు. కుదుళ్లు బలహీనమై శిరోజాలు రాలిపోవచ్చు. సున్నితమైన చర్మం ఉన్నవారు వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎక్కువసేపు వర్షంలో తడిస్తే.. కళ్లు ఎర్రబడడం, మండడం, వాయడం, దురద, గరగరలాడడం, నీళ్లు కారడం లాంటి సమస్యలు ఏర్పడవచ్చు.
- వర్షంలో తడుస్తున్నప్పుడు శరీర ఉష్ణోగ్రత క్రమంగా తగ్గుతూ ఉంటుంది. దీంతో జలుబు, దగ్గు, జ్వరం, తలనొప్పి లాంటివి రావడమే కాకుండా శ్వాసకోశ సమస్యలు తలెత్తవచ్చు. మిరియాల పొడి కలిపిన వేడి పాలు లేదా ఏదైనా సూప్ తాగితే శరీర ఉష్ణోగ్రత క్రమబద్ధమవుతుంది. వీలైనంతవరకూ వృద్ధులు, చిన్నపిల్లలు వర్షంలో తడవకపోవడమే మంచిది.
- వర్షంలో తడిసినప్పుడు ఎక్కువసేపు తడి దుస్తులతో ఉంటే శరీరంపై హానికారక బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీంతో చర్మ వ్యాధులు, శరీరం నుంచి దుర్వాసన లాంటి సమస్యలు రావచ్చు. ఇంటికి రాగానే గోరువెచ్చని నీటితో తలస్నానం చేసి పొడి దుస్తులు ధరించాలి. శిరోజాలను పలుచని తువాలు సహాయంతో తడి లేకుండా తుడుచుకోవాలి. లేదంటే తలలో చుండ్రు ఏర్పడుతుంది.
- ఆర్థ్రైటిస్, మోకాళ్ల నొప్పులు, అరికాలి మంటలు ఉన్నవాళ్లు వర్షంలో తడిస్తే సమస్యలు మరింత పెరుగుతాయి. కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.



అదనపు కొవ్వు తగ్గేదెలా?

మహిళలు సాధారణంగా పొత్తి కడుపు, చేతులు, తుంటి భాగాల్లో చేరే అదనపు కొవ్వుతో ఇబ్బంది పడుతూ ఉంటారు. హార్మోన్ల అసమతౌల్యం, పరిమితికి మించి బరువు పెరగడమే దీనికి ప్రధాన కారణాలని నిపుణులు చెబుతున్నారు. ఆహార నియమాలు పాటిస్తూ, వర్కవుట్స్ చేస్తూ, చిన్న చిట్కాలతో అదనపు కొవ్వును ఎలా కరిగించుకోవాలో తెలుసుకుందాం...

- రాత్రిపూట సరిగా నిద్రపోకపోవడం వల్ల పొత్తికడుపు భాగంలో కొవ్వు పేరుకుంటుంది. రోజుకు కనీసం ఎనిమిది గంటలపాటు హాయిగా పడుకుంటే ఒత్తిడి తగ్గి సమస్య తీరుతుంది. స్వీట్లు, కూల్‌డ్రింక్స్ ఎక్కువగా తీసుకోకూడదు. తాజా పండ్లు, పెరుగు, డ్రై ఫ్రూట్స్‌ను ఆహారంలో చేర్చుకోవాలి. దీంతోపాటు రోజూ పదివేల అడుగులు వేస్తూ ఉంటే మంచి ఫలితం కనిపిస్తుంది.
- నూనె పదార్థాలు, జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం వల్ల భుజాలు, చేతుల్లో విపరీతంగా కొవ్వు చేరుతుంది. కేకులు, పేస్ట్రీలు, ప్రాసెస్ చేసిన పదార్థాలను తినడం పూర్తిగా మానేస్తే చేతుల్లోని కొవ్వు కరిగిపోతుంది. ప్రొటీన్, ఫైబర్ అధికంగా ఉండే ఆహారపదార్థాలు తీసుకోవాలి. రోజుకు రెండు గుడ్లు తినడం శ్రేయస్కరం. చేతులను తరచూ కదిలిస్తూ ఉండాలి. ఆర్మ్ సర్కిల్స్, షాడో బాక్సింగ్, వాల్ పుషప్స్, బైసెప్ కర్ల్స్ లాంటి తేలికైన వర్కవుట్స్ చేస్తూ ఉంటే అదనపు కొవ్వు కరిగి చేతులు సన్నగా, అందంగా మారతాయి.
- రోజూ రన్నింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్, బ్రిస్క్ వాకింగ్ చేస్తూ ఉంటే తుంటి భాగంలో పేరుకున్న కొవ్వు మాయమవుతుంది. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, తృణధాన్యాలు, అవకాడో, ఆలివ్ ఆయిల్‌ను ఆహారంలో చేర్చుకోవడం మంచిది. మంచినీళ్లు ఎక్కువగా తాగడం, శారీరక శ్రమ, యోగ లేదా ధ్యానం చేయడం అలవాటు చేసుకుంటే సత్వరమైన ఫలితం లభిస్తుంది.



స్విచ్ బోర్డు మురికిగా ఉందా..?



ఇంట్లో ఉండే స్విచ్ బోర్డుల మీద ఎక్కువగా మురికి పేరుకుంటూ ఉంటుంది. ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోతే స్విచ్ బోర్డులు జిడ్డు మరకలతో నిండి అపరిశుభ్రంగా కనిపిస్తూ ఇంటి అందాన్ని తగ్గిస్తుంటాయి. చిన్న చిట్కాలతో స్విచ్ బోర్డులపై ఉండే మురికి, మరకలను ఏ విధంగా తొలగించవచ్చో తెలుసుకుందాం...

- స్విచ్ బోర్డు మీద కొద్దిగా టూత్‌పేస్టును రాసి పాత టూత్‌బ్రష్‌తో గట్టిగా రుద్దాలి. తరువాత పొడిగుడ్డతో తుడిచేస్తే మురికి మొత్తం తొలగిపోయి స్విచ్‌బోర్డు చక్కగా మెరుస్తుంది.
- ముందుగా మెయిన్, స్విచ్‌లను ఆఫ్ చేయాలి. ఒక నిమ్మకాయను తీసుకుని మధ్యకు కోయాలి. ఆ నిమ్మచెక్కతో మెత్తటి ఉప్పును అద్ది దానితో స్విచ్‌బోర్డును మెల్లగా రుద్దాలి. తరువాత స్పాంజ్ లేదా పొడిగుడ్డతో తుడిచేస్తే సరిపోతుంది.
- ఒక గిన్నెలో రెండు చెంచాల వైట్ వెనిగర్, రెండు చెంచాల నీళ్లు పోసి బాగా కలపాలి. ఒక పలుచని చేతిరుమాలును తీసుకుని చిన్నగా మడిచి వెనిగర్ మిశ్రమంలో ముంచాలి. దానితో స్విచ్‌బోర్డును తుడిస్తే మొండి మరకలన్నీ తొలగిపోతాయి.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి నీళ్ల చుక్కలు చిలకరిస్తూ పేస్టులా చేయాలి. ఈ పేస్టును స్విచ్‌బోర్డుల మీద రాసి పది నిమిషాలు ఆరనివ్వాలి. తరువాత స్క్రబ్బర్‌తో రుద్ది పలుచని పొడి గుడ్డతో తుడిచేస్తే మురికి వదిలిపోతుంది.
- చిన్న దూది ఉండను తీసుకుని దానిమీద కొద్దిగా నెయిల్ పాలిష్ రిమూవర్ లేదా షేవింగ్ క్రీమ్‌ను వేయాలి. ఆ దూది ఉండతో స్విచ్‌బోర్డు మీద ఉన్న మరకలపై గట్టిగా రుద్దాలి. తరువాత స్పాంజ్‌తో తుడిచేస్తే స్విచ్‌బోర్డులు చక్కగా మెరుస్తుంటాయి.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల బ్లీచింగ్ పౌడర్, రెండు చెంచాల నిమ్మరసం వేసి పేస్టులా కలపాలి. ఈ పేస్టుని స్విచ్‌బోర్డు మీద రాసి మెత్తని బ్రష్‌తో రుద్దాలి. తరువాత పొడిగుడ్డతో తుడిస్తే చాలు.



తన్వి..రజతంతో సరి

ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్

గువాహటి: తనకంటే మెరుగైన ప్రత్యర్థులను మట్టి కరిపిస్తూ ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సంచలనాలు సృష్టించిన భారత షట్లర్ తన్వీ శర్మ జోరుకు ఫైనల్లో బ్రేక్ పడింది. 'స్వర్ణ' చరిత్ర సృష్టించాలన్న భారత టీనేజర్ కల నెరవేరలేదు. ఆదివారం జరిగిన సింగిల్స్ ఫైనల్స్‌లో 16 ఏళ్ల తన్వి 7-15, 12-15తో అన్యపత్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి చవిచూసింది. దాంతో ఆమె రజత పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే ఈ టోర్నీలో సైనా నెహ్వాల్, అపర్ణా పొపట్ తర్వాత తుదిపోరుకు చేరిన భారత క్రీడాకారిణిగా తన్వి ఇప్పటికే చరిత్ర సృష్టించింది. ఈ చాంపియన్‌షిప్‌లో సైనా 2008లో స్వర్ణం, 2006లో రజతం, అపర్ణా పొపట్ 1996లో రజతం సాధించారు.

పోరాడినా పోయింది!

- స్మృతి, దీప్తి, హర్మన్ శ్రమ వృథా
- 4 పరుగులతో ఓడిన భారత్
- సెమీస్‌కు ఇంగ్లండ్ ● నైట్ శతకం

మహిళల వరల్డ్‌కప్



నేటి మ్యాచ్
శ్రీలంక x బంగ్లాదేశ్
రేపటి మ్యాచ్
దక్షిణాఫ్రికా x పాకిస్తాన్
(మధ్యాహ్నం 3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో)

ఇండోర్: స్టార్ బ్యాటర్లు స్మృతి మంధాన (88), హర్మన్‌ప్రీత్ కౌర్ (70)తోపాటు దీప్తి శర్మ (50, 4/51) ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్నా.. గెలుపు వాకిట భారత మహిళల జట్టుకు నిరాశే ఎదురైంది. వరల్డ్ కప్‌లో ఆదివారం ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో భారత్ 4 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చేతిలో ఓడింది. ఈ గెలుపుతో ఇంగ్లండ్ సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకోగా.. భారత్ వరుసగా మూడో ఓటమిని చవిచూసింది. తొలుత ఇంగ్లండ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 288 పరుగులు చేసింది. హీథర్ నైట్ (109) సెంచరీతో సత్తా చాటగా, అమీ జోన్స్ (56) రాణించింది. శ్రీచరణి 2 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో భారత్ ఓవర్లన్నీ ఆడి 284/6 స్కోరుకే పరిమితమైంది. ఫామ్‌లో లేని జెమీమా రోడ్రిగ్స్ స్థానంలో పేసర్ రేణుక జట్టులోకి వచ్చింది. నైట్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

ఆఖర్లో తడబాటు: ఛేదనలో ఓపెనర్ ప్రతీక రావల్ (6), హర్లీన్ (24) స్వల్ప స్కోరుకే వెనుదిరిగారు. కానీ, మంధాన, కౌర్ మూడో వికెట్‌కు 125 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. 26వ ఓవర్‌లో మంధాన అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. తర్వాతి ఓవర్‌లో హర్మన్ ఫిఫ్టీ సాధించింది. అయితే, దూకుడుగా ఆడుతున్న కౌర్‌ను బ్రంట్ క్యాచవుట్ చేసింది. ఈ దశలో దీప్తి, మంధాన జాగ్రత్తగా ఆడుతూ పరిస్థితి చేయి దాటకుండా చూశారు. కానీ, సెంచరీకి చేరువవుతున్న స్మృతిని స్మిత్ క్యాచ్ అవుట్ చేయడంతో.. నాలుగో వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ధాటిగా ఆడే రిచా (8) వికెట్ పారేసుకొంది. అర్ధ శతకం పూర్తి చేసుకొన్న దీప్తి నిర్లక్ష్యపు షాట్‌తో వికెట్ పారేసుకోవడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. ఆఖరి 6 బంతుల్లో 14 పరుగులు అవసరమవగా.. అమన్‌జోత్ (18 నాటౌట్), స్నేహ్ రాణా (10 నాటౌట్) జట్టును గెలిపించలేకపోయారు.



మెరిసిన టాపార్డర్: నైట్‌తోపాటు టాపార్డర్ బ్యాటర్లు రాణించడంతో ఇంగ్లండ్ సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న ఇంగ్లండ్‌కు ఓపెనర్లు బ్యూమాంట్ (22), జోన్స్ తొలి వికెట్‌కు 73 పరుగుల భాగస్వామ్యంతో శుభారంభాన్ని అందించారు. అయితే, బ్యూమాంట్‌ను బౌల్డ్ చేసిన దీప్తి జట్టుకు బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత వచ్చిన నైట్ ఎడాపెడా షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న జోన్స్‌ను కూడా దీప్తి వెనక్కిపంపినా.. కెప్టెన్ బ్రంట్ (38), నైట్ మూడో వికెట్‌కు 113 పరుగులు జోడించడంతో ఇంగ్లండ్ భారీ స్కోరు దిశగా సాగింది. బ్రంట్‌ను శ్రీచరణి పెవిలియన్ చేర్చగా.. సెంచరీ సాధించిన నైట్ రనౌట్ అయింది. అయితే, డెత్ ఓవర్లలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన దీప్తి, చరణి.. ఇంగ్లండ్ 300 మార్క్‌కు చేరకుండా అడ్డుకొన్నారు.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్: బ్యూమాంట్ (బి) దీప్తి 22, అమీ జోన్స్ (సి) మంధాన (బి) దీప్తి 56, హీదర్ నైట్ (రనౌట్) 109, బ్రంట్ (సి) హర్మన్ (బి) శ్రీచరణి 38, డంక్లీ (సి) దీప్తి (బి) శ్రీచరణి 15, ఎమ్మా లంబ్ (సి) మంధాన (బి) దీప్తి 11, క్యాప్సీ (సి) హర్లీన్ (బి) దీప్తి 2, చార్లీ డీన్ (నాటౌట్) 19, ఎకెల్‌స్టోన్ (రనౌట్) 3, లిన్సే స్మిత్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 50 ఓవర్లలో 288/8; వికెట్ల పతనం:** 1-73, 2-98, 3-211, 4-249, 5-254, 6-257, 7-276, 8-280; **బౌలింగ్:** రేణుక 8-0-37-0, క్రాంతి 8-0-46-0, స్నేహ్ రాణా 10-0-56-0, శ్రీచరణి 10-0-68-2, దీప్తి 10-0-51-4, అమన్‌జోత్ 4-0-26-0.

భారత్: ప్రతీక (సి) జోన్స్ (బి) బెల్ 6, స్మృతీ మంధాన (సి) క్యాప్సీ (బి) స్మిత్ 88, హర్లీన్ (ఎల్బీ) డీన్ 24, హర్మన్‌ప్రీత్ (సి) లంబ్ (బి) బ్రంట్ 70, దీప్తి (సి) డంక్లీ (బి) ఎకెల్‌స్టోన్ 50, రిచా (సి) నైట్ (బి) బ్రంట్ 8, అమన్‌జోత్ (నాటౌట్) 18, స్నేహ్ రాణా (నాటౌట్) 10, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 50 ఓవర్లలో 284/6; వికెట్ల పతనం:** 1-3, 2-42, 3-167, 4-234, 5-256, 6-262; **బౌలింగ్:** బెల్ 9-0-52-1, స్మిత్ 10-0-40-1, బ్రంట్ 8-0-47-2, డీన్ 10-0-67-1, ఎకెల్‌స్టోన్ 10-0-58-1, క్యాప్సీ 3-0-20-0.

ఉత్కంఠ పోరులో టైటాన్స్ అదుర్స్

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ తాజా సీజన్‌లో ఇప్పటికే ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకున్న తెలుగు టైటాన్స్ మరోసారి విజృంభించింది. ఆదివారం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో టైటాన్స్ 30-25తో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. మరో మ్యాచ్‌లో యు ముంబా టైబ్రేకర్‌లో 7-5తో హరియాణా స్టీలర్స్‌పై నెగ్గింది. నిర్ణీత సమయానికి ఇరుజట్లు 37-37తో సమంగా నిలిచాయి.

వాలీబాల్ లీగ్‌లో గోవా అద్భుత విజయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో గోవా గార్డియన్స్ తమ సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో ఢిల్లీ తుఫాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గోవా 14-16, 11-15, 15-11, 16-14, 15-11తో గెలిచింది.



అవును..పెళ్లి చేసుకోబోతున్నాం

ధ్రువీకరించిన పలాష్ ముచ్చల్
మంధానతో లవ్‌లో ఉన్నట్టు వెల్లడి

ఇండోర్: టీమిండియా స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన (29)కు, తనకు నడుమ 'సమ్‌థింగ్..సమ్‌థింగ్' ఊహాగానాలు నిజమేనని బాలీవుడ్ మ్యూజిక్ కంపోజర్, సింగర్ పలాష్ ముచ్చల్ (30) ధ్రువీకరించాడు. తామిద్దరం లవ్‌లో ఉన్నట్టు వెల్లడించాడు. త్వరలో తాము వివాహ బంధంలో అడుగుపెట్టనున్నట్టు కూడా చెప్పాడు. 'మంధాన ఇండోర్ కోడలు కాబోతోంది' అని పలాష్ తెలిపాడు.

ఎవరీ పలాష్..: ఇండోర్‌లోని మార్వాడీ కుటుంబానికి చెందిన పలాష్ ముచ్చల్.. శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందాడు. ప్రముఖ గాయకుడిగా, సంగీత దర్శకుడిగానూ బాలీవుడ్‌లో పేరుపొందాడు. శిల్పా శెట్టి చిత్రం 'డిష్కావ్' చిత్రంతో సంగీత దర్శకుడిగా అరంగేట్రం చేశాడు. 2019 నుంచి పలాష్, స్మృతి డేటింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. వీరిద్దరు కలిసున్న ఫొటోలు పలుమార్లు సోషల్‌మీడియాలో వైరల్ అయినా మంధాన కానీ, ముచ్చల్ కానీ వాటిపై స్పందించలేదు.

సూపర్.. సిరాజ్



తొలి వన్డేలో సిరాజ్ పేసర్‌గానే కాకుండా తనలోనూ అద్భుత ఫీల్డర్ ఉన్నాడని చాటుకున్నాడు. ఆసీస్ ఇన్నింగ్స్ 17వ ఓవర్‌లో రెండో బంతిని రెన్షా లాంగాఫ్ దిశగా భారీ షాట్ ఆడాడు. కచ్చితంగా సిక్సర్‌గా వెళ్తుందనుకున్న ఆ బంతిని అక్కడే ఉన్న సిరాజ్ అమాంతం ఎడమ వైపు గాల్లోకి ఎగిరి పట్టుకుని లోనికి విసిరాడు. దీంతో ఆసీస్‌కు సింగిల్ మాత్రమే వచ్చింది. అయితే ఈ అద్భుత విన్యాసానికి ఆటగాళ్లతో పాటు ప్రేక్షకులు సైతం చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు.

బ్యాట్లెత్తేశారు

తొలి వన్డేలో భారత్‌కు ఆసీస్ ఝలక్

నిరాశపర్చిన రో-కో
రాణించిన మార్ష్







2 మూడు ఫార్మాట్లలోనూ కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌ను ఓడిన రెండో భారత సారథిగా గిల్. కోహ్లీ ముందున్నాడు.



1 ఆసీస్ గడ్డపై 30 వన్డేలు ఆడిన విరాట్ డకౌట్ కావడం ఇదే తొలిసారి.

పెర్త్: ఈ ఏడాది వన్డేల్లో అప్రతిహతంగా సాగుతున్న భారత జోరుకు ఆస్ట్రేలియా చెక్ పెట్టింది. ఆదివారం జరిగిన తొలి వన్డేలో అటు బ్యాటింగ్.. ఇటు బౌలింగ్‌లో విఫలమైన గిల్ సేనపై డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన ఆసీస్ 7 వికెట్ల తేడాతో నెగ్గింది. దీంతో వరుసగా 8 విజయాల తర్వాత భారత్‌కు తొలి ఓటమి ఎదురైంది. అలాగే మూడు వన్డేల ఈ సిరీస్‌లో ఆసీస్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. గురువారం రెండో వన్డే అడిలైడ్‌లో జరుగుతుంది. మరోవైపు సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగిన స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ (8), విరాట్ కోహ్లీ (0)లపై అంచనాలు పెట్టుకున్న అభిమానులకు నిరాశే ఎదురైంది. భారత్ ఇన్నింగ్స్‌లో నాలుగుసార్లు వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను 26 ఓవర్లకు కుదించగా, టీమిండియా 136/9 స్కోరు సాధించింది. రాహుల్ (38), అక్షర్ (31), నితీశ్ (19) మాత్రమే రాణించారు. హాజెల్‌వుడ్, ఓవెన్, కునేమన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. తర్వాత ఆసీస్ లక్ష్యాన్ని 22 ఓవర్లలో 131 పరుగులుగా సవరించారు. ఈ ఛేదనను ఆసీస్ 21.1 ఓవర్లలో 3 వికెట్లకు 131 పరుగులతో పూర్తి చేసింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (46 నాటౌట్), ఫిలిప్ (37), రెన్షా (21 నాటౌట్) సత్తా చాటారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మార్ష్ నిలిచాడు.

మార్ష్ అజేయంగా..: ఓపెనర్ మిచెల్ మార్ష్ కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. ఓపెనర్ హెడ్ (8), షార్ట్ (8) పవర్‌ప్లేలోనే వెనుదిరిగినా.. మార్ష్, ఫిలిప్ భారీషాట్లతో భారత బౌలర్లపై ఆధిపత్యం చూపారు. సిరాజ్, అర్ష్‌దీప్, హర్షిత్ ఓవర్లలో మార్ష్ ఒక్కో సిక్సర్‌తో విరుచుకుపడ్డాడు. 16వ ఓవర్‌లో ఫిలిప్ వెనుదిరిగినా అప్పటికే మూడో వికెట్‌కు 55 రన్స్ జత చేరి మ్యాచ్ ఆసీస్ వైపు నిలిచింది. ఇక ఆ తర్వాత రెన్షా, మార్ష్ మరో వికెట్ కోల్పోకుండా ఆడి 29 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించారు.

పేలవ ఆరంభం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌ను బౌన్సీ పిచ్‌పై పేసర్లు స్టార్క్, హాజెల్‌వుడ్, ఎలిస్ కొత్త బంతితో వణికించారు. ముఖ్యంగా రోహిత్, విరాట్ తమ ఆటతీరుతో ఉసూరుమనిపించారు. కెప్టెన్సీ కూడా లేకపోవడంతో స్వేచ్ఛగా ఆడతాడనుకున్న హిట్‌మ్యాన్ ఇబ్బంది పడి చివరకు హాజెల్‌వుడ్ ఎక్స్‌ట్రా బౌన్స్‌కు పెవిలియన్‌కు చేరాడు. ఇక ఆసీస్ గడ్డపై అద్భుతంగా ఆడే విరాట్ 8 బంతులాడినా ఖాతా కూడా తెరువలేదు. కవర్‌డ్రైవ్ ఆడే ప్రయత్నంలో కూపర్ అద్భుత క్యాచ్‌కు దొరికిపోయాడు. అంతలోనే చక్కగా కుదురుకున్న గిల్ (10)ను ఎలిస్ అవుట్ చేయడంతో 25/3 స్కోరుతో జట్టు కష్టాల్లో పడింది. అటు 9-17 ఓవర్ల మధ్య ఏకంగా నాలుగు సార్లు వర్షంతో ఆటంకం కలిగింది. దీంతో మ్యాచ్‌ను పలు దఫాలుగా 49, 35, 32 చివరగా 26 ఓవర్లుగా కుదించాల్సి వచ్చింది. శ్రేయాస్ (11) కూడా నిరాశపర్చిన వేళ.. అక్షర్, రాహుల్ జోడీ మాత్రం ఆదుకునే ప్రయత్నం చేసింది. వరుస బౌండరీలతో స్కోరును పెంచుతూ ఐదో వికెట్‌కు 39 పరుగులు జోడించారు. 20వ ఓవర్‌లో అక్షర్‌ను కునేమన్ అవుట్ చేయగా.. తర్వాతి ఓవర్‌లోనే రాహుల్ రెండు వరుస సిక్సర్లతో 17 రన్స్ రాబట్టాడు. సుందర్ (10)తో కలిసి తను ఆరో వికెట్‌కు 31 రన్స్ రాబట్టాడు. అయితే సుందర్, రాహుల్, హర్షిత్ (1), అర్ష్‌దీప్ (0) 12 బంతుల వ్యవధిలోనే వెనుదిరగ్గా ఆఖరి ఓవర్‌లో నితీశ్ రెండు సిక్సర్లతో స్కోరును 130 దాటించాడు.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (సి) రెన్షా (బి) హాజెల్‌వుడ్ 8, గిల్ (సి) ఫిలిప్ (బి) ఎలిస్ 10, విరాట్ (సి) కూపర్ (బి) స్టార్క్ 0, శ్రేయాస్ (సి) ఫిలిప్ (బి) హాజెల్‌వుడ్ 11, అక్షర్ (సి) రెన్షా (బి) కునేమన్ 31, రాహుల్ (సి) రెన్షా (బి) ఓవెన్ 38, సుందర్ (బి) కునేమన్ 10, నితీశ్ (నాటౌట్) 19, హర్షిత్ (సి) ఫిలిప్ (బి) ఓవెన్ 1, అర్ష్‌దీప్ (రనౌట్) 0, సిరాజ్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 26 ఓవర్లలో 136/9. వికెట్ల పతనం:** 1-13, 2-21, 3-25, 4-45, 5-84, 6-115, 7-121, 8-123, 9-124; **బౌలింగ్:** స్టార్క్ 6-1-22-1, హాజెల్‌వుడ్ 7-2-20-2, ఎలిస్ 5-1-29-1, ఓవెన్ 3-0-20-2, కునేమన్ 4-0-26-2, షార్ట్ 1-0-17-0.

ఆస్ట్రేలియా: మార్ష్ (నాటౌట్) 46, హెడ్ (సి) హర్షిత్ (బి) అర్ష్‌దీప్ 8, షార్ట్ (సి) రోహిత్ (బి) అక్షర్ 8, ఫిలిప్ (సి) అర్ష్‌దీప్ (బి) సుందర్ 37, రెన్షా (నాటౌట్) 21, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 21.1 ఓవర్లలో 131/3. వికెట్ల పతనం:** 1-10, 2-44, 3-99; **బౌలింగ్:** సిరాజ్ 4-1-21-0, అర్ష్‌దీప్ 5-0-31-1, హర్షిత్ 4-0-27-0, అక్షర్ 4-0-19-1, నితీశ్ 2.1-0-16-0, సుందర్ 2-0-14-1.

బిజినెస్

మీషో.. రూ.4,250 కోట్ల ఐపీఓ

న్యూఢిల్లీ: మరో ఈ-కామర్స్ సంస్థ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ప్రైమరీ మార్కెట్ ద్వారా రూ.4,250 కోట్లు సమీకరించేందుకు ఈ-కామర్స్ సంస్థ మీషో సెబీకి దరఖాస్తు చేసింది. ఈ ఐపీఓ ద్వారా ప్రారంభంలో కంపెనీలో పెట్టుబడి పెట్టిన పీఈ సంస్థలు కూడా తమ వాటాలో కొన్ని షేర్లను విక్రయించనున్నాయి. ఐపీఓ ద్వారా సేకరించే నిధుల్లో కొంత మొత్తాన్ని వ్యాపార విస్తరణ కోసం ఉపయోగించాలని మీషో భావిస్తోంది.


జూన్ నాటికి ఎమిరేట్స్ ఎన్‌బీడీ పెట్టుబడులు

ఆర్‌బీఎల్ బ్యాంక్

ముంబై: అన్ని అనుమతులు లభిస్తే, వచ్చే ఏడాది జూన్ నాటికి ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్ నుంచి 300 కోట్ల డాలర్ల పెట్టుబడులు అందుతాయని ఆర్‌బీఎల్ బ్యాంక్ భావిస్తోంది. ఈ పెట్టుబడి ద్వారా ఎమిరేట్స్ ఎన్‌బీడీ, ఆర్‌బీఎల్ బ్యాంక్ ఈక్విటీలో 60 శాతం వాటా పొందుతుంది. ఈ నిధులతో తమ వ్యాపారాన్ని పెద్దఎత్తున విస్తరిస్తామని బ్యాంక్ ఎండీ, సీఈఓ సుబ్రమణియ కుమార్ చెప్పారు. ఈ పెట్టుబడులతో వచ్చే మూడు నుంచి ఐదేళ్లలో అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటిగా ఎదగనున్నట్టు తెలిపారు. పెద్దపెద్ద కంపెనీలకు రుణాలతో పాటు వెల్త్ మేనేజ్‌మెంట్ సేవల్లోకి ప్రవేశించనున్నట్టు చెప్పారు.

25,400 దిగువన బేరిష్

(అక్టోబరు 20-24 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

- నిఫ్టీ గత వారం 25,061-25,782 పాయింట్ల మధ్యన కదలాడి చివరకు 1.65 శాతం లాభంతో 25,710 వద్ద క్లోజైంది.
- ఈ వారాంతంలో 25,400 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి: 26,000 బ్రేక్‌డౌన్ స్థాయి: 25,400
నిరోధ స్థాయిలు: 25,925, 26,025, 26,125 (25,825 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 25,500, 25,400, 25,300 (25,600 దిగువన బేరిష్)

టెక్ వ్యూ

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	553
చిత్తూరు	583	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	126
వరంగల్	112	గుంటూరు	121
కరీంనగర్	112	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	112
కర్నూలు	112	నెల్లూరు	117
విశాఖపట్నం	129	అనంతపురం	117
గోదావరి	126		

'పసిడి, వెండి'పై జర జాగ్రత్త



అతిగా కొంటే అనర్థమే
ర్యాలీకి బ్రేక్ పడే అవకాశం

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు రేసు గుర్రాల్లా పరుగెడుతున్నాయి. ధరలపరంగా రోజుకో రికార్డు సృష్టిస్తున్నాయి. గత ఏడాది ధనత్రయోదశి నుంచి ఈ ఏడాది ధనత్రయోదశి మధ్య 10 గ్రాములు మేలిమి (24 క్యారట్లు) పసిడి ధర రూ.81,400 నుంచి రూ.1,34,800కు చేరి మదుపరులకు 62 నుంచి 65 శాతం లాభాలు పంచింది. వెండి ధరా నేనేమీ తక్కువ కాదంటూ 69 నుంచి 70 శాతం వరకు పెరిగింది. దీంతో చాలా మంది ముఖ్యంగా మహిళలు, అయ్యో చౌకగా ఉన్నపుడు వీటిని కొనలేకపోయామే అని బాధపడుతున్నారు. పెట్టుబడి లాభాల కోసం చూసే మదుపరులదీ ఇదే బాధ. గత ఏడాది ఇదే కాలంలో స్టాక్ మార్కెట్ అత్తెసరు లాభాలతో సరిపెట్టగా బంగారం, వెండి మాత్రం మదుపరులకు గతంలో ఎన్నడూ లేని విధంగా బంపర్ లాభాలు పంచాయి.

కరెక్షన్‌కు అవకాశం!

ఈ ఏడాది ఇప్పటి వరకు చూసినా బంగారం, వెండి మదుపరులకు 50 శాతం పైనే లాభాలు పంచాయి. ఇంకా పెరుగుతాయా? తగ్గుతాయా? అంటే ఎవరూ కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. అయితే ఇప్పటికే గరిష్ఠ స్థాయికి చేరిన బులియన్ మార్కెట్ త్వరలోనే దిద్దుబాటుకు లోనయ్యే పరిస్థితి ఉందని మార్కెట్ వర్గాల అంచనా. ప్రాథమిక పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేకపోయినా.. లాభాల స్వీకరణ అమ్మకాలు ఇందుకు దోహదం చేస్తాయని భావిస్తున్నారు. ఈ దిద్దుబాటు కూడా 5 శాతం నుంచి 7 శాతం మించకపోవచ్చని అంచనా వేస్తున్నారు. ట్రంప్ బెదిరింపులు ఫలించి రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి బ్రేక్ పడినా ఈ దిద్దుబాటు 10 నుంచి 15 శాతానికి మించకపోవచ్చని భావిస్తున్నారు.

"బంగారం, వెండి ధరలు ఎంతగా పెరిగినా.. పెట్టుబడుల్లో అవి ఒక పరిమితి స్థాయికి మించి ఉండకూడదు. మదుపరులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రస్తుతం పసిడి ధరల పెరుగుదలకు ఎలాంటి ఫండమెంటల్స్ లేవు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నాటి నుంచే ఇది పెరగటం ప్రారంభమైంది. మొత్తం పెట్టుబడుల్లో బంగారం, వెండి వాటా 10 శాతానికి మించకుండా చూసుకోవటం మంచిది."

\- నీలేష్ షా, ఎండీ, కోటక్ మహీంద్రా ఏఎంసీ

పెట్టుబడుల్లో 10 శాతం వరకు ఓకే

ఇటీవల పెట్టుబడి లాభాల కోసం బంగారం, వెండి కొనే దారి సంఖ్య భారీగా పెరిగింది. గతంలో మన దేశంలో బంగారం, వెండి కొనే వారిలో 60 నుంచి 65 శాతం మంది నగ నట్రా కోసం కొనేవారు. కేవలం 35 నుంచి 40 శాతం మంది మాత్రమే పెట్టుబడి లాభాల కోసం కొనేవారు. ఇప్పుడది తిరగబడింది. ఇటీవలి ర్యాలీతో అది మరింత పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. కొంత మందైతే స్టాక్ మార్కెట్ పెట్టుబడులతో విసిగిపోయి ఉన్న నాలుగు రాళ్లతో బంగారం, వెండి కొనేస్తున్నారు. ఇది ఏ మాత్రం మంచిది కాదని మార్కెట్ వర్గాల అభిప్రాయం. ఆర్థిక పరిస్థితులు, అనిశ్చిత కుదుటపడి ఆర్‌బీఐతో సహా కేంద్ర బ్యాంకులన్నీ పసిడి, వెండి కొనుగోళ్లకు ఫుల్ స్టాప్ పెట్టి, అమ్మకాలు మొదలు పెడితే ఈ రెండు లోహాల ధర భారీగా దిద్దుబాటుకు లోనయ్యే అవకాశం ఉంది. అదేజరిగితే లాభాల మాట దేవుడెరుగు, ఉన్న పెట్టుబడులే హరించుకుపోయే ప్రమాదం ఉందని ఇన్వెస్ట్‌మెంట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఇన్వెస్టర్ తన పెట్టుబడుల్లో 10 నుంచి 15 శాతానికి మించి బంగారం, వెండిలో మదుపు చేయకపోవడం మంచిదని సూచిస్తున్నారు.

26,000 వద్ద నిరోధం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

గత వారం ఆరంభంలో నిఫ్టీ 25,000 దిగువకు చేరి ఆ తర్వాత బౌన్స్‌బ్యాక్ అయ్యింది. చివరి మూడు సెషన్లలో ర్యాలీని కనబరుస్తూ 424 పాయింట్ల లాభంతో 25,700 స్థాయిల్లో క్లోజైంది. నిఫ్టీ గత మూడు వారాలుగా 1,100 పాయింట్ల మేర లాభపడి ప్రస్తుతం ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలైన 26,000కు చేరువలో ఉంది. ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండటం మంచిది. టెక్నికల్‌గా చూస్తే కీలక నిరోధ స్థాయిలైన 26,000 ఎగువన నిలదొక్కుకుంటేనే తదుపరి అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తుందా లేదా అనేది తేలుతుంది. మిడ్‌క్యాప్-100 సూచీ వీక్లీ ప్రాతిపదికన 205 పాయింట్లు లాభపడింది. గరిష్ఠ స్థాయిల వద్ద అప్రమత్త ట్రెండ్‌ను సూచిస్తోంది. స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగిసి ఎలాంటి మూమెంట్‌ను సూచించటం లేదు.

బుల్లిష్ స్థాయిలు: సానుకూల ట్రెండ్ కోసం 26,000 ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఇది గత ఏడాది సెప్టెంబరులో ఏర్పడిన స్థాయి. ఇక్కడి నుంచే మార్కెట్ బలమైన కరెక్షన్‌లోకి జారుకుంది. ఇక్కడ కన్సాలిడేషన్‌కు అవకాశం ఉంది. అప్‌ట్రెండ్‌ను కనబరచాలంటే మాత్రం ఈ స్థాయిలకు ఎగువన బలంగా నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 26,300.

బేరిష్ స్థాయిలు: ఒకవేళ నిఫ్టీ డౌన్‌ట్రెండ్‌ను సూచిస్తే 25,500 దిగువన తదుపరి మద్దతు స్థాయిలుంటాయి. రక్షణ కోసం ఈ స్థాయిలకు ఎగువన పటిష్ఠంగా క్లోజ్ కావాల్సి ఉంటుంది. తదుపరి ప్రధాన మద్దతు స్థాయి 25,000.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం 1,100 పాయింట్ల మేరకు ర్యాలీ సాధించిన ఈ సూచీ ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలైన 57,710 వద్ద ముగిసింది. టెక్నికల్‌గా పుల్‌బ్యాక్ రియాక్షన్‌కు అవకాశం ఉండటంతో అప్రమత్తంగా వ్యవహరించటం మంచిది. తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 58,000. ఇక్కడ కొద్ది రోజులు నిలదొక్కుకుంటేనే అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తుంది. ఒకవేళ కరెక్షన్‌ను కనబరిస్తే సానుకూల ట్రెండ్ కోసం 57,500 దిగువన మద్దతు స్థాయిలు ఉంటాయి. ఇక్కడ కూడా నిలదొక్కుకోకపోతే తదుపరి మద్దతు స్థాయి 57,000 వద్ద ఉంటుంది.

పాటర్న్: పాజిటివ్ ట్రెండ్ కోసం 25,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్ లైన్" వద్ద నిలదొక్కుకోవాలి. ప్రస్తుతం మార్కెట్ స్వల్పకాలిక ఓవర్‌బాట్ పొజిషన్‌కు చేరువలో ఉంది. గరిష్ఠ స్థాయిల వద్ద స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,910, 26,000
మద్దతు	25,780, 25,700

అంతర్జాతీయ పరిణామాలే కీలకం!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశం ఉంది. ఇప్పటికే కార్పొరేట్ ఫలితాల సీజన్ మొదలైంది. జీఎస్‌టీ తగ్గటం, కొనుగోళ్లు పెరగటంతో కంపెనీల మార్జిన్లు పెరిగే అవకాశం ఉంది. అయితే జియో పొలిటికల్ పరిణామాలపై ఓ కన్నేయటం మంచిది. ఎంపిక చేసుకున్న స్టాక్స్‌లోనే ట్రేడింగ్ చేయాలి. నిఫ్టీ 25,700 ఎగువన నిలదొక్కుకుంటే మూమెంటమ్ మరింత బలపడుతుంది. ప్రస్తుతం ఆటో, మెటల్స్, డిఫెన్స్, టెలికాం, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగ షేర్లు జోరు ప్రదర్శిస్తున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

పిడిలైట్: రెండేళ్లుగా ఎలాంటి రిటర్న్ ఇవ్వని ఈ షేరు ప్రస్తుతం పుంజుకుంటోంది. ఫిబ్రవరి నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. ప్రస్తుతం కన్సాలిడేషన్ జరుగుతోంది. గత శుక్రవారం రూ.1,542 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,520 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,660 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.1,490 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

ఐటీసీ: ప్రస్తుతం ఈ షేరు కనిష్ఠ స్థాయిల్లో కదలాడుతోంది. జీఎస్‌టీ సంస్కరణల నేపథ్యంలో లాభదాయకత పెరిగే అవకాశం ఉండటంతో ఇన్వెస్టర్లు ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. గత శుక్రవారం రూ.412 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.410 శ్రేణిలో ప్రవేశించి రూ.470 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.395 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బెర్జర్ పెయింట్స్: కొన్ని నెలల పతనం తర్వాత పుంజుకున్న ఈ షేరు ప్రస్తుతం దిద్దుబాటు దశలో ఉంది. స్వల్పకాలిక మూమెంటమ్ బలపడుతోంది. పండగల నేపథ్యంలో లాభదాయకత పెరగవచ్చు. గత శుక్రవారం రూ.544 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.525 స్థాయిలో ప్రవేశించి రూ.650 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.505 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మహీంద్రా ఫైనాన్స్: రెండేళ్లుగా రేంజ్ బౌండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం అప్‌ట్రెండ్‌లోకి అడుగుపెట్టింది. మూమెంటమ్, డెలివరీ పెరిగాయి. బుల్లిష్‌నెస్ కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.300 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.280 పై స్థాయిలో ప్రవేశించి రూ.355 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.260 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మారికో: గడిచిన ఏడాది కాలంలో 10 శాతం రిటర్న్ ఇచ్చిన ఈ కౌంటర్‌లో మూమెంటమ్ బలపడుతోంది. ఈ షేరు మరింత పెరిగే అవకాశం ఉంది. గత శుక్రవారం రూ.735 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.725పై స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.840 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.705 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



\- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

సంక్షిప్తంగా

- ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ప్యూర్.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా కర్నూలు, అమలాపురంలలో కొత్త షోరూమ్స్‌ను ఏర్పాటు చేసింది. వచ్చే 30 నెలల్లో కొత్తగా 250 కొత్త ఔట్‌లెట్స్‌ను ఏర్పాటు చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగా వీటిని ప్రారంభించింది.
- అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సందర్భంగా 276 కోట్ల మంది సైట్‌ను విజిట్ చేసినట్లు అమెజాన్ ఇండియా ప్రకటించింది. ఇందులో 70 శాతం మంది ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచే ఉన్నారని వెల్లడించింది. ఈ ఫెస్టివల్ సందర్భంగా బ్యాంక్ ఆఫర్లు, జీఎస్‌టీ లాభాలు, క్యాష్‌బ్యాక్ రివార్డుల రూపంలో వినియోగదారులు రూ.1,000 కోట్ల వరకు లబ్ధి పొందారని తెలిపింది.
- ఏఐ ఆధారిత సెక్యూరిటీ, నెట్‌వర్క్ ట్రాన్స్‌ఫార్మేషన్ కోసం హెచ్‌సీఎల్ టెక్, జెడ్‌స్కేలర్ తమ భాగస్వామ్యాన్ని విస్తరించాయి. ఈ భాగస్వామ్యంలో హెచ్‌సీఎల్ టెక్ సైబర్ సెక్యూరిటీ ఫ్యూజన్ సెంటర్‌తో జెడ్‌స్కేలర్‌కు చెందిన జీరో ట్రస్ట్ ఎక్స్ఛేంజీ ప్లాట్‌ఫామ్‌ను అనుసంధానం చేయనున్నారు.
- యాక్సిస్ ఫైనాన్స్ లిమిటెడ్.. యాక్సిస్ ఫైనాన్స్ శక్తి పేరుతో చిన్న మొత్తాల ఆస్తులకు రుణ పథకాన్ని ప్రారంభించింది. స్వయం ఉపాధి పొందుతున్న వ్యాపారులు, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా ఈ పథకాన్ని రూపొందించింది. ఆస్తులపై రూ.75 లక్షల వరకు రుణాలను అందించనుంది.



డిసెంబర్‌లో విడుదల



గుణశేఖర్ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'యుఫోరియా'. భూమికా చావ్లా శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. సారా అర్జున్, నాజర్, రోహిత్ ప్రధాన తారాగణం. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ, యుక్తా గుణ నిర్మించారు. చిత్రబృందం ఆదివారం విడుదల తేదీని ప్రకటించింది. డిసెంబర్ 25న 'యుఫోరియా' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో చిరు దరహాసంతో కూడిన లుక్‌లో భూమిక కనిపించి ఆకట్టుకున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే హంగులతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు యూనిట్ తెలిపింది. కాలభైరవ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ప్రవీణ్ కే పోతన్.

కలర్‌ఫుల్ కథతో...



ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ముఖ్యతారలుగా ప్రణీత్ ప్రత్తిపాటి తెరకెక్కిస్తోన్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. ప్రముఖ గాయకుడు, నటుడు ఎస్పీ చరణ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్ పతాకంపై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేశ్ కొత్తింటి, నాని బండ్రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబరు 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'ఈ సినిమా థియేటర్లలో యూత్‌ఫెస్టివల్‌లా ఉంటుంది. ఎంతో కలర్‌ఫుల్‌గా ఉండే ఈ చిత్రానికి కథే హీరో' అని తెలిపారు.

యాక్షన్ రోల్‌లో...




కథానాయికగా వరుస విజయాలను అందుకొంటున్నారు సంయుక్త. కెరీర్‌లో తొలి సారి ఆమె ప్రధాన పాత్రధారిణిగా ఓ మహిళా ప్రాధాన్య చిత్రం తెరకెక్కుతోంది. రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. సింధు మాగంటి సహ నిర్మాత. సంయుక్త స్వయంగా సమర్పిస్తున్నారు. యోగేశ్ కేఎంసీ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా మేకర్స్ ఈ చిత్రానికి 'ది బ్లాక్ గోల్డ్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను నిర్ణయించారు. దీపావళి సందర్భంగా చిత్రబృందం కొత్త లుక్‌ను నేడు విడుదల చేయనుంది. థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సంయుక్త యాక్షన్ రోల్‌లో అలరించనున్నారు, పోరాట ఘట్టాల్లో ఆమె నటన ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సి.ఎస్, సినిమాటోగ్రఫీ: ఎ. వసంత్.













కొండలెక్కిన మన్యం కలెక్టర్

మూడు కిలోమీటర్లు నడిచి గిరిజనుల చెంతకు

- సమస్యలు అడిగి తెలుసుకొని.. పరిష్కారానికి హామీ
- లొద్ద జలపాతం అభివృద్ధికి అధికారులతో సమీక్ష

పార్వతీపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గిరిజనులతో మమేకమై, వారి సమస్యలు తెలుసుకుని, పరిష్కరించేందుకు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి కొండలెక్కి సుమారు మూడు కిలోమీటర్లు నడిచివెళ్లారు. సాలూరు మండలంలోని లొద్ద జలపాతం వద్ద నివసిస్తున్న గిరిజనుల వద్దకు కలెక్టర్ ఆదివారం పయనమయ్యారు. పార్వతీపురం నుంచి కారులో మక్కువ మండలం నంద వరకు వెళ్లారు. అక్కడి నుంచి అధికారులతో కలిసి జీపుల్లో లొద్దకు బయలుదేరారు.



లొద్ద జలపాతంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, అధికారులు

వర్షాలకు మట్టి రోడ్డు పాడవడంతో మాసినవలస దాటిన తర్వాత జీపులను నిలిపివేశారు. అక్కడి నుంచి కొద్ది దూరం బైక్‌లపై పయనించారు. అనంతరం మూడు కిలోమీటర్లు నడిచి లొద్ద వద్దకు చేరుకున్నారు. అక్కడి గిరిజనులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల మంజూరుకు హామీ ఇచ్చారు. గిరిజనులు అందించిన రాగి సంకటి తిని, అంబలి తాగారు. అనంతరం మరో రెండు కిలోమీటర్లు వరకు నడిచి లొద్ద జలపాతానికి కలెక్టర్ చేరుకున్నారు. జలపాతంలో ఆయన స్నానం చేశారు. ఆ తర్వాత అధికారులతో సమీక్షించారు. లొద్ద జలపాతం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సాయంత్రం వర్షం తగ్గిన తర్వాత జీపుల వద్దకు చేరుకొని తిరుగుపయనమయ్యారు.

మన్యం జిల్లాలో తప్పని డోలీ మోత

కొమరాడ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలంలో కొన్ని గిరిశిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. దీంతో ఆ ప్రాంతవాసులకు డోలీ మోతలు తప్పడం లేదు. పూడేసు పంచాయతీ పరిధి గుమడింగి కొండ శిఖర గ్రామానికి చెందిన ఆరిక దండు కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఆదివారం పరిస్థితి విషమించడంతో భార్య జమ్మాలమ్మ, కొడుకు మోహన్‌రావు, గ్రామస్థులు హరి, నాగార్జునతో కలిసి దండుకు డోలీ కట్టారు. సుమారు మూడు కిలోమీటర్లు డోలీ మోసుకుంటూ... రాళ్లు రప్పలు దాటి.. కొండ దిగి ఒడిశా రాష్ట్రం కొమ్ముగండ గ్రామం వరకు చేరుకున్నారు. అక్కడ నుంచి ఆటో ద్వారా పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి చేరుకున్నారు. వైద్యులు దండును పరీక్షించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి బాగానే ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని, డోలీ మోతలు తప్పించాలని ఆ గ్రామ గిరిజనులు కోరుతున్నారు.



ఆరిక దండును మోసుకుంటూ వెళ్తున్న దృశ్యం

మానవతావాది మౌలానా హఫీజ్ పీర్ షబ్బీర్

- సంతాప సందేశంలో సీఎం చంద్రబాబు వెల్లడి
- ఆయన మరణం తీరనిలోటు: వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్

అమరావతి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జమియత్ ఉలేమా ఏ హింద్ ఉమ్మడి ఏపీ అధ్యక్షుడు మౌలానా హఫీజ్ పీర్ షబ్బీర్ అహ్మద్ మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. హిందూ-ముస్లిం ఐక్యతకు ఆయన శక్తివంచన లేకుండా కృషి చేశారని, మానవతావాదిగా ఆయన చేసిన సేవలు నిరుపమానం అని సీఎం కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు సీఎం పేర్కొన్నారు. కాగా, మౌలానా హఫీజ్ పీర్ షబ్బీర్ అహ్మద్ మరణం మతపరమైన, సామాజిక, విద్యా రంగాలకు తీరనిలోటని సంతాప సందేశంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం హైదరాబాద్‌లో మరణించినట్టు తెలిపారు. జీవితాంతం మతసేవ, విద్యా ప్రాచుర్యం, మానవతా విలువల ప్రోత్సాహానికి ఆయన అంకితమయ్యారని, సమాజంలో శాంతి, సహనం, ఐక్యత వంటి విలువలను వ్యాప్తి చేశారని కొనియాడారు.

డీఏ విడుదలపై ఉపాధ్యాయ సంఘాల హర్షం

అమరావతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు దీపావళి కానుకగా ప్రభుత్వం ఒక డీఏ ప్రకటించడంపై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి స్వయంగా సీఎం చంద్రబాబు చర్చలు జరపడం శుభపరిణామమని అన్నారు.

రెవెన్యూ అధికారుల సంఘం హర్షం

విజయవాడ (గాంధీనగర్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక డీఏ ప్రకటించడంపై ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అధికారుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్.రవీంద్రరాజు ఆదివారం ఒక ప్రకటనలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

డిజిటల్ సర్వే నుంచి సాగు కాని భూముల మినహాయింపు

- రాష్ట్రంలో 55% డిజిటల్ పంటల సర్వే పూర్తి

అమరావతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సాగులో లేని భూముల తోపాటు మరికొన్నింటికి డిజిటల్ పంటల సర్వే నుంచి కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించినట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ మన జీర్ జిలానీ వెల్లడించారు. ఈ-పంట నమోదులో కాలువలు, రోడ్లు, భవనాలతో పాటు బీడు భూములు, సర్వేకు వీలు కాని ఆక్వా, వ్యవసాయేతర భూ కమతాలకు సర్వే నుంచి మినహాయింపు ఇచ్చినట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సవరించిన మార్గదర్శకాల ప్రకారం ఈనెల 30లోగా ఖరీఫ్-2025లో ఈ-పంట నమోదు ప్రక్రియను ముగించాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గడువు సమీపిస్తున్నందున 100 శాతం ఈ- పంట నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2.91 కోట్ల ల్యాండ్ ప్యాకెట్స్ ఉండగా, శనివారం నాటికి 1.59 కోట్ల సర్వే(55%)జరిగినట్లు తెలిపారు. మిగిలిన 1.33 కోట్ల భూ కమతాల్లో ఎక్కువ భాగం సర్వేకు సాధ్యం కాని కమతాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు సాగులో లేని, వ్యవసాయేతర భూ కమతాలను నిలుపుదల చేసుకునే అవకాశం కేంద్రం కల్పించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన సర్వేలో ప్రకాశం, కాకినాడ, అనంతపురం జిల్లాలు మొదటి మూడు స్థానాల్లో ఉండగా, చివరి స్థానంలో విశాఖ, అల్లూరి, అనకాపల్లి జిల్లాలు ఉన్నట్లు ఆయన వివరించారు.

బాలుడి బ్యాగులో బుల్లెట్




బాలుడి బ్యాగులో దొరికిన బుల్లెట్

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మూసాపేట్ మెట్రో స్టేషన్‌లో ఓ బాలుడి బ్యాగులో బుల్లెట్ లభించడం కలకలం రేపింది. శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఓ బాలుడు (12) లగేజీ బ్యాగుతో మెట్రో స్టేషన్‌కు వచ్చాడు. స్కానింగ్ సమయంలో ఏదో మెత్తు పదార్థం ఉన్నట్లు గుర్తించిన సిబ్బంది అప్రమత్తమై వెంటనే కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై గిరీశ్ కుమార్ బృందం సదరు బాలుడి వద్ద నుంచి 9 ఎంఎం బుల్లెట్‌ను స్వాధీనం చేసుకుని, ఎస్‌హెచ్‌వో కేవీ సుబ్బారావు సమక్షంలో విచారణ చేపట్టింది. ఏపీలోని శ్రీకాకుళానికి చెందిన ఓ మహిళ, భర్త నుంచి విడిపోయి మూసాపేట్ ప్రగతినగర్‌లో బిహార్‌కు చెందిన ఓ వ్యక్తితో కలిసి సహజీవనం చేస్తోంది. ఇటీవల ఆమె శ్రీకాకుళం వెళ్లగా కుమారుడు (12) మారాం చేయడంతో తీసుకొచ్చి స్థానికంగా ఉన్న పాఠశాలలో చేర్పించింది. స్కూల్‌కు సరిగ్గా వెళ్లడం లేదని ఉపాధ్యాయులు, తల్లి పదేపదే కోప్పడుతుండడంతో ఎలాగైనా తిరిగి ఏపీకి వెళ్లిపోవాలని ఆ బాలుడు నిర్ణయించుకున్నాడు. ఎలా వెళ్లాలనేది యూట్యూబ్‌లో చూసి ఇంట్లో ఉన్న ఓ బ్యాగులో బట్టలు సర్దుకుని సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు మూసాపేట్ మెట్రో స్టేషన్‌కు వచ్చాడు. ఆ బ్యాగు ఆ బాలుడి సవతి తండ్రిది. ఆ బ్యాగులో బుల్లెట్ ఉన్న విషయం ఆ బాలుడికి తెలియదు. ఆ బాలుడి తల్లి, సవతి తండ్రిని విచారించగా ఆ బుల్లెట్ తానే బిహార్ నుంచి తీసుకువచ్చానని, తన తాత ఆర్మీలో పనిచేశాడని బాలుడి సవతి తండ్రి పోలీసులకు చెప్పాడు. బుల్లెట్ దాచుకోవడం, తరలించడం నేరం కాబట్టి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

జోగి రమేశ్ అరెస్టు ఖాయం!

- నకిలీ మద్యం కేసులో ఆయనే సూత్రధారి: బుద్దా వెంకన్న



విజయవాడ(వన్‌టౌన్), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో జోగి రమేశ్ అరెస్టు కావటం ఖాయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలోని తన కార్యాలయంలో బుద్దా వెంకన్న మీడియాతో మాట్లాడుతూ నకి లీ మద్యం తయారీలో జోగి రమేశ్ సూత్రధారుడని చెప్పారు. జోగి రమేశ్ నకిలీ మద్యం తయారు చేయించారని జనార్దన్‌రావు ఒప్పుకొన్నారని తెలిపారు. జోగి రమేశ్ వందల కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టుకున్నారని, బెదిరించి అగ్రిగోల్డ్ ఆస్తులను రాయించుకున్నారని పేర్కొన్నారు. కావాలనే చంద్రబాబు నివాసంపై దాడికి జోగి రమేశ్ వచ్చారని తెలిపారు. మాజీ సీఎం హోదాలో ఉన్న నాయకుడి ఇంటికి నిరసన తెలపటానికి ఎలా వెళతారని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు జగన్మోహన్ రెడ్డి ఇంటికి వెళ్లవచ్చా అని నిలదీశారు. అమరావతి పై వైసీపీ స్టాండ్ మారినంతమాత్రాన ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. జోగి రమేశ్‌కు దమ్మూ లేదు, దుమ్ములేవని ఎద్దేవా చేశారు.

పప్పులు కాజేసి.. కోట్లు వెనకేసి..

పక్కా ప్రణాళికతో వందల కోట్లు కొల్లగొట్టిన పప్పు వ్యాపారులు

- గత ప్రభుత్వాధికారులతో కుమ్మక్కు
- నకిలీ సహకార సొసైటీలు సృష్టి
- కోట్లు కొల్లగొట్టిన వెంకటేశ్వరరావు, దేశ మురళి, మస్తాన్‌రావు
- ఐటీ అధికారుల సోదాల్లో 500కోట్లకు పైగా అక్రమాలు వెలుగులోకి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



రైతులు పండించిన పప్పు ధాన్యాలకు గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేసి సామాన్యులకు అందించాలన్నది కేంద్ర ప్రభుత్వ ఆశయం..! అయితే అవినీతి అధికారుల చేతుల తడిపి ఆ నిత్యావసరాలను నల్లబజారుకు తరలించి కోట్లు కొల్లగొట్టాలనేది బడా వ్యాపారుల లక్ష్యం..! వారికి సహకరించి ఎన్నికల ఖర్చుల కోసం కోట్లాది రూపాయలు లాగేయాలన్నది వైసీపీ నేతల స్వార్థం..! పై మూడింట్లో రెండు నెరవేరాయి..! సామాన్యులకు సరసమైన ధరలకు నిత్యావసరాలు లభించడం మినహా... పప్పుధాన్యాల వ్యాపారులకు వందల కోట్ల ఆదాయం.. వైసీపీ నేతలకు పదుల కోట్లలో ఎన్నికల వ్యయం.. సమకూరాయి..! మరోవైపు అవినీతి అధికారులకూ ఆశించిన స్థాయిలోనే ముడుపులు అందాయి..! గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పప్పుధాన్యాల ధరల పెరుగుదల వెనుక ఉన్న అక్రమార్కుల బండారం బయటపడింది. విజయవాడ, గుంటూరు, వినుకొండ, తెనాలి, కర్నూలు, విశాఖపట్నంలోని పప్పు వ్యాపారుల అక్రమాలకు సంబంధించిన ఆధారాలు ఆదాయపుపన్ను శాఖకు లభించాయి. ఏపీతో పాటు హైదరాబాద్‌లోనూ ఏకకాలంలో 25 బృందాలు జరిపిన సోదాల్లో విస్తుపోయే రహస్యాలు వెలుగులోకి వచ్చాయి. పప్పు వ్యాపారులు పచ్చిపప్పు, పెసరపప్పును పక్కదారి పట్టించి 500 కోట్లకు పైగా కొల్లగొట్టినట్లు తేలింది. ఈ దందాకు సహకరించిన మాజీ మంత్రి ద్వారా గతేడాది ఎన్నికల ముందు భారీగా నగదు విత్‌డ్రా చేసినట్లు బ్యాంకు స్టేట్‌మెంట్లు లభించాయి. అక్రమంగా సంపాదించిన వందల కోట్లు విదేశాలకు తరలించి అమెరికాలోనూ ఆస్తులు పోగేసుకున్నట్లు ఆదాయ పన్ను శాఖ గుర్తించింది. నలుగురు కీలక వ్యాపారుల ఆర్థిక లావాదేవీలు, వ్యాపార రికార్డులు, బిల్లులు కావాలంటూ ఐటీ శాఖను ఈడీ వివరాలు అడిగింది. దీంతో ఏ క్షణంలోనైనా మనీలాండరింగ్ కేసు మీదపడే అవకాశం ఉందంటూ ఏపీలోని పప్పు వ్యాపారుల వెన్నులో వణుకు మొదలైంది.

దోపిడీ ఎలా జరిగిందంటే..

నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉంచేందుకు వీలుగా కేంద్రం నేషనల్ కో ఆపరేటివ్ కన్జుమర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌సీసీఎఫ్)ను స్థాపించింది. వివిధ రాష్ట్రాల్లో రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సహకార సంఘాల ద్వారా సామాన్యులకు సరఫరా చేయడమే దీని లక్ష్యం. ఆహారధాన్యాలు, పప్పులు, చక్కెర, నూనెలు తదితర నిత్యావసరాలు, ప్రజలకు ప్రభుత్వాలు అందించే పీడీఎస్‌తోపాటు అంగన్‌వాడీ కేంద్రాలకు సైతం ఎన్‌సీసీఎఫ్ సహకార సంఘాల ద్వారానే సరఫరా చేస్తుంది. అయితే రాష్ట్రంలోని కొందరు పప్పు ధాన్యాల బడా వ్యాపారులు ఎన్‌సీసీఎఫ్ అధికారులతో కుమ్మక్కై వందల కోట్లు దోచేశారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి కేంద్రం సేకరించిన పప్పును సామాన్యులకు సరసమైన ధరలకు విక్రయించాల్సిన కోఆపరేటివ్ వ్యవస్థను చేతుల్లోకి తీసుకుని బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించారు. ఏపీలో నాలుగేళ్లుగా జరుగుతున్న ఈ బాగోతం గురించి హైదరాబాద్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్ (హాకా)కు వరుసగా ఫిర్యాదులు అందాయి. వారిని ఏపీ పప్పు వ్యాపారులు ఏ విధంగా మోసగిస్తున్నారో ఫిర్యాదుల్లో స్పష్టంగా ఉండటంతో ఇది తమ పరిధి కాదని పేర్కొంటూ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ఉన్నతాధికారికి ఆ ఫిర్యాదులను ఫార్వర్డ్ చేశారు. వాటిని పరిశీలించిన ఎఫ్‌సీఐ అధికారులు దీనిలో ఎన్‌సీసీఎఫ్ ఉన్నతాధికారుల పాత్ర ఉన్నట్లు గుర్తించారు. దీనిపై ప్రధాన మంత్రి కార్యాలయానికి నివేదిక ఇవ్వడంతో ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఏపీ, తెలంగాణల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టి భారీగా అక్రమాలు, ఆదాయానికి మించిన ఆస్తులను గుర్తించారు. మరోవైపు ఎన్నికల ముందు వందల కోట్ల రూపాయలు విత్‌డ్రా చేయడాన్ని పసిగట్టారు. ఆ సొమ్ము వైసీపీ నేతల ఎన్నికల ఖర్చులకు కొంత ఇచ్చినట్లు తెలిసింది. మరికొంత విదేశాలకు తరలినట్లు ఐటీ అధికారులు అనుమానిస్తున్నారు.

ఆ బడా వ్యాపారులు ఎవరు..

వేల కోట్ల రూపాయల టర్నోవర్ చేసే బడా వ్యాపారుల్లో గుంటూరుకు చెందిన కమీషన్ ఏజెంట్ సకల వెంకటేశ్వరరావు, విజయవాడకు చెందిన వ్యాపారి దేశ మురళి, విశాఖపట్నానికి చెందిన పలక, బలపం వ్యాపారి మస్తాన్‌రావు మొదటి మూడు స్థానాల్లో ఉన్నారు. సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు, శనగపప్పు, పెసరపప్పు సరఫరా చేసేందుకు గత వైసీపీ ప్రభుత్వంలో టెండర్లు వేయడంతోనే ఈ ముగ్గురు రింగ్ మాస్టర్ల దోపిడీకి బీజం పడింది. గత ప్రభుత్వంలో ముగ్గురు మంత్రుల సహకారం, కొందరు బ్యూరోక్రాట్ల సహాయంతో వీరు టెండర్లు దక్కించుకునేవారు. ఎన్‌సీసీఎఫ్ ద్వారా తక్కువధరకు పప్పుధాన్యాలు దక్కించుకుని మార్కెట్ ధరకు బయట విక్రయిస్తే భారీగా సంపాదించవచ్చని వారు ఎత్తుగడ వేశారు. దేశ మురళి గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రి సహకారం తీసుకుంటే.. మస్తాన్ రావు బ్యూరోక్రాట్ల అవసరాలు తీర్చి వారిని బుట్టలో వేసుకున్నాడు. వెంకటేశ్వరరావు ఎన్‌సీసీఎఫ్ నుంచి పప్పులు తెచ్చుకోవడానికి అవసరమైన నకిలీ కోఆపరేటివ్ సొసైటీలను సృష్టించాడు. ముగ్గురూ కలిసి తక్కువ ధరకు శనగ పప్పు, పెసర పప్పు కొనుగోలు చేసి 10 నుంచి 15 శాతం ప్రభుత్వానికి సరఫరా చేసి మిగతాదంతా బయటి మార్కెట్లో అధిక లాభాలకు విక్రయించారు.

అక్రమ సొమ్ముతో దేవుడికి నగలు.. అమెరికాలో ఆస్తులు

పప్పు ధాన్యాల వ్యాపారంలో అక్రమంగా సంపాదించిన సొమ్ములో నుంచి దేవుడి వాటాగా వెంకటేశ్వరస్వామికి విశాఖపట్నానికి చెందిన పలక, బలపం వ్యాపారి బరువైన బంగారు హారం బహుమతిగా అందజేసినట్లు అధికారులు చెబుతున్నారు. విజయవాడ వ్యాపారి వందల కోట్ల ఆస్తులు పోగేసి.. అమెరికాలో అన్న పేరుతో ఆస్తులు సమకూర్చినట్లు తెలుస్తోంది. గుంటూరు వ్యాపారి ఎవరెవరితో ఎలాంటి లావాదేవీలు జరిపారనే వివరాలు కూడా సేకరిస్తున్నారు. ఎటువంటి సహకార సంఘాలు లేకున్నా ఈ ముగ్గురి నకిలీ సొసైటీలను సిఫారసు చేసిన ఏపీ వ్యవసాయ, సివిల్ సప్లయిస్ అధికారులు మొదలుకొని నేరుగా ఎన్‌సీసీఎఫ్ ఉన్నతాధికారితోనే తరచూ వెంకటేశ్వరరావు జరిపిన సంభాషణలు, అంతర్గత లావాదేవీలన్నీ ఈడీ అధికారులు వెలికి తీస్తారని చెబుతున్నారు.

ప్రవాసులే బ్రాండ్ అంబాసిడర్లు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రవాసాంధ్రుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 16 నెలల్లోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని.. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఈ సందర్భంగా చెప్పారు. కేంద్రం సహకారం వల్లే గూగుల్ డేటా సెంటర్ రాష్ట్రానికి వచ్చిందన్నారు. గూగుల్ ఎంత ముఖ్యమో.. ఎంఎస్ఎంఈలు కూడా అంతే ముఖ్యమని స్పష్టంచేశారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక ప్రాంతాలు, ఎన్‌టీపీసీ గ్రీన్ ప్రాజెక్టు.. ఇలా అనేక కార్యక్రమాలను శరవేగంగా చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వం పీపీఏలను రద్దు చేసి ఖజానాకు ఆర్థికంగా నష్టం చేస్తే.. తాము అభివృద్ధి కార్యక్రమాలతో దూసుకెళ్తున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధికి ప్రవాసాంధ్రులు బ్రాండ్ అంబాసిడార్లుగా మారాలని అభ్యర్థించారు. ఈ 16 నెలల్లో విశాఖ ఉక్కును కాపాడుకున్నామని.. అక్కడే రైల్వే జోన్‌ను ఏర్పాటు చేసుకున్నామని.. ఆగిపోయిన అమరావతికి నిధులు తెచ్చుకుని వేగంగా పనులు చేస్తున్నామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని.. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇంకా ఏం చెప్పారంటే..



చంద్రబాబు వయసు 75 ఏళ్లయినా.. ఇప్పటికీ 25 ఏళ్ల కుర్రాడిలా ఆలోచిస్తూ అభివృద్ధిని పరుగులెత్తిస్తున్నారు. మంత్రివర్గంలో చాలామంది యువకులం ఉన్నాం. కానీ ఆయన వేగాన్ని అందుకోలేకపోతున్నాం. - మంత్రి లోకేశ్

కసితో పనిచేస్తున్నాం..

రాష్ట్రంలో 50 మంది ఎమ్మెల్యేలు కొత్తవారే. వారిలో నేనూ ఒకడిని. 25 మంది మంత్రుల్లో 17 మంది కొత్తవారే. మేమంతా కసితో, పట్టుదలతో పని చేస్తున్నాం. 1995లో చంద్రబాబు ఏ మ్యాజిక్ చేసి తెలుగువారు తలెత్తుకుని తిరిగేలా చేశారో అదే మ్యాజిక్ మళ్లీ చేయాలని ఆయన అహర్నిశలూ కష్టపడుతున్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా తీసుకెళ్తున్నారు. అంతర్జాతీయంగా ఏ దేశానికి వెళ్లినా తెలుగువారు కనిపిస్తారు. అమెరికా నుంచి ఆస్ట్రేలియా దాకా తెలుగువారు లేని దేశమేదీ ప్రపంచంలో లేదు. ఆస్ట్రేలియా ప్రభుత్వం కూడా ఒక తెలుగువాడిని అధికారిగా నియమించింది. ఆస్ట్రేలియా ప్రధానికి కూడా ఈ స్థాయిలో స్వాగతం ఉండదని సదరు అధికారి నాతో చెప్పారు. ఇక్కడి తెలుగువారి జోష్ వేరు. జాతర మాస్‌గా ఉంది. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్ తెలుగువారికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చారు. తెలుగువారి పౌరుషాన్ని ఢిల్లీకి పరిచయం చేశారు. సీఎంగా గద్దె దింపితే ఢిల్లీని గడగడలాడించి తిరిగి గద్దెనెక్కారు. ఎన్టీఆర్ ఆశయాలను చంద్రబాబు కొనసాగిస్తున్నారు. తెలుగువారి సత్తాను ప్రపంచానికి చాటారు. 1995లో పెద్దఎత్తున సంస్కరణలు అమలు చేసి రాష్ట్రాభివృద్ధికి మార్గం చూపారు.

అప్పుడు ఎగతాళి చేశారు..

కంప్యూటర్ కూడు పెడుతుందా అని ఆనాడు చాలా మంది చంద్రబాబును ఎగతాళి చేశారు. ఫ్లైఓవర్లు కడితే అభివృద్ధి జరిగినట్లా అని గేలి చేశారు. విమానాశ్రయాలు నిర్మిస్తే ఏం జరుగుతుందని ఆనాడు అవమానకరంగా మాట్లాడారు. అలా మాట్లాడిన వారి నోట ఇప్పుడు మాట రావడం లేదు. క్వాంటమ్ కంప్యూటింగ్ మాకే అర్థం కావడం లేదు. చంద్రబాబు మాత్రం నిశితంగా విశ్లేషిస్తున్నారు. అందుకే ఆయన్ను విజనరీ అంటాం. ఇంకొకరిని (పరోక్షంగా జగన్‌ను ప్రస్తావిస్తూ) ప్రిజనరీ అంటాం. ఇప్పుడు అర్థమైందా రాజా! ఆస్ట్రేలియాలోని తెలుగువారిని నాన్ రెసిడెంట్ ఇండియన్స్ (ఎన్ఆర్ఐ) అంటారు. నేను మాత్రం మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్ (ఎంఆర్ఐ) అని అంటాను. భారతీయులు సముద్రాలు దాటి వచ్చినా తమ దేశాన్ని, పుట్టిన ఊరును మరచిపోరు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగువారికి సొంత గడ్డపై ప్రేమాభిమానాలున్నాయి.

రాజకీయాలు మనకు అవసరమా అని నాడు బ్రాహ్మణి అడిగింది

- భావోద్వేగానికి గురైన లోకేశ్

చంద్రబాబును నాడు జగన్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసినప్పుడు.. రాజకీయాలు మనకు అవసరమా అని తన భార్య బ్రాహ్మణి తనను ప్రశ్నించిందని లోకేశ్ వెల్లడించారు. గౌరవంగా బతుకుతున్న మనం రాజకీయాలతో ఇన్ని అవమానాలు భరించాలా అని అడిగిందని చెప్పారు. ఈ సమయంలో ఆయన భావోద్వేగానికి గురయ్యారు. 'చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు ప్రవాసులు ఎంతో బాధపడ్డారు. ఆయనకు, మా కుటుంబానికి మద్దతుగా నిలబడ్డారు. ఆస్ట్రేయాలోని ప్రతి నగరంలో నిరసనలు చేపట్టారు. ఆరోజు హైదరాబాద్‌కు 45 వేల మంది ప్రవాసులు వచ్చి చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఇదే.. ప్రజాసేవ ద్వారా నాయకుడిగా ఆదరణ పొందేందుకు నాకు స్ఫూర్తినిచ్చింది. మంచి నాయకుడికి ప్రపంచమే అండగా నిలిచిందని.. అందుకే రాజకీయాల్లో కొనసాగాలని ఆరోజున బ్రాహ్మణితో చెప్పాను. చంద్రబాబుకు సంఘీభావం తెలుపుతూ ప్రవాసులు తమ తమ గ్రామాలకు వెళ్లి పార్టీలు, ఎజెండాలు చూడకుండా కూటమి అభ్యర్థుల విజయం కోసం కష్టపడడం వల్లే 94 శాతం స్ట్రయిక్ రేట్‌తో గెలిచాం. ఇలాంటి వేవ్ వస్తుందని నేనూహించలేదు. ఈ గెలుపు వెనుక ప్రతి ఒక్కరి కష్టం దాగి ఉంది. ఈ అద్భుత విజయం నాలో స్ఫూర్తిని నింపింది. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం మరింత కష్టపడతా' అని హామీ ఇచ్చారు.

జైలులో ఖైదీలకు గుట్కాలు, బిర్యానీలు!

- రాజమండ్రి సెంట్రల్ జైలులో సిబ్బంది నిర్వాకం
- వారిపై చర్యలకు అధికారుల తర్జనభర్జన

రాజమహేంద్రవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో గుట్టుగా జరుగుతున్న అక్రమాలు వెలుగు చూశా యి. ఖైదీలకు గుట్కాలు, బిర్యానీలను జైలు సిబ్బంది అక్రమంగా సరఫరా చేస్తున్నారు. జైలు ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో బషీర్, సుశీల్ అనే ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. అదే సెక్షన్‌లో రామకృష్ణ అనే ఖైదీ సహాయకుడిగా పనిచేస్తున్నాడు. అతని బంధువుల ద్వారా బషీర్‌కి రూ.వెయ్యి, సుశీల్‌కి రూ.2వేలు ఆన్‌లైన్ ద్వారా పంపించారు. దీంతో వారిద్దరూ గుట్కాలు, బిర్యానీలు తీ సుకెళ్లి రామకృష్ణకు అందిస్తున్నారు. జైలు ఉద్యోగి అనుమానంతో ఆదివారం ఓ ఖైదీని తనిఖీ చేయగా గుట్కా ప్యాకెట్ బయటపడింది. దీనిపై కూపీ లాగడంతో 20 గుట్కా ప్యాకెట్లను గుర్తించారని తెలుస్తోంది. సుశీల్ మూడు నెలల కిందట కారుణ్య నియామకం కింద ఉద్యోగంలో చేరారు. సెంట్రల్ జైలు పరిపాలనా భవనంలో సుమారు 15 వరకూ సెక్షన్లు ఉంటాయి. సిబ్బంది కొరత కారణంగా పలు సెక్షన్లలో చదువుకున్న ఖైదీలతో పని చేయించుకుంటున్నారు. వాస్తవానికి పరిపాలనా భవనంలో పనులకు ఖైదీలను వినియోగించకూడదని ఉత్తర్వులు ఉన్నాయి. గుట్కాలు, బిర్యానీల విషయం ఆదివారం ఉదయం బయటపడినప్పటికీ అధికారులు ఫిర్యాదు చేయడానికి వెనుకాడినట్టు సమాచారం. తర్జనభర్జనల అనంతరం చివరకు రాత్రి 8 గంటల సమయంలో పోలీసులకు ఫిర్యాదు అందింది. సెంట్రల్ జైల్లో ఏం జరుగుతున్నా అధికారులపై తీసుకొనే చర్యల్లో తీవ్రత లేకపోవడంతో అక్రమాలకు అడ్డుకట్ట పడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జైళ్ల శాఖ కోస్తాంధ్ర ప్రాంత డీఐజీ కార్యాలయం సెంట్రల్ జైలుకు సమీపంలోనే ఉన్నా కూడా జైలులో యథేచ్ఛగా అక్రమాలు జరుగుతుండటం విస్మయానికి గురిచేస్తోంది.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా 'దేవతి'



భగవన్నారాయణ

మంగళగిరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్రప్రదేశ్ విభాగం అధ్యక్షుడిగా మంగళగిరికి చెందిన దేవతి భగవన్నారాయణ ప్రమాణస్వీకారం చేశారు. మంగళగిరి సీకే కన్వెన్షన్ హాలులో ఆదివారం అట్టహాసంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాసభ గ్లోబల్ చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, అంబికా కృష్ణ తదితర ప్రముఖుల సమక్షంలో దేవతి పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఆయనతో మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ ప్రమాణం చేయించారు. అలాగే, మహాసభ నార్త్ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా సాలన గీతాకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గాదంశెట్టి సుజాత, ప్రధాన కార్యదర్శిగా ఎస్.పద్మావతి, కోశాధికారిగా పరుచూరు చంద్రిక తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ త్వరలో విజయవాడలో ప్రపంచ స్థాయి సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. దేవతి భగవన్నారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు.

పరిశ్రమలకు తీపి కబురు

- 1500 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలు
- తొలి విడతగా త్వరలో విడుదల
- పారిశ్రామికవేత్తలకు అండ
- పెట్టుబడులకు గమ్యస్థానంగా ఏపీ
- ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన
- ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ హర్షం

అమరావతి/విజయవాడ సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ వేళ కూటమి ప్రభుత్వం పరిశ్రమలకు తీపికబురు చెప్పింది. త్వరలో రూ.1,500 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదిక ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. 'చీకటిని తరిమేస్తూ వెలుగులు నింపేది దీపావళి పండగ. అలాంటి పండగ వేళ పరిశ్రమలకు ప్రోత్సాహకాలు విడుదల చేసి ఆయా సంస్థలకు చేయూతనివ్వాలని నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములైన పారిశ్రామికవేత్తలకు అండగా నిలవాలన్న లక్ష్యంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రూ.1500 కోట్ల ప్రోత్సాహకాలను తొలి విడతగా త్వరలో విడుదల చేస్తాం. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా తీర్చిదిద్దడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని చంద్రబాబు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పారిశ్రామిక ప్రోత్సాహకాల నగదు మొదటి విడతగా రూ.1,500 కోట్లను ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు ప్రకటించడం పట్ల ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు పి.భాస్కరరావు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంఎస్ఎంఈ రంగానికి అతిపెద్ద ఉపశమనమని, ఉత్పత్తి కార్యకలాపాల పునరుద్ధరణకు, వృద్ధిని కొనసాగించడానికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. పెట్టుబడిదారుల విశ్వాసం పెరుగుతుందన్నారు. నవంబరు 14న జరగనున్న గ్లోబల్ బిజినెస్ సదస్సుకు ముందే మరో విడత ప్రోత్సాహకాలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



పున్నమిఘాట్‌లో జరిగిన దీపావళి వేడుకలకు హాజరైన ప్రజానీకం



పున్నమిఘాట్‌లో ఆదివారం రాత్రి జరిగిన దీపావళి వేడుకల్లో బాణసంచా వెలుగులు



విజయవాడ పున్నమిఘాట్‌లో ఆదివారం రాత్రి జరిగిన దీపావళి వేడుకలను అనాథ పిల్లలతో కలిసి వీక్షిస్తున్న సీఎం చంద్రబాబు దంపతులు

ఏపీ టు ఏఐ!

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహణపై ఆయన సమీక్ష నిర్వహించారు. పరిశ్రమల మంత్రి టీజీ భరత్, ఆ శాఖ ఉన్నతాధికారులు, సులభతర వాణిజ్య విభాగం (ఈడీబీ) అధికారులు హాజరయ్యారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, సీఐఐ ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. విశాఖ సదస్సులో దావోస్ తరహాలోనే పెట్టుబడిదారులు, విధాన రూపకర్తల మధ్య చర్చలు జరిగేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు చెప్పారు. నాలెడ్జ్ షేరింగ్ కోసం ప్లీనరీ సెషన్లు, బ్రేకవుట్ సెషన్లు నిర్వహించాలని సూచించారు. అంశాల వారీగా చేపట్టే ఈ సెషన్లలో విధానాలపై మేధోమథనం జరిగితే పరిశ్రమలకు, ప్రభుత్వానికి, ప్రజలకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. దేశ, విదేశీ కంపెనీల ప్రతినిధులతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన సీఎంలు, మంత్రులను, నిపుణులను కూడా సదస్సుకు ఆహ్వానించాలని చెప్పారు. జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలు, ప్రముఖ విద్యాసంస్థలు కూడా హాజరయ్యేలా చూడాలన్నారు. దేశ ప్రయోజనాలు ఆశించి అంతర్జాతీయ స్థాయి కార్యక్రమంగా ఈ భాగస్వామ్య సదస్సును ఏపీ నిర్వహిస్తుందని తెలిపారు. ఏఐ ఫర్ గుడ్, సెమీకండక్టర్లు, ఆరోగ్య రంగం, ఆవిష్కరణలు, పరిశోధన-అభివృద్ధి, అంతరిక్షం, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్ టెక్, స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్, చైన్ లింకేజీతో పాటు నాణ్యమైన ఉత్పత్తుల తయారీపైనా చర్చ జరగాలని చెప్పారు. లాజిస్టిక్స్ రంగంలో రహదారులు, అంతర్గత జలరవాణా, వేర్ హౌస్, కోల్డ్ స్టోరేజీలు.. అగ్రిటెక్, రేర్ ఎర్త్ మినరల్స్‌లో విలువ జోడింపు, స్వచ్ఛాంధ్ర, సర్క్యులర్ ఎకానమీ, పీ-4 లాంటి అంశాలపై కూడా చర్చించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.

> విశాఖ భాగస్వామ్య సదస్సులో రాష్ట్రంలో వనరులు, పెట్టుబడుల అవకాశాలను వివరించేలా ప్రజెంటేషన్లు సిద్ధం చేయాలి. '21వ శతాబ్దం భారత్‌దే' అన్న విధానంలో ప్రజెంటేషన్లు ఉండాలి.
>
> పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వ విధానాలే కీలకం. రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక పాలసీల వల్లే గూగుల్ లాంటి దిగ్గజ ఐటీ కంపెనీలు భారీ పెట్టుబడులతో ముందుకొచ్చాయి.
>
> \- సీఎం చంద్రబాబు

నిరంతరం నైపుణ్య కల్పన..

విశాఖలో 5 బిలియన్ డాలర్ల అతిపెద్ద పెట్టుబడితో గూగుల్ డేటా ఏఐ హబ్ ఏర్పాటు చేస్తోందని.. ఆ సంస్థ రాకతో విశాఖ హ్యాపెనింగ్ సిటీగా మారిందని సీఎం చెప్పారు. సానుకూల విధానాలతోనే పెట్టుబడులు వస్తాయని.. అప్పుడే సంపద సృష్టికి ఆస్కారం కలుగుతుందన్నారు. 'పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య కల్పన నిరంతర ప్రక్రియగా ముందుకు సాగాలి. మానవ వనరులే మనకు ఉన్న అతిపెద్ద మూలధనం. వీటన్నిటిపైనా భాగస్వామ్య సదస్సులో చర్చ జరగాలి' అని పేర్కొన్నారు. విశాఖ సదస్సుకు హాజరయ్యే వారికి హోం స్టేలో వసతి కల్పించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. చర్చించాల్సిన వివిధ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్తలాంటి కార్యక్రమాలను అనుసంధానించాలన్నారు. 'ఏపీ టూ ఏఐ' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఆర్థిక కారిడార్లు, పారిశ్రామిక క్లస్టర్లు, అమరావతి బ్లూ గ్రీన్ క్యాపిటల్, జలభద్రత, ఫ్యూచరిస్టిక్ వర్క్ ఫోర్స్, సుపరిపాలనలో టెక్నాలజీ అనుసంధానం లాంటి అంశాలను సదస్సులో ప్రస్తావించాలని చెప్పారు.

● రాజకీయ మూర్ఖులు..

ఎప్పటికీ బాగుపడరు!

పెట్టుబడులపై ఇష్టమొచ్చినట్లు వాగుతున్నారు: సీఎం

- విశాఖకు 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి
- మూడేళ్లలో అమరావతి జాతికి అంకితం
- ఉద్యోగులూ.. స్మార్ట్‌గా పనిచేయండి: సీఎం
- పున్నమి ఘాట్‌లో దీపావళి వేడుకలకు హాజరు

అమరావతి/విజయవాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులపై ఇష్టం వచ్చినట్లు వాగుతున్నారు. రాజకీయ మూర్ఖులే అలా మాట్లాడతారు. వీళ్లు ఎప్పటికీ బాగుపడరు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వైసీపీ నేతలపై మండిపడ్డారు. ఆదివారం విజయవాడలో కృష్ణా నది పున్నమి ఘాట్‌లో జరిగిన దీపావళి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విశాఖకు 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి వచ్చిందన్నారు. 'ఏ అంటే ఆంధ్రప్రదేశ్.. రానున్న రోజుల్లో బ్రాండ్ ఏఐగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుంది. ఏఐలో విశాఖపట్నం హెడ్‌క్వార్టర్‌గా నిలుస్తుంది' అని చెప్పారు. పదేళ్లలో ఈ రంగంలో ఊహించనంత అభివృద్ధి జరుగుతుందని.. అన్ని రంగాల్లో పెనుమార్పులొస్తాయన్నారు. 'వైజాగ్ ఏఐ హబ్ నుంచే ప్రపంచం మొత్తానికీ సేవలు అందించాలి. యువత ఏఐ నేర్చుకుని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా గూగుల్ సేవలందిస్తున్న ప్రతి ప్రాంతానికీ ఈ డేటా సెంటర్‌తో అవసరం ఉంటుంది. దీనిని ఉపయోగించుకోవాలనుకునే వారు వైజాగ్‌లో సంస్థలు పెడతారు. కేబుల్‌ను సింగపూర్ వరకు తీసుకెళ్లి ప్రపంచం మొత్తం అనుసంధానం చేస్తారు' అని చెప్పారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో వినియోగదారులు, చిరువ్యాపారులంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు. వీటిపై దసరా నుంచి ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. 2019-24 మధ్య పండుగలే జరుపుకోలేని పరిస్థితులున్నాయని చెప్పారు. ఒకప్పుడు దసరా అంటే కోల్‌కతా, మైసూరు గుర్తొచ్చేవని.. ఈసారి దసరా అంటే విజయవాడ కూడా గుర్తొచ్చేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారని.. ఇందుకు 'వైబ్రెంట్ విజయవాడ'కు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, రాష్ట్ర జీఎస్టీ కమిషనర్ అహ్మద్ బాబు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు వసంత కృష్ణ ప్రసాద్, గద్దే రామమోహనరావు, మాజీ ఎమ్మెల్యే బుద్దా వెంకన్న, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే..

> ఆ ఐదేళ్లలో ఎక్కడ చూసినా అప్పులే. ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల్లో బాగా సహకరించారు. ఎన్ని కష్టాలున్నా వారికి దీపావళి శుభాకాంక్షలు చెప్పడం కోసమే డీఏ విడుదలకు నిర్ణయించాం. హెల్త్‌కార్డులు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చాం. పోలీసులకు సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఇచ్చాం. ఉద్యోగులూ.. ఒకప్పుడు అందరం హార్డ్‌వర్క్ చేసేవాళ్లం.. ఇప్పుడు స్మార్ట్ వర్క్ చేయాల్సిన అవసరం ఉంది. సాయంత్రం 6 తర్వాత పనిచేయొద్దు. విపత్తు సమయాల్లోనే ఎక్కువ పనిచేయండి. శని, ఆదివారాలు ఇంటి వద్దే నచ్చిన పనులు చేసుకుని సోమవారం నుంచి ఉత్సాహంగా పనిచేయండి.
>
> **ఉద్యోగులూ ఆరు తర్వాత పని చేయొద్దు**

నరకాసురుడికి ప్రజలే బుద్ధి చెప్పారు

సమాజాన్ని అతలాకుతలం చేసిన నరకాసురుడిని శ్రీకృష్ణుడు సత్యభామతో వచ్చి వధిస్తే.. రాష్ట్రంలోని నరకాసురుడికి ప్రజలే ఓటుతో బుద్ధి చెప్పారు. ఏపీ చరిత్రలో ఎప్పుడూ లేని స్థాయిలో 94 శాతం స్ట్రైక్ రేట్‌తో మా కూటమిని గెలిపించారు. రాష్ట్రంలో ఇక వైకుంఠపాళి వద్దు. అది ఉంటే మన జీవితాలు బాగుపడవు. 22 మంది ఎంపీలు ఉండడం వల్ల కేంద్రంలో అన్ని పనులూ అవుతున్నాయి. 16 నెలల్లో మళ్లీ ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టాం. రికార్డు స్థాయిలో పింఛన్లు, స్త్రీశక్తి, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, అన్న క్యాంటీన్లు, దీపం-2, ఆటోడ్రైవర్లకు సాయం అందించాం. అమరావతి పనులు ప్రారంభమయ్యాయి. రూ.50-60 వేల కోట్ల విలువైన పనులను మూడేళ్లలో పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ పెడుతున్నాం. వైజాగ్‌ను ఏఐ హబ్‌గా అభివృద్ధి చేయడానికి తొలి అడుగు పడింది.

స్వర్ణాంధ్ర నంబర్ వన్‌గా ఉండాలి..

2047నాటికి భారత్ ప్రపంచంలోనే నంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా ఉంటుంది. అందులో స్వర్ణాంధ్ర ప్రదేశ్ నంబర్ వన్‌గా ఉండాలని కోరుకుంటున్నాను. అది తప్పకుండా సాధ్యమవుతుంది. విజయవాడలో ఉండేవాళ్లు ప్రపంచంలో బ్రహ్మాండంగా రాణిస్తున్నారు. మీతో పుట్టిన వాళ్లు పేదరికంలో ఉన్నారు. అలాంటి వారి బాధ్యతను పీ-4 కార్యక్రమం కింద తీసుకోవాలి.

దీపావళి వేడుకల్లో చంద్రబాబు దంపతులు

పున్నమిఘాట్‌లో నిర్వహించిన దీపావళి వేడుకల్లో చంద్రబాబు బాణసంచా కాల్చే కార్యక్రమాన్ని రిమోట్‌తో ప్రారంభించారు. భార్య భువనేశ్వరితో కలిసి బాణసంచా వెలుగులను ఆస్వాదించారు. ఆ వెలుగులను తన మొబైల్ ఫోన్‌లో బంధించారు. మధ్యమధ్యలో చిన్నారులను పలుకరిస్తూ ఆప్యాయంగా మాట్లాడారు.

'కందుకూరు హత్య' బాధితులకు హోం మంత్రి అనిత పరామర్శ

గుంటూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గ పరిధిలోని దారకానిపాడులో జరిగిన దారుణ ఘటనలో తిరుమలశెట్టి లక్ష్మయ్యనాయుడు హత్యకు గురికాగా, ఆయన ఇరువురు సోదరులు తిరుమలశెట్టి పవన్, భార్గవ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వారు గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి హోం మంత్రి అనిత.. ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, కన్నా లక్ష్మీనారాయణలతో కలిసి ఆసుపత్రిలో వారిని పరామర్శించారు. వారి తండ్రి శ్రీనివాసరావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికీ రూ.రెండున్నర లక్షల చొప్పున చెక్కులను అందించారు.



గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, కన్నా లక్ష్మీనారాయణ

నా భర్తది కుల హత్య కాదు!

- కులం రంగు పులమడం దారుణం
- హరిశ్చంద్రప్రసాద్ కొన్నాళ్లుగా బెదిరిస్తున్నారు: లక్ష్మయ్య భార్య వెల్లడి
- కందుకూరు హత్యపై సీఎం సీరియస్

కందుకూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం పరిధిలోని దారకానిపాడు గ్రామంలో ఈ నెల 2న జరిగిన దారుణ హత్యపై కులం కుంపట్లు రాజుకున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. వైసీపీ నేతలు ఈ హత్యకు, రాష్ట్రంలోని రెండు కులాలకు మధ్య సంబంధం అంటగట్టి చేస్తున్న ప్రచారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యటించి, బాధిత కుటుంబాన్ని కలుసుకుని వాస్తవాలు తెలుసుకోవాలని హోం మంత్రి అనిత, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణలను ఆదేశించారు. దీంతో ఆదివారం రాత్రి మంత్రులు దారకానిపాడు గ్రామానికి వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మయ్యనాయుడు భార్య సుజాత మాట్లాడుతూ.. తన భర్తది కుల హత్య కాదని స్పష్టం చేశారు. కారుతో గుద్ది చంపిన హరిశ్చంద్రప్రసాద్ కొన్నాళ్లుగా తన భర్తను బెదిరించినట్టు తెలిపారు. తన భర్త హత్యకు కులం రంగు పులమడం బాధగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని తాము కోరుకుంటున్నామని, కులం పేరుతో తమ కుటుంబాన్ని వేధించవద్దని విజ్ఞప్తి చేశారు.

నీచ రాజకీయాలు చేయొద్దు: అనిత

లక్ష్మయ్య నాయుడు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ హామీ ఇచ్చారు. ప్రభుత్వం, పార్టీ తరఫున సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబంతో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు ఫోన్ చేయించి మాట్లాడించారు. అనంతరం లక్ష్మయ్య నాయుడి భార్య సుజాత, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి మంత్రులు మీడియాతో మాట్లాడారు. కులాలు, మతాలతో రాజకీయాలు చేయవద్దని ప్రతిపక్ష వైసీపీకి అనిత హితవు పలికారు. లక్ష్మయ్య నాయుడు హత్య అత్యంత కిరాతకంగా జరిగిందని, హత్యకు పాల్పడిన హరిశ్చంద్రప్రసాద్‌ను, అతని తండ్రి మాధవరావును పోలీసులు వెంటనే అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారని తెలిపారు. అయితే ఈ హత్యకు కులాలు, మతాలు అంటకట్టి విద్వేషాలు రెచ్చగొట్టాలని కొందరు ప్రయత్నించడం శోచనీయమన్నారు. ఈ ఘటనకు.. కులాలకు సంబంధం లేదన్నారు. బాధితులు సైతం కులప్రమేయం లేదని చెబుతున్నా, నీచరాజకీయాలు చేస్తున్నవారు తమ ప్రయత్నాలు మానుకోలేదని మండిపడ్డారు. సోషల్ మీడియా ద్వారా కులాల మధ్య చిచ్చు పెట్టడానికి, విద్వేషాలు రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్న వారిపై చట్టపరిధిలో క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్పెషల్ కోర్టు ఏర్పాటు చేసి కేసును త్వరగా విచారించేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్టు తెలిపారు. ఈ హత్యకు కులాలను ఆపాదించడం సరికాదని, వీలైతే బాధిత కుటుంబానికి సాయం చేయాలని మంత్రి అనిత సూచించారు. వాస్తవ పరిస్థితులను సీఎం చంద్రబాబుకు నివేదిస్తామని మంత్రి తెలిపారు.

కులాలను రెచ్చగొట్టడం సరికాదు

తన భర్తను దారుణంగా హత్య చేసిన కిరాతకులను కఠినంగా శిక్షించాలని కోరుకుంటున్నట్టు లక్ష్మయ్య నాయుడి భార్య సుజాత అన్నారు. ఈ హత్యలో కులాల ప్రమేయం లేదని స్పష్టం చేశారు. కులాలను రెచ్చగొడుతూ జరుగుతున్న వ్యవహారం తమకు బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. "హత్యకు కొద్దిరోజుల ముందు నుంచే.. 'నీ భర్తను చంపేస్తా' అంటూ హరిశ్చంద్ర ప్రసాద్ బెదిరించాడు. ఆ విషయం నా భర్తకు కూడా చెప్పాను. చివరకు అన్నంతపని చేశాడు. వారిని కఠినంగా శిక్షించాలి. మా కుటుంబానికి రక్షణ కల్పించాలి." అని సుజాత విజ్ఞప్తి చేశారు. "నాకు న్యాయం జరిగేలా చూస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. నా ఆవేదనను వారికి వివరించాను. కఠిన చర్యలు తీసుకోవాలని కోరాను. సీఎం నాకు ధైర్యాన్నిచ్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మా కుటుంబానికి అన్యాయం చేసిన వ్యక్తులను జైలు నుంచి బయటకు రానీయకుండా చూడాలని కోరాను." అని సుజాత అన్నారు.



దోషులను శిక్షిస్తాం: సీఎం, డిప్యూటీ సీఎం

లక్ష్మయ్య నాయుడు కుటుంబ సభ్యులతో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, దోషులను కఠినంగా శిక్షిస్తామన్నారు. ధైర్యంగా ఉండాలని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. కాగా.. మంత్రుల వెంట వచ్చిన తాడేపల్లి గూడెం జనసేన పార్టీ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్.. బాధిత కుటుంబ సభ్యులకు రూ.2.5 లక్షల ఆర్థిక సాయం అందించారు.

కులాల కుంపట్లు రాజేస్తున్న వైసీపీ: నిమ్మల



పాలకొల్లు అర్బన్: రాజకీయ దిగజారుడు తనానికి వైసీపీ నిదర్శనమని, కులాల కుంపట్లు రాజేయాలనుకోవడం రాక్షస మనస్తత్వమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నెల్లూరు ఘటనకు కులం రంగు పులిమి విష ప్రచారం చేయడం తగదన్నారు. కులం రంగు పులిమి అక్కడ శవ రాజకీయం చేస్తున్నారని వైసీపీ నాయకులపై ఆయన విరుచుకుపడ్డారు. ఇరువురి వ్యక్తిగత గొడవలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆ రెండు కులాలకు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఈ ఘటనలో నిందితుడిని, అతని తండ్రిని ప్రభుత్వం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిందన్నారు. వాస్తవాన్ని వక్రీకరించి కుల రంగు పులమడం మానుకోవాలని హితవు పలికారు.

ఈ మారీచులతో జాగ్రత్త

- ప్రజాస్వామ్య యుద్ధంలో ఓడించారనే అక్కసుతో ప్రజల మధ్య విభేదాల సృష్టికి కుట్రలు
- ఈ నయా నరకాసురులకు గుణపాఠం చెప్పాలి
- ఆడపడుచులు సత్యభామ స్ఫూర్తి అందిపుచ్చుకోవాలి
- ఏపీ ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ పిలుపు



అమరావతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపకాంతులతో శోభాయమానంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించుకొనే పండుగ దీపావళి అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలుగు ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. 'మన దేశంలో ప్రతి పండుగకూ ఒక పరమార్థం ఉంది. మనకు జీవన శైలిని నేర్పుతుంది. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి నిర్వహించుకుంటాం. దీపావళి స్ఫూర్తితో నయా నరకాసురులను ప్రజాస్వామ్య యుద్ధంలో ప్రజలందరూ కలిసి ఓడించారు. ఈ నరకాసురులు మారీచుల్లాంటివారు. రూపాలు మార్చుకొంటూ, తమను ఓడించారనే అక్కసుతో, ప్రజల మధ్య విభేదాలు సృష్టించి, అశాంతిని రేకెత్తించే కుట్రలకు దిగుతున్నారు. వీరిపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి నయా నరకాసురులకు, వారి అనుచర గణానికి ఎప్పటికప్పుడు గుణపాఠం చెప్పాలి. ఆడపడుచులు సత్యభామ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి' అని ఆదివారం ఓ ప్రకటనలో పవన్ పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, దీపావళిని పర్యావరణహితంగా చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కాగా, దీపావళి పండుగ ప్రతి ఇంట్లో వెలుగులు నింపాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆకాంక్షించారు. ఆరోగ్యం కంటే గొప్ప సంపద లేదని, ప్రజల ఆరోగ్య సంరక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పేర్కొంటూ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



విజయవాడ బీసెంట్ రోడ్డులో ప్రజలకు చంద్రబాబు అభివాదం

బీసెంట్ రోడ్‌లో వ్యాపారులతో చంద్రబాబు మాటామంతీ

విజయవాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):ఆదివారం రాత్రి విజయవాడ బీసెంట్ రోడ్డులో సీఎం చంద్రబాబు పర్యటించారు. వివిధ వర్గాల వ్యాపారులతో ముచ్చటించారు. జీఎస్టీ తగ్గించిన తర్వాత వ్యాపారాల పరిస్థితి ఎలా ఉంది? అమ్మకాలు, కొనుగోళ్లు ఎలా ఉన్నాయి? ఏయే వస్తువులపై ఎంతెంత ధరలు తగ్గాయి? అన్న విషయాలను వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. బీసెంట్ రోడ్డులోని వ్యాపారులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. వీధి వ్యాపారి చింతలపూడి దుర్గారావు, సీఎం చంద్రబాబు మధ్య సంభాషణ ఇలా సాగింది.

చంద్రబాబు: ఏ వ్యాపారం చేస్తావు?
దుర్గారావు: జ్యూట్ బ్యాగులు, ప్రమిదల వ్యాపారం చేస్తుంటా

చంద్రబాబు: వ్యాపారం ఎలా ఉంది?
దుర్గారావు: అమ్మకాలు బాగున్నాయి.

చంద్రబాబు: రోజుకు ఎంత వ్యాపారం జరుగుతుంది?
దుర్గారావు: పెట్టుబడి ఖర్చులు వస్తున్నాయి.

తర్వాత సీఎం చంద్రబాబు వీధి వ్యాపారి యక్కలి బాలకృష్ణతో మాట్లాడారు. తర్వాత చెప్పుల షాపు యజమాని చదలవాడ వెంకటకృష్ణారావుతో ముచ్చటించారు. వ్యాపారం నడుస్తున్న తీరు, చెప్పులపై జీఎస్టీ తగ్గుదల, విక్రయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వస్త్రదుకాణానికి వెళ్లి సేల్స్‌గర్ల్ గొడవర్తి లక్ష్మితో ముఖ్యమంత్రి మాట్లాడారు. అనంతరం కిరాణా షాపు నిర్వాహకుడు బొడ్డు శ్రీనివాస్‌తో మాట్లాడారు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గింపు ఎంత వరకు ఉందని అడిగారు. ఇంతకుముందు, ఇప్పుడు ధరల వ్యత్యాసం గురించి అడిగి సీఎం తెలుసుకున్నారు.



బీసెంట్ రోడ్డులోని దుకాణదారులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

'ఉపాధి'లో

దొంగ మస్టర్లకు చెక్!

» ఎన్ఎంఎంఎస్ యాప్‌తో అక్రమాల కట్టడి

» పని ప్రాంతానికి వస్తేనే మస్టర్ నమోదు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకంలో దొంగ మస్టర్లకు ఇక చెక్ పడనుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న చర్యలతో పాటు ఎన్ఎంఎంఎస్ యాప్‌తో అక్రమాలను కట్టడి చేయనున్నారు. గతంలో మన రాష్ట్రం టీసీఎస్ ద్వారా అభివృద్ధి చేసిన ఎస్ఆర్‌జీఏ సాఫ్ట్‌వేర్ స్థానంలో కేంద్ర ప్రభుత్వ ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ వచ్చిన తర్వాత అందులోని లోపాలను ఆసరా చేసుకుని దొంగ మస్టర్లు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ దొంగ మస్టర్లను కట్టడి చేయడం అధికార యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. గత వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా దొంగ మస్టర్ల నమోదుతో గ్రామాల్లో ఉపాధి పనుల వాతావరణం దెబ్బతింది. అప్పట్లో మండల కార్యాలయాల్లో కూర్చొని మస్టర్లు నమోదు చేయడం ద్వారా శ్రామికులు క్షేత్రస్థాయిలో పనికి రావడం మానేశారు. దీంతో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత శ్రామికులతో తిరిగి ఉపాధి పనులు చేయించడం కష్టంగా మారింది. దొంగ మస్టర్ల వ్యవహారం కొనసాగుతూనే వచ్చింది. ఈ నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు దొంగ మస్టర్లను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. దీంతో పాటు కేంద్రం దొంగ మస్టర్ల కట్టడికి ఎన్ఎంఎంఎస్(నేషనల్ మొబైల్ మానిటరింగ్ సర్వీసు) యాప్‌ను అమల్లోకి తెచ్చింది. సిబ్బంది ఈ యాప్ ద్వారా పని ప్రదేశాల్లో శ్రామికుల ఫొటోలు తీస్తారు. ఫేస్ రికగ్నిషన్ ద్వారా కూలీలు ఆ రోజు పనికి హాజరైనట్లు గుర్తిస్తుంది. దీంతో శ్రామికుడికి ఆ రోజు వేతనం మంజూరవుతుంది. ఈ యాప్‌లో రోజుకు రెండుసార్లు ఫొటోలు తీస్తారు.

నకిలీ జాబ్‌కార్డుల కట్టడి

ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు నకిలీ జాబ్ కార్డుల కారణంగానే ఎక్కువ దొంగ మస్టర్లు నమోదవుతున్నాయి. చట్టం ప్రకారం ఒక్కో కుటుంబానికి వంద రోజుల పని కల్పిస్తారు. గ్రామాల్లో కొన్ని చోట్ల ఆయా కుటుంబసభ్యుల్లో ఒకరినో, ఇద్దరినో వేరు చేసి సింగిల్ జాబ్‌కార్డులను క్రియేట్ చేస్తారు. తద్వారా ఆ కార్డులకు కూడా వంద రోజుల పని అవకాశం ఏర్పడుతుంది. దీంతో పనులు చేయకుండానే మస్టర్లు వేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విధంగా ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, రాజకీయపార్టీల కార్యకర్తలు అక్రమాలకు పాల్పడి ఉపాధి పథకం స్ఫూర్తిని దెబ్బతీశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నకిలీ జాబ్‌కార్డుల కట్టడికి శ్రీకారం చుట్టింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి సూచనల మేరకు రాష్ట్ర సోషల్ ఆడిట్ డైరెక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ రంగంలోకి దిగి 5,400 పంచాయతీల్లో ఉన్న నకిలీ జాబ్‌కార్డులను ఏరివేసింది. సుమారు 50 వేలకు పైగా నకిలీ జాబ్‌కార్డులను రద్దు చేశారు. దీంతో అక్రమాలకు అడ్డాగా ఉన్న సింగిల్ జాబ్‌కార్డుల బెడద తగ్గింది.

ఉపాధి శ్రామికులకు ఈ-కేవైసీ

రాష్ట్రంలో ఉపాధి పథకంలో పనిచేసే ప్రతి శ్రామికుడి ఉపాధి జాబ్‌కార్డును ఈ-కేవైసీ చేసేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ శ్రీకారం చుట్టింది. ప్రతి జాబ్‌కార్డును ఆయా శ్రామికుడి ఆధార్ నంబర్‌తో లింక్ చేస్తారు. దీంతో ఫేస్ రికగ్నిషన్‌కు సులభంగా ఉంటుంది. శ్రామికుడి ఫొటో తీయగానే.. ఆ ఫొటోతో ఆధార్ లింక్ అయి, హాజరును గుర్తిస్తుంది. దీంతో కచ్చితంగా గ్రామంలో ఉంటూ పనికి వచ్చిన శ్రామికుడికే మస్టర్ నమోదవుతుంది. దొంగ మస్టర్లు వేయాలన్న ప్రయత్నాలకు చెక్ పడుతుంది. ప్రస్తుతం ఈ-కేవైసీ ప్రక్రియను ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారానే చేపడుతున్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే ఎన్ఎంఎంఎస్ ద్వారా ఫొటోలు తీసి హాజరును గుర్తిస్తారు. దీంతో దొంగ మస్టర్లపై వస్తున్న ఫిర్యాదుల వెల్లువ తగ్గుతుందని భావిస్తున్నారు. దొంగ మస్టర్ల కట్టడికి సోషల్ ఆడిట్ విభాగం ఇప్పటికే డేగ కళ్లతో తనిఖీలు చేపడుతోంది.

రేపు అల్పపీడనం

» 2 రోజుల్లో వాయుగుండంగా బలోపేతం

» రాష్ట్రానికి భారీ, అతిభారీ వర్షాలు: ఐఎండీ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్):

దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంపై ఆవరించిన ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతోంది. దీని ప్రభావంతో మంగళవారం ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఆ తర్వాత 48 గంటల్లో అది పశ్చిమవాయవ్యంగా పయనిస్తూ వాయుగుండంగా బలపడనుందని, దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు మధ్య తీరం దాటనుందని వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. అయితే, వాయుగుండం మరింత బలపడి తుఫాన్‌గా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని కోస్తా జిల్లాలపై అధిక ప్రభావం ఉంటుందన్నారు. అల్పపీడనం తీరం దిశగా వచ్చే క్రమంలో వర్షాలు పెరగనున్నాయి. దీనికితోడు బంగాళాఖాతం నుంచి వీస్తున్న తూర్పుగాలుల ప్రభావంతో రాష్ట్రంలోని పలు చోట్ల ఆదివారం వర్షాలు కురిశాయి. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నెల్లూరులో 4.9, విజయనగరం జిల్లా గొల్లపాడులో 4.3, పాత్రేరులో 4.1, అల్లూరి జిల్లా కాకరపాడులో 3.9 సెంటీమీటర్ల వాన పడింది. సోమవారం నుంచి శుక్రవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా అనేకచోట్ల వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. సోమ, మంగళవారాలు కొన్నిచోట్ల భారీ వర్షాలు, బుధ, గురు, శుక్రవారాలు శ్రీకాకుళం జిల్లా నుంచి తిరుపతి జిల్లా వరకు పలుచోట్ల



విజయవాడలో కురిసిన భారీ వర్షంతో రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద నిలిచిన నీరు

భారీ, అక్కడక్కడ అతిభారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఇది వ్యవసాయ పంటలపై ప్రభావం చూపుతుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కాగా, సోమవారం బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో పలు చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మంగళవారం పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో పలు చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

డాక్టర్ వేములపల్లి రాఘవేంద్ర చౌదరికి హెన్రీ ఫోర్డ్ పురస్కారం

» అమెరికాలో అత్యుత్తమ సేవలకు దక్కిన గుర్తింపు





డెట్రాయిట్, అక్టోబరు 19: అమెరికాలో ఉంటోన్న తెలుగు తేజం, డాక్టర్ వేములపల్లి రాఘవేంద్ర చౌదరికి హెన్రీ ఫోర్డ్ పురస్కారం లభించింది. అమెరికా డెట్రాయిట్‌లోని హెన్రీ ఫోర్డ్ హెల్త్ సంస్థలో అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను ఆయనకు ఈ విశిష్ట సేవా పురస్కారం దక్కింది. గతంలో ఆయన హెన్రీ ఫోర్డ్ ఆసుపత్రిలో పలు విభాగాల్లో పని చేసి ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం ఫ్యామిలీ మెడిసిన్ సేవల విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. గడచిన 3 దశాబ్దాల్లో వందల మంది వైద్యులకు ఆయన మార్గనిర్దేశం చేశారు. డాక్టర్ వేములపల్లి పూర్వీకులది ఆంధ్రప్రదేశ్ హనుమాన్ జంక్షన్ దగ్గర్లోని వేలేరు. మద్రాసు స్టాన్లీ మెడికల్ కళాశాల నుంచి 1982లో ఎంబీబీఎస్ పట్టా అందుకున్నాక ఇంగ్లాండ్‌లో ఎఫ్ఆర్‌సీఎస్ చేశారు. 1995-1998 మధ్య హెన్రీ ఫోర్డ్ ఆసుపత్రిలో సేవలందించారు. హెన్రీ ఫోర్డ్ పురస్కారం అందుకున్న సందర్భంగా ఈ నెల 23న డెట్రాయిట్‌లోని సెయింట్ మార్టినస్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో రాఘవేంద్ర చౌదరికి సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.